thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 7 కరీంనగర్ మంగళవారం, 18 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇస్రో కోసం స్వదేశీ 32-బిట్ మైక్రోప్రాసెసర్లు

బెంగళూరు : ఇస్రోకు చెందిన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, చండీగఢ్‌లోని సెమీకండక్టర్ లేబొరేటరీ (ఎస్‌సీఎల్) సంయుక్తంగా స్పేస్ అప్లికేషన్ల కోసం విక్రమ్ 3201, కల్పన 3201 అనే 32-బిట్ మైక్రోప్రాసెసర్లను అభివృద్ధి చేశాయి.

ఈ మేరకు తొలి ఉత్పత్తులను కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్.. ఇస్రో చైర్మన్ వి నారాయణన్‌కు అందజేశారు. విక్రమ్ 3201ను లాంచ్ వెహికిల్స్ కోసం స్వదేశీయంగా తయారు చేశారు. ఇది కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనైనా ఉపయోగించడానికి అర్హత సాధించిన మొట్టమొదటి భారతీయ తయారీ 32 బిట్ మైక్రోప్రాసెసర్.




# అసెంబ్లీ ముందుకు బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు..

## అన్ని పార్టీల మద్దతు కోరుతూ తీర్మానం

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో ప్రభుత్వం కీలక బిల్లులను ప్రవేశ పెట్టింది. రాష్ట్రంలో సామాజిక వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో పాటు దేవాదాయ చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం సభ ముందుకు తీసుకొచ్చింది. అయితే, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ రిజర్వేషన్ బిల్లును, మంత్రి దామోదర రాజనర్సింహా ఎస్సీ వర్గీకరణ బిల్లును సభలో ప్రవేశ పెట్టారు. అదేవిధంగా దేవాదాయ చట్ట సవరణ బిల్లును మంత్రి కొండా సురేఖ అసెంబ్లీ ముందుకు తీసుకొచ్చారు. తెలుగు యూనివర్శిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టే బిల్లును ప్రభుత్వం సభలో ప్రవేశ పెట్టింది. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అయితే, బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం ప్రభుత్వం సామాజిక, ఆర్థిక కుల సర్వే నిర్వహించింది. ఈ నివేదిక ప్రకారం బీసీలతో పాటు కులాల వారీగా జనాభా లెక్కలు వెల్లడయ్యాయి. బీసీల జనాభా ప్రకారం సామాజిక న్యాయం కల్పించేందుకు వారి రిజర్వేషన్లు 42శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రస్తుతం రాష్ట్రంలో 29శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. వీటిలో బీసీలకు 25శాతం రిజర్వేషన్లు, ముస్లింలకు బీసీ-ఈ కింద నాలుగు శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఈ రిజర్వేషన్లను 42శాతంకు పెంచేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టింది. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి ముందు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీ బీసీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేందుకు అన్ని పార్టీల మద్దతు కోరాలని నిర్ణయించుకున్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బీసీలకు రిజర్వేషన్లు పెంచే బిల్లుపై చర్చ సజావుగా సాగేలా చూడాలని, దీనికోసం అన్ని పార్టీల మద్దతు కూడగట్టేలా మాట్లాడాలని నిర్ణయంతీసుకున్నారు. దేశంలో మొదటిసారి చారిత్రాత్మక బీసీ రిజర్వేషన్లు పెంచుతూ బిల్లు ఆమోదం పొందిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి జాతీయ స్థాయిలో ఇతర పార్టీల నేతలను కలిసి రిజర్వేషన్ల పెంపు మద్దతు కోరాలని సమావేశంలో చర్చించారు.

## ఆదాయం తగ్గిందని సీఎం అంగీకరించారు.. ఇంతకంటే అవమానం ఉండదు



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి రూ.70 వేల కోట్ల మేర ఆదాయం తగ్గిందని సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇంతకంటే రాష్ట్రానికి ఘోర అవమానం ఇంకొకటి ఉండదని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్.. బడ్జెట్ కంటే ముందే నేరాన్ని అంగీకరించి అప్రూవర్‌గా మారారని అన్నారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అట్టర్‌ఫ్లాప్ అని అంగీకరించినట్లేనన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడానికి సీఎం అవలంబిస్తోన్న విధానాలే కారణమని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌పై ద్వేషంతో కాళేశ్వరం ప్రాజెక్టును బంద్ పెట్టి సాగును నాశనం చేశారని మండిపడ్డారు. "మాకు చాలా విషయాలు తెలుసు. మేము వాస్తవాలు బయటపెడితే సీఎంకు ఇబ్బందులు తప్పవు. భాజపా నేతలతో రహస్య భేటీలను రేవంత్ ఎందుకు ఖండించట్లేదు? ఆ రహస్య భేటీలపై భాజపా నేతలు కూడా మాట్లాడటం లేదు. రహస్య భేటీలను అంగీకరించలేకపోతే ఆ పార్టీ ఎమ్మెల్యే రాజా సింగ్‌పై చర్యలు తీసుకోవాలి. ఫార్ములా ఈ-రేస్ వద్దన్న సీఎం.. నగరంలో అందాల పోటీల నిర్వహణతో ఏం సాధిస్తారు? అందాల పోటీలకు రూ.2వేలు కోట్లు ఖర్చు చేసే బదులు.. మహిళలకు రూ.2500 చొప్పన ఇవ్వండి. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో నా తప్పు లేదు. అధికారంలోకి వచ్చాక మళ్లీ కేసును విచారణ చేయిస్తాం" అని కేటీఆర్ అన్నారు.



## బీసీ రిజర్వేషన్ల బిల్లుకు భారాస సంపూర్ణ మద్దతు ఉంటుంది: హరీశ్‌రావు

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల బిల్లుకు భారాస సంపూర్ణ మద్దతు ఇస్తుందని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఫలాలు అందినప్పుడే బీసీలు సంతోషిస్తారని అన్నారు. ఈ అంశంపై శాసనసభలో ఏకగ్రీవ తీర్మానానికి, పార్లమెంట్‌లో పోరాటానికి భారాస కలిసి వస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతూ ఓటేస్తామని చెప్పారు. బిల్లుపై రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఒత్తిడి తీసుకురావాలని హరీశ్‌రావు కోరారు.



## ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు: ప్రధాని మోదీ

ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ప్రధాని నరేంద్రమోదీ తేల్చిచెప్పారు. 2019లో క్రైస్ట్‌చర్చ్ నగరంపై జరిగిన దాడి అయినా.. 2008లో ముంబయిపై దాడి అయినా తమవైఖరి ఒకటే అని స్పష్టంచేశారు. ఉగ్రవాదులు, వేర్పాటువాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సహకారాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. మనదేశంలో పర్యటిస్తోన్న న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో భేటీ అనంతరం మోదీ ఈ విధంగా స్పందించారు. న్యూజిలాండ్‌లో కొన్ని శక్తులు భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయాన్ని ఆ దేశ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఇక భేటీలో భాగంగా వాణిజ్యం, రక్షణ, విద్య, వ్యవసాయం వంటి రంగాలపై వారి మధ్య చర్చలు జరిగాయి.

# గత పాలకులలకు మల్లే అబద్ధాల పునాదుల మీద మేం ప్రభుత్వాన్ని నడపలేం




# ఉన్నది ఉన్నట్లు చెబుతున్నాం... పథకాల అమలుకు కృషి చేస్తున్నాం...

## 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు పార్టీ నేతలతో కలిసి ఈ పథకాన్ని సీఎం ప్రారంభించారు. సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం అన్నారు. తొలి ఏడాదిలోనే ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రంలో 50లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. త్వరలోనే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 65 లక్షల మంది మహిళలకు 1.20 కోట్ల నాణ్యమైన చీరలు పంపిణీ చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడింది..** "దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో ఇప్పటివరకూ కులగణన జరగలేదు. సమాజానికి ఎక్స్ రే వంటి కులగణన దేశమంతా జరగాలని రాహుల్ గాంధీ చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ.. అసెంబ్లీలో బిల్లు కూడా ప్రవేశపెట్టాం. ఎస్సీల వర్గీకరణ కోసం 35 ఏళ్లుగా ఉద్యమం సాగుతోంది. దశాబ్దాలుగా నానుతున్న ఎస్సీ వర్గీకరణపై కూడా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాం. అబద్ధాల పునాదుల మీద మేము ప్రభుత్వాన్ని నడపలేం. గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడింది. దుబారా ఖర్చులను తగ్గించుకుంటూ అప్పులు చెల్లిస్తున్నాం. ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ.3 కోట్లు పెరిగింది. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైంది. ధరల పెరుగుదలను నియంత్రించడంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉంది.

**మంత్రివర్గం నుంచి మంత్రులను తొలగిస్తేనే.. పట్టు ఉన్నట్టా?...** నాకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారు. మంత్రివర్గం నుంచి మంత్రులను తొలగిస్తేనే.. పట్టు ఉన్నట్టా? అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్లు అవుతుందా? ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని మా ఎమ్మెల్యేలకు.. అసలైన అర్హులకు పథకాలు తప్పకుండా వర్తింపజేయాలని అధికారులకు చెబుతున్నాను. అన్నింటినీ సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే నా విధానం. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే మా లక్ష్యం" అని సీఎం అన్నారు.

**స్వయం ఉపాధిపైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి: డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క...** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూనే స్వయం ఉపాధి కల్పించాలనేదే ప్రభుత్వ లక్ష్యం. యువ వికాసం పథకాన్ని ఉపయోగించుకొని యువత ఉపాధి కల్పించుకోవాలి. ఉద్యోగాలు లభించక గ్రామీణ యువత ఇబ్బందులు ఎదుర్కొంటోంది. యువ వికాసం పథకాన్ని గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలి. ఏడాది వ్యవధిలోనే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు కూడా ఇచ్చాం. రాష్ట్రంలో ఒకప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ధర్నాలు జరిగేవి. ఇప్పుడు నోటిఫికేషన్ల మధ్య కొంత గ్యాప్ ఇవ్వాలని ధర్నాలు జరిగే రోజులొచ్చాయి. యువతకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పనతో పాటు స్వయం ఉపాధిపైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది" అని భట్టి అన్నారు.

**'రాజీవ్ యువ వికాసం' .. ఎవరి కోసం.. ఎందుకు?...** 'రాజీవ్ యువ వికాసం' పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. యువ వికాసానికి ఇవాళ్టి నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్ 6 నుంచి మే 30 వరకు లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల కేటాయింపు ప్రక్రియ ఉంటుంది.

**కేటగిరి-1 కింద రూ.లక్ష వరకు రుణం.. 80 శాతం రాయితీ**

**కేటగిరీ-2 కింద రూ.2 లక్షల వరకు సాయం.. 70 శాతం రాయితీ**

**కేటగిరీ-3 కింద రూ.3 లక్షల వరకు సాయం.. 60 శాతం రాయితీ ఇవ్వనుంది.**

చురకలు






## తెలంగాణ ఆత్మ గౌరవానికి సంబంధించింది పొట్టి శ్రీరాములు పేరు మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్పు అనేది తెలంగాణ ఆత్మ గౌరవానికి సంబంధించిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పొట్టిశ్రీరాములు తెలువు యూనివర్సిటీ పేరు మార్పు బిల్లుపై ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం పనిచేసిన వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందని, అందుకే పేర్లు మార్చుతున్నట్లు తెలిపారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు బిల్లుపై చర్చలో సందర్భంగా.. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించందని తెలిపారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను ఎవరూ తక్కువ చేయడం లేదని, గాంధీ ఆదర్శంతో ప్రాణత్యాగంతో మద్రాస్ నుంచి ఆంధ్ర ఏర్పాటుకోసం ఆయన చేసిన త్యాగాన్ని ఎవరూ తక్కువగా చూడటం లేదని అన్నారు. అదే సందర్భంలో తెలంగాణ వైతాళికులను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పొట్టి శ్రీరాములు పేరుకు బదులు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని కూనంనేని సూచించారని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. 2014 పునర్విభజన తర్వాత తెలంగాణకు కొన్ని సంస్థలు, యూనివర్సిటీలు వచ్చాయని, పరిపాలన, పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఆనాడు తెలంగాణ ఏర్పాటుకు, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు కృషి చేసిన వారి పేర్లను మన సంస్థలకు పెట్టుకోవడం జరుగుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక ప్రాంతంలో ఉన్నవి ఆంధ్రకు, తెలంగాణలో ఉన్నవి తెలంగాణకు కేటాయించడం జరిగిందని, అందులో భాగంగా పేర్లు మార్చుకోవడంం జరుగుతోందని చెప్పారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆంధ్రకు వెళ్లిందని, తెలంగాణ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకోవడం జరిగిందని అన్నారు. దీనికి అర్థం ఎన్టీఆర్ పై గౌరవం లేనట్లు కాదని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రంలో పేరును మార్చుకోవడంలో భాగంగా ఆచార్య ఎన్జీ అగ్రికల్చర్ యూనివర్సిటీకి.. ప్రొ.జయశంకర్ యూనిర్సిటీగా మార్చుకోవడం జరిగిందని అన్నారు. హార్టీ కల్చర్ యూనిర్సిటీకి కొండా లక్షణ్ బాపూజీ పేరు పెట్టుకోవడం జరిగిందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన యూనివర్సటీలకు పేర్లు మార్చుకోవడం సహజమని సీఎం అన్నారు. తెలంగాణ వెటర్నరీ యూనిర్సిటీకి పీవీ నరసింహారావు పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. అదే కోణంలో తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టుకోవడం సముచితం అని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలుగు యూనివర్సిటీకి ఆంధ్రాలో అదే పేరు కొనసాగుతోంది. కానీ తెలంగాణలో కొత్త నామకరణం చేయడం జరిగిందని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని, తెలంగాణకు అసలు భాషనే లేదు అన్న సందర్భంలో గోల్కొండ పత్రిక ప్రారంభించి కవులను ఏకథాటిపైకి తెచ్చి నడిపించారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సురవరం సేవ మరువలేనిదని అందుకే ఆయన పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టడం సముచితం అని అన్నారు.



## అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్ రావులను కలిసిన ఎమ్మెల్సీ మల్లన్న

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ మల్లన్న బీఆర్ఎస్ నేతలను కలవడం చర్చనీయాంశం అయ్యింది. ఇవాళ ( సోమవారం అసెంబ్లీ ఎల్పీలో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులతో సమావేశం అయ్యారు మల్లన్న. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ నేతలంటే ఉప్పూ నిప్పూ అన్నట్లు ఎగసిపడే మల్లన్న సడెన్ గా కలవడం చర్చలకు దారి తీస్తోంది. ఇవాళ అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టనుండటంతో సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తోంది. బీసీ బిల్లుపై ప్రభుత్వం గట్టిగా మాట్లాడేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందుకోసం మండలిలో తనకు మద్ధతు తెలపాలని కోరినట్లు తెలుస్తోంది. ఇటీవల మల్లన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రభుత్వ స్టాండ్ దాటి కులగణనపై విమర్శలకు దిగిన విషయం తెలిసిందే. అదే విధంగా ఓ వర్గం నేతలను కులం పేరున దూషించడం సంచలనంగా మారింది. పార్టీ నిబంధనలను ఉల్లంఘించినందుకు కాంగ్రెస్ స్పెండ్ చేసిన విషయం తెలిసింది. తాజాగా బీఆర్ఎస్ నేతలతో సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది.

## సీఎం రేవంత్ రెడ్డితో ఆర్.నారాయణ మూర్తి భేటీ



ప్రముఖ సినీ నటుడు, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి (%=.చ్చీుతీుఖుఖుఖు వీబతీష్ట్రఎ%) ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తిని సీఎం శాలువాతో సన్మానించారు. అయితే వచ్చే నెలలో గద్దర్ పేరు మీద తెలంగాణ సినీ అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గద్దర్ అవార్డుల విధి విధానాలు, నియమ నిబంధనలు, లోగో రూపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో ఆర్.నారాయణమూర్తి సలహాదారుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్ కు పొట్టి శ్రీరాములు పేరు..

### అసెంబ్లీలో సీఎం రేవంత్ సంచలన ప్రకటన!

రాజకీయాలు కలుషితమయ్యాయో.. నాయకుల ఆలోచనలు కలుషితమయ్యాయో తెలియడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు బిల్లును ఈ రోజు అసెంబ్లీ ఆమోదించింది. దీంతో ఆ విశ్వవిద్యాలయం ఇక సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీగా మారనుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువగా చూడడం లేదన్నారు. వారి ప్రాణత్యాగాన్ని గుర్తించి అందరూ స్మరించుకోవాలన్నారు. పరిపాలనలో భాగంగా కొన్ని పాలనా పరమైన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకున్నామన్నారు. రాష్ట్ర పునర్విభజన తరువాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కొన్ని వర్గాలకు కొందరు అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కేంద్ర పదవుల్లో ఉన్నవారు కూడా ఇలా చేయడం సమంజసం కాదన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నామన్నారు. ఇది ఎన్టీఆర్ ను అగౌరవ పరిచినట్లు కాదన్నారు.



**ఒకే పేరుతో రెండు యూనివర్సిటీలు ఉంటే ఇబ్బందులు..** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టామని.. వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామన్నారు. వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరును పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగానే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టుకున్నామన్నారు. ఏపీలో ఆ పాత పేర్లతో కొనసాగుతున్న యూనివర్సిటీలకు తెలంగాణలో పేర్లు మార్చుకున్నామన్నారు. ఒకే పేరుతో రెండు యూనివర్సిటీలు ఉంటే పరిపాలనలో గందరగోళం ఉంటుందన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలకు, సంస్థలకు తెలంగాణ పేర్లు పెట్టుకుంటున్నామన్నారు. అంతే కానీ వ్యక్తులను అగౌరవ పరిచేందుకు కాదన్నారు. విశాల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు.. బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు కులాన్ని ఆపాదిస్తున్నారని ఫైర్ అయ్యారు. కుల, మత ప్రాతిపదికన విభజించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటే అది తప్పన్నారు. గుజరాత్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న స్టేడియం పేరు తొలగించి ప్రధాని మోదీ పేరు పెట్టారని గుర్తు చేశారు. తాము అలాంటి తప్పిదాలు చేయలేదు.. చేయమన్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందామన్నారు. చిత్తశుద్ధి ఉంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావాలన్నారు. బల్కంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్ కు రోశయ్య పేరు పెట్టుకుందామన్నారు. రోశయ్య గారి సేవలను కీర్తించుకునేలా అక్కడ వారి విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామన్నారు.

## తెలంగాణలో కల్యాణ లక్ష్మి పేరు మార్చిన సర్కార్



హైదరాబాద్: తెలంగాణలో గత ప్రభుత్వం అమలు చేసిన మరో పథకం పేరు మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కల్యాణ లక్ష్మి పథకం పేరును కల్యాణమస్తుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు మార్పుపై స్పష్టత నిచ్చారు. కల్యాణ మస్తు పథకాన్ని త్వరలోనే అమలు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లను తమ ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందని మంత్రి పొన్నం తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన...గత ఎన్నికలకు ముందు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అర్హులైన వారందరికీ లక్షల రూపాయల నగదుతో పాటు తులం బంగారాన్ని కూడా ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అయితే ఇప్పటి వరకూ పథకం అమలు కాలేదు. కానీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ప్రభుత్వం కల్యాణమస్తును కూడా త్వరలోనే అమలు చేసేందుకు సిద్ధమయింది.

## అసెంబ్లీ నుంచి ఎంఐఎం సభ్యులు వాకౌట్..



హైదరాబాద్ : నాలుగో రోజు అసెంబ్లీ సమావేశాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సభ నుంచి ఏఐఎంఐఎం సభ్యులు వాకౌట్ చేశారు. స్పీకర్ సభ నడుపుతోన్న తీరును నిరసిస్తూ వారు సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లుగా ప్రకటించారు. అనంతరం అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. అసెంబ్లీ గాంధీభవన్ కాదని.. తెలంగాణ శాసనసభ అని ఫైర్ అయ్యారు. గాంధీభవన్ తరహాలో కాకుండా అసెంబ్లీని అసెంబ్లీగా నడపాలని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల్లో కనీసం తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఒకవేళ ఇచ్చినా మాట్లాడుతుండగానే మైక్ కట్ చేస్తున్నారని ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుండటం బాధాకరమని అన్నారు.

## సంపూర్ణ రుణమాఫీ జరిగింది అంటే ... ముక్కు నేలకు రాస్తా....

### సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సవాల్



హైదరాబాద్: తెలంగాణలో రాజకీయాలు మరోసారి హీట్ ఎక్కుతున్నాయి. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు స్పందించారు. మధిర, కొడంగల్, సిద్దిపేట.. ఏ ఊరుకు పోదాం? సంపూర్ణ రుణమాఫీ జరిగింది అంటే ముక్కు నేలకు రాస్తా.. లేదంటే మీరు రాయండి అంటూ ముఖ్యమంత్రికి సవాల్ చేశారు. ప్రజలకు క్షమాపణ చెప్పాలని.. ఎప్పటి లోగా సంపూర్ణ రుణమాఫీ చేస్తారో చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ భాష వల్ల తెలంగాణ పరువు పోతుందన్నారు. అలాగే, అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ అని అన్నారు. కాంగ్రెస్ ముసుగులో ఉన్న బీజేపీ మనిషిలా రేవంత్ సభలో మాట్లాడారని ఆరోపించారు. సీఎం బూతులకు జీఎస్టీ వేస్తే రాష్ట్ర ఖజానా మొత్తం సరిపోదని సెటైర్లు వేశారు. కేసీఆర్ చావును కోరుకున్న రేవంత్.. ఆ తర్వాత మాట మార్చి బీఆర్ఎస్ ను అన్నానని చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జానారెడ్డిని కేసీఆర్ ఎప్పుడూ గౌరవంగా సంబోధించేవారని గుర్తు చేశారు. ఎలాంటి తప్పు చేయకున్నా జగదీశ్ రెడ్డిని ఏకపక్షంగా సస్పెండ్ చేయడం దారుణమని ఆయన అన్నారు. రాష్ట్రం పట్ల ప్రస్తుత సర్కారుకు బాధ్యత లేని కారణంగానే ప్రాజెక్టులు అగ్గిపెట్టెల్లా కూలిపోతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని హరీశ్ రావు దుయ్యబట్టారు. రేవంత్ నిర్లక్ష్యం వల్ల రైతులు, చేనేత కార్మికులు, ఆటో కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం చేయడం కోసం.. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు ప్రభుత్వం వెంటపడతామని అన్నారు. రైతులకు రూ. 15 వేల రైతు బంధు డబ్బులు పడే వరకు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు పట్ల కేసీఆర్ కు, బీఆర్ఎస్ పార్టీకి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని జీఎస్డీపీలో నంబర్ వన్ గా, తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో నిలిపామని గుర్తు చేశారు. విద్యుత్ వినియోగంలో, వరి ధాన్యం ఉత్పత్తిలోనూ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపామని చెప్పారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించిందని గుర్తు చేశారు.




## ఇందిర మహిళా బజారులో ఉగాది, రంజాన్ ఉత్సవాలు

హైదరాబాద్ : మాదాపూర్ లోని ఇందిరా మహిళా శక్తి బజారులో సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఉగాది, రంజాన్ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను తీ ఐఓఝుఉ మంత్రి సీతక్క ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, మహిళా వ్యాపారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి ఇందిరా మహిళా శక్తి బజార్ వేదిక కానున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.9 కోట్లతో ఇందిరా మహిళా శక్తి బజారును ఆధునీకరించింది. హైటెక్ సిటీకి పక్కనే ఈ మహిళా బజారును ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో వందకుపైగా షాపులు ఇక్కడ నిర్వహిస్తున్నారు. వివిధ రకాల ఆకట్టుకునే వస్తువులు, ఉత్పత్తులు ఈ బజారులో దొరుకుతాయి.

## విదేశీ విద్య పథకాన్ని రాజకీయం చేయాలనేది గంగుల తపన: మంత్రి సీతక్క

హైదరాబాద్: విదేశీ విద్య పథకాన్ని రాజకియం చేయాలనేది గంగుల కమలాకర్ తపన అని మంత్రి సితక్క విమర్శించారు. ఆమె శాసనసభలో మాట్లాడారు. "నేను మాట్లాడిన దాంట్లో తప్పులు ఉన్నాయని చెబుతున్నారు. విదేశీ విద్యా పథకం కింద 1913 మంది చదువుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 210 మంది ఎస్సీలు, 300 మంది బీసీలు, 100 మంది ఎస్టీలు, 500 మంది మైనార్టీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పథకం కింద మొత్తం 1,110 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. గత బకాయిలతో కలిపి రూ.167 కోట్లు చెల్లించాం. కాంగ్రెస్ వచ్చే నాటికి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిలు రూ.4,332 కోట్లు. పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలను త్వరలో చెల్లిస్తాం. హాస్టళ్లలో పిల్లలకు హాని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన విద్యార్థులకు త్వరలో ఫలాలు అందుతాయి. గత ప్రభుత్వంలో పెండింగ్ పెట్టిన బకాయిలను చెల్లిస్తూ వస్తున్నాం. విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు 212 శాతం పెంచాం. పిల్లలకు పోషకాహారం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. కల్తీ ఆహారం వంటి ఘటనలపై వెంటనే చర్యలు తీసుకున్నాం. మహిళా ఐఏఎస్ అధికారులు నైట్‌హాల్ట్ చేయాలని చెప్పాం. వివిధ హోదాల్లోని రాజకీయ నాయకులు కూడా నైట్‌హాల్ట్ చేస్తున్నారు. ఎనిమిదో తరగతి వరకు అందించే స్కాలర్‌షిప్‌లను 2022లో కేంద్రం నిలిపివేసింది. డైట్ ఛార్జీలు, స్కాలర్‌షిప్‌లను కేంద్రం నిలిపివేయడంతో రాష్ట్రప్రభుత్వంపై ఆ భారం పడింది" అని సీతక్క తెలిపారు. అంతకుముందు భారాస ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. విదేశీ విద్య పథకం కింద ఎంపికైన విద్యార్థుల సంఖ్య 1913 అన్నారు. గతంలో కేవలం బీసీల్లోనే 2,230 మందిని ఈ పథకం కింద ఎంపిక చేశారన్నారు. అయితే ఎంపికైన విద్యార్థుల సంఖ్య స్పష్టంగా చెప్పాలి. 2016లో కేసీఆర్ హయాంలో విదేశీ విద్య పథకం అమలు చేశారు. గతంలో ఏటా 300 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలు, మైనార్టీలు, ఎస్టీలకు పథకం కింద ఇచ్చింది సున్నా అని గంగుల విమర్శించారు. "జనవరిలో కేవలం 105 మంది ఎస్సీలను పథకం కింద ఎంపిక చేశారు. గతంలో 1050 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు, 2,751 మంది మైనార్టీలకు, 2123 మంది బీసీ విద్యార్థులకు, 780 మంది బ్రాహ్మణ విద్యార్థులకు ఈ పథకం అమలు చేశాం. గతంలో పేద వర్గాలకు చెందిన 6,700 మందికి ఈ పథకం అమలైంది. విదేశీ విద్య పథకం బకాయిలు వెంటనే చెల్లించాలి. ఐఐటీల్లో చదివే పేద విద్యార్థులకు గతంలో రూ.2 లక్షలు అందేవి. ప్రస్తుతం వారికి ఆర్థికసాయం అందట్లేదు" అని గంగుల కమలాకర్ చెప్పారు.

## ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి ఆగంతకుడు.. పోలీసుల దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్: భాజపా ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి చొరబడిన కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎంపీ నివాసంలోకి ప్రవేశించిన ఆగంతకుడిని గుర్తించేందుకు సీసీ ఫుటేజ్‌ను మరోసారి పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీపీ సీవీ ఆనంద్ ఎంపీ ఇంటికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆయనతో పాటు వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఉన్నారు. దుండగుడు ప్రవేశించిన ప్రాంతాలను వారు పరిశీలించారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో డీకే అరుణకు కల్పించాల్సిన భద్రత పైనా డీసీపీ వివరాలు సేకరించారు. సోమవారం ఉదయం ఎంపీతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 56లోని ఎంపీ నివాసంలోకి ముసుగు ధరించిన ఆగంతకుడు ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించాడు. సీసీ కెమెరా వైర్లను కత్తిరించి, సుమారు గంట పాటు ఇంట్లో తిరిగి అక్కడి నుంచి జారుకొన్నాడు. ఆమె కుమార్తె ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంది. వంట గది కిటికీ గ్రిల్ తొలగించడం గమనించారు. దీనిపై ఎంపీ డ్రైవర్ లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఇతర సీసీ కెమెరాల్లో నమోదైన ఆధారాలతో నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వారే అయి ఉంటారని అనుమానిస్తున్నారు.




# చైనా, పాక్ లకు ఉమ్మడి స్ట్రోక్... 'మాజిద్ బ్రిగేడ్' చరిత్ర తెలుసా?

భారతదేశంతో సరిహద్దును పంచుకుంటూ పక్కలో బల్లేలులా ఉన్న దేశాల జాబితాలో పాక్, చైనా కీలకమనే సంగతి తెలిసిందే! ఈ క్రమంలో ఒక దేశం భారత్ పై ఆర్థికంగా ప్రభావం చూపిస్తుంటే.. మరోదేశం ఉగ్రవాదులతో ప్రభావం చూపించే ప్రయత్నాలు చేస్తుంటుంది. ఈ సమయంలో తాజాగా ఈ రెండు దేశాలకూ షాకిస్తూ మాజిద్ బ్రిగేడ్ షాకింగ్ పెర్ఫార్మెన్స్ చేస్తుందనే చర్చ తెరపైకి వచ్చింది. అవును... ఉగ్రవాదులను పెంచి పోషించడం తమ కర్తవ్యంగా భావిస్తున్నట్లుగా ప్రవర్తించి, నిత్యం భారత్ పై కవ్వింపు చర్యలకు పాల్పడే పాకిస్థాన్ కు తాజాగా మాజిద్ బ్రిగేడ్ షాకిచ్చింది. ఇందులో భాగంగా... పాకిస్థాన్ లోని బలోచిస్థాన్ లో ఏకంగా రైలునే హైజాక్ చేసి వార్తల్లో నిలిచింది. పాక్ సైన్యమే లక్ష్యంగా పలు ఆత్మాహుతి దాడులు చేసింది. పాక్-చైనా ఎకనామిక్ కారిడార్ ను వ్యతిరేకిస్తూ భారీ దాడులు నిర్వహిస్తోంది. వాస్తవానికి 1974 ఆగస్టు 2న మాజిద్ లాంగోవ్ సీనియర్ అలియాస్ అబ్దుల్ మాజీద్ బలోచ్ అనే మిలిటెంట్.. పాకిస్థాన్ మాజీ ప్రధాని జుల్ఫీకర్ అలీ భుట్టోపై హత్యాయత్నం చేశాడు. దానికి కారణం.. బలోచ్ ఉద్యమాన్ని అణిచివేసేందుకు అలీ భుట్టో భారీ ఆపరేషన్లు నిర్వహించడమే. అయితే ఈ ప్రయత్నంలో మాజిద్ లాంగోవ్ సీనియర్ అలియాస్ అబ్దుల్ మాజీద్ బలోచ్ పొరపాటున ప్రాణాలు కోల్పోయాడు! అనంతరం.. అతడి తమ్ముడు జూనియర్ మాజిద్ ఈ పోరాటం బాధ్యతలు తీసుకొన్నాడు. ఈ క్రమంలో 2010లో క్వెట్టాలో జూనియర్ మాజిద్ తో పాటు పలువురు బలోచ్ మిలిటెంట్లు ఉన్న ఓ ఇంటిపై పాక్ సైన్యం దాడి చేసింది.

ఈ సమయంలో అతడి మిత్రులు తప్పించుకున్నప్పటికీ.. ఓ గంట సేపు పాక్ సైన్యంతో పోరాడిన జూనియర్ మరణించాడు. దీంతో.. బలోచ్ ఉద్యమంలో మాజిద్ సోదరులు బాగా పాపులర్ అయ్యారు. అనంతరం వీరిద్దరి స్ఫూర్తితో 2011లో అస్లాం ఆచు అనే మిలిటెంట్ "బలోచ్ లిబరేషన్ ఆర్మీ" కోసం ఆత్మాహుతి దళాన్ని ఏర్పాటు చేశాడు. దానికి మాజిద్ బ్రిగేడ్ అని పేరుపెట్టాడు. ఈ క్రమంలో... ఈ బలోచ్ లిబరేషన్ ఆర్మీ కోసం మాజిద్ బ్రిగేడ్ ఇప్పటివరకూ సుమారు 12 భారీ ఆత్మహుతి దాడులు చేసింది. ఈ దాడుల్లో కరాచీ దద్దరిల్లిపోయింది. మరో దాడిలో చైనా ఇన్వెస్టర్స్ లో భయం రేకెత్తించింది. ఈ క్రమంలోనే 2020 జూన్ లో కరాచీ స్టాక్ ఎక్స్ ఛేంజిని లక్ష్యంగా చేసుకుని మాజిద్ బ్రిగేడ్ విరుచుకుపడింది. చైనాకు చెందిన ఓ కన్సార్టియం నిర్వహించడమే ఈ దాడికి కారణంగా చెబుతారు. ఇక గత ఏడాది అక్టోబర్ లో కరాచీ ఎయిర్ పోర్టు వద్ద ఆత్మాహుతి దాడి చేయగా.. ఆ దాడిలో ఇద్దరు చైనా ఇంజినీర్లు ప్రాణాలు కోల్పోయారు. కాగా... ఇటీవల పాకిస్థాన్ లో 500 మంది ప్రయాణికులతో వెళుతున్న రైలు హైజాక్ కు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. ఈ సమయంలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ అదుపులో ఉన్న బందీల్లో 80 మందిని సైనిక బలగాలు విడిపించాయని చెబుతున్నారు. మిలిటెంట్ల అదుపులో ఇంకా 100 మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రపంచంలోనే గొప్ప ప్రదేశాలు.. భారత్ లో ఈ రెండు హోటళ్లు!



టైమ్ మ్యాగజైన్ తన 2025 ప్రపంచ గొప్ప ప్రదేశాల జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అద్భుత ప్రదేశాలు, అనుభవాలను హైలైట్ చేస్తుంది. దీనికి సంబంధించిన ఎంట్రీల్లో ప్రధానంగా హోటళ్లు, క్రూయిజ్ లు, మ్యూజియంలు, పార్కులు మొదలైనవి ఉన్నాయి! ఈ సమయంలో భారత్ లోని రెండు హోటళ్లు ఈ జాబితాలో స్థానం సంపాదించుకున్నాయి. అవును... టైమ్ మ్యాగజైన్ 'ప్రపంచ గొప్ప ప్రదేశాల జాబితా - 2025' జాబితాను ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో భారత్ నుంచి రెండు హోటళ్లకు స్థానం దక్కించుకున్నాయి. ఇందులో భాగంగా... జైపూర్ రాఫెల్స్, బాంధవ్ గఢ్ లోని ఒబెరాయ్ వింధ్యవిలాస్ వైల్డ్ లైఫ్ రిసార్ట్ లు బస చేయడానికి అనువైన స్థలాల విభాగంలో చోటు దక్కించుకున్నాయి. ఇదే సమయంలో ఒక రెస్టారెంట్ కూడా ఈ జాబితాలోకి వచ్చి చేరింది. ఇందులో భాగంగా... ముంబైలోని పాపాస్ రెస్టారెంట్ సందర్శించాల్సిన ప్రదేశాల జాబితాలో ఒకటిగా పేరుపొందింది. ఇక.. రాఫెల్స్ అనేది జైపూర్ సమీపంలోని కుకాస్ పట్టణంలో ఉన్న ఒక రాజభవన హోటల్. రాణి ప్యాలెస్ నుంచి ప్రేరణ పొందిన ఈ 50 గదుల హోటల్ లో పాలరాయి శిల్పాలు, మొఘల్ శైలి తోరణాలు, జాలిస్ అని పిలువబడే చిల్లులు గల లాటిస్ వర్క్ స్క్రీన్ లు, ప్రత్యేకమైన సంప్రదాయ అద్దాలు, మొజాయిక్ ఫ్లోర్ తో కూడిన దీని డిజైన్ ఓ కళాఖండం అని చెబుతారు. ఇందులో ఆరావళి పర్వతాలను చూసే రూఫ్ టాప్ ఇన్ఫినిటీ పూల్, స్పా, నాలుగు డైనింగ్ హాల్స్ కూడా ఉన్నాయి. ఈ రాజభవన హోటల్ లో అడుగుడుగునా అప్ డేటెడ్ రాజ కళ కనిపిస్తుందని చెబుతారు. ఇదే సమయంలో... మధ్యప్రదేశ్ లోని ప్రసిద్ధ బంధవ్ గఢ్ నేషనల్ పార్క్ సమీపంలో ఉంది 21 ఎకరాల ఒబెరాయ్ వింధ్యవిలాస్ వైల్డ్ లైఫ్ రిసార్ట్. ఈ రిజర్వ్ దాని సఫారీలకు ప్రసిద్ధి చెందింది. ఈ సఫారీ ద్వారా రాయల్ బెంగాల్ టైగర్ లను వాటి సహజ ఆవాసాలలో చూడవచ్చు. ఈ హోటల్ అతిథులకు వివిధ వన్యప్రాణులకు సంబంధించిన అనుభవాలను అందిస్తుంది. ఈ రిసార్ట్ 19 విశాలమైన ఎయిర్ కండిషన్డ్ టెంట్లతో రూపొందించబడింది. ఇందులో ప్రతీ దానికి సొంత గార్డెన్, రెండు ప్రైవేట్ పూల్ విల్లాలు ఉన్నాయి. వీటితో పాటు స్పా, లైబ్రరీ, స్విమ్మింగ్ పూల్, ఫిట్ నెస్ సెంటర్, పచ్చని తోట స్థలాలతో పాటు స్థానికంగా లభించే పదార్థాలతో తయారుచేసిన భోజనాన్ని అందించే ఓపెన్ ఎయిర్ రెస్టారెంట్ ఉన్నాయి!

# నవమి మహోత్సవాల వేళ అనూహ్య పరిణామం

భద్రాద్రి : ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం రాముల వారి ఆలయంలో శ్రీరామనవమి మహోత్సవాల ప్రారంభాలవేళ ఆలయంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. అంకురార్పణ కార్యక్రమాన్ని ఆరు గంటల పాటు అర్చక బృందం నిన్న నిలిపివేసింది. ఓ భక్తుడు అభిమానంతో అందించిన నగదును రామాలయం ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాసరామానుజం స్వీకరించారు అన్న కారణంతో అతడిపై ఆలయ ఈవో రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యల్లో భాగంగా ఆ అర్చకుడిని పర్ణశాల ఆలయానికి బదిలీ చేశారు. ఈ విషయంపై అర్చకులంతా కలిసి ఈవోను కలిసి శ్రీనివాసరామానుజాన్ని మళ్లీ భద్రాచలానికి రప్పించాలని కోరారు. అయితే ఈవో నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో తాము అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించలేమంటూ అర్చకులు నిరసన తెలిపారు. ఈ విషయంలో అర్చకులు, ఈవో మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అంకురార్పణ ఆరు గంటల పాటు నిలిచిపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు ఉపప్రధాన అర్చకుడిని ఈవో పిలిపించడంతో నవమి వేడుకలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. అయితే.. భద్రాచలం రామాలయం చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయంలో అపచారం చోటు చేసుకుందని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఈవో రమాదేవికి, వైదిక సిబ్బందికి ఉన్న విబేధాలు పెద్ద రగడకు దారి తీశాయి. భద్రాచలంలో ప్రతీ శ్రీరామనవమికి రాములవారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రాముల వారి కళ్యాణం అంటేనే లోక కళ్యాణంగా భద్రాచలంలో ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ఏప్రిల్ 6న జరుగనున్న సీతారాముల కళ్యాణానికి సంబంధించి నిన్న అంకురార్పణ కార్యక్రమం జరగాల్సి ఉంది. అంకురార్పణ కార్యక్రమానికి సంబంధించి ఆలయ వైదిక సిబ్బంది శాస్త్ర ప్రకారం చూస్తే ఒక ఏడాది కాలంగా జరగాల్సి ఉత్సవాలన్నింటికీ సంబంధించి ఆచార్య, బ్రహ్మ, రుత్వికగా ఒక కమిటీని నియమిస్తారు. అంకురార్పణ కార్యక్రమంలో బ్రహ్మ స్థానంలో కూర్చోవాల్సిన అర్చకుడిని వేరే ఆలయానికి బదిలీ చేయడం, అర్చకుడిని అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొనకుండా ఈవో అడ్డుకోవడంతో అర్చకులంతా నిరసనకు దిగారు.

# ట్రంప్, తనది ఒకటే పాలసీ అంటున్న మోడీ



ప్రధాని మోడీ నేరుగా మీడియా ఇంటర్వ్యూల్లో మాట్లాడడం చాలా తక్కువ. ఇప్పటికీ కాంగ్రెస్ ఇదే విమర్శలు గుప్పిస్తుంటుంది. దమ్మున్న యాంటీ జర్నలిస్టులతో ఇంటర్వ్యూల్లో పాల్గొనాలని సవాల్ చేస్తుంటుంది. కానీ మోడీ మాత్రం తనకు అనుకూలురైన కొద్ది మంది జర్నలిస్టులతోనే చాలా అరుదుగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటారు. ఇప్పుడు కూడా ఒక విదేశీ పాడ్ కాస్టర్ ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. అందులోనూ వివాదాస్పద అంశాల జోలికి పోకుండా కేవలం తన మార్క్ ఉండేలానే చూసుకున్నారన్న విమర్శలు కాంగ్రెస్ నుంచి వచ్చాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా ప్రముఖ అమెరికన్ పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మాన్‌తో సుదీర్ఘ సంభాషణలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన డొనాల్డ్ ట్రంప్‌తో తనకున్న అనుబంధాన్ని, తన ప్రభుత్వ పాలనా సంస్కరణలను గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మోదీ మాట్లాడుతూ "హౌడీ మోదీ" కార్యక్రమంలో డొనాల్డ్ ట్రంప్ చూపిన ఆత్మీయతను గుర్తు చేసుకున్నారు. తన ప్రసంగాన్ని శ్రద్ధగా విన్న ట్రంప్, భద్రతా నియమాలను సైతం పక్కన పెట్టి తనతో కలిసి స్టేడియం చుట్టూ తిరిగి ప్రేక్షకులకు అభివాదం చేయడం ఆయనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని మోదీ అన్నారు. ట్రంప్‌తో తనకు బలమైన స్నేహబంధం ఉందని, ఆయన తనపై చూపిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్ "అమెరికా ఫస్ట్" విధానం తన "నేషన్ ఫస్ట్" , "భారత్ ఫస్ట్" సిద్ధాంతాలకు సరిగ్గా సరిపోతుందని మోదీ పేర్కొన్నారు. ఇద్దరు నేతల మధ్య ఉన్న ఈ ఉమ్మడి దృక్పథం సహజమైన సమన్వయాన్ని సృష్టిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. వివిధ వేదికలపై ట్రంప్ తనను కఠినమైన నెగోషియేటర్ గా బహిరంగంగా ప్రశంసించినందుకు మోదీ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్‌కు అమెరికా ప్రయోజనాలే ముఖ్యమని, తనకు భారత్ ప్రయోజనాలే ముఖ్యమని మోదీ స్పష్టం చేశారు. తన దృష్టి కేవలం భారతదేశ ప్రయోజనాలపైనే ఉంటుందని, ఇది ఇతరులకు హాని కలిగించడం కాదని, 140 కోట్ల మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకాన్ని నెరవేర్చడమే తన లక్ష్యమని మోడీ అన్నారు. ప్రస్తుత టర్మ్‌లో ట్రంప్ చాలా ఫోకస్డ్ గా ఉన్నారని, బలమైన బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారని మోదీ అభిప్రాయపడ్డారు. ఆ బృందంలోని చాలా మందిని తాను కలిశానని ఆయన తెలిపారు. అనంతరం మోదీ తన పాత స్నేహితుడు, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండి మస్క్‌తో తనకు పరిచయం ఉందని ఆయన చెప్పారు. ఇటీవల జరిగిన వారి సమావేశం చాలా ఆత్మీయంగా, కుటుంబ సభ్యుల్లా జరిగిందని మోదీ అన్నారు. మస్క్ ప్రభుత్వ కార్యాలయాల సామర్థ్యాన్ని సూచించే "%ణూ+జు%" (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ) గురించి చూపిన ఉత్సాహాన్ని ఆయన పంచుకున్నారు. తన ప్రభుత్వం చేపట్టిన పాలనా సంస్కరణల గురించి వివరిస్తూ, సమర్థత , పారదర్శకత అనే సూత్రాలు ఇప్పటికే తమ ప్రభుత్వ విధానాల్లో భాగమని మోదీ తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల నుండి 10 కోట్ల నకిలీ లబ్ధిదారులను గుర్తించి తొలగించామని, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నిజమైన లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేస్తూ ప్రయోజనాలు అందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ ఒక్క చర్యతోనే దేశానికి రూ. 3 లక్షల కోట్లు ఆదా అయ్యిందని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, మోదీ ప్రభుత్వం 1,500 కాలం చెల్లిన చట్టాలను.. 45,000కు పైగా అనవసరమైన నిబంధనలను తొలగించిందని, తద్వారా పరిపాలనను మరింత సరళంగా, పౌర-స్నేహపూర్వకంగా మార్చిందని ఆయన వివరించారు. ఈ పోడ్ కాస్ట్ ద్వారా మోదీ విశ్వాసం, సహకారం, ప్రజలకు ఫలితాలు అందించడంపై దృష్టి సారించిన తన నాయకత్వ శైలిని స్పష్టం చేశారు.

# ఒక్క కన్నీటి వీడియో ఆ విద్యార్థిని తలరాత మార్చింది.. కేంద్రమంత్రిని కదిలించింది

సోషల్ మీడియాలో అప్పుడప్పుడు కొన్ని అద్భుతాలు జరుగుతాయి.. కొన్ని కన్నీళ్లను తుడుస్తాయి.. ఇప్పుడు ఇదే జరిగింది. వెనుకబడిన బీహార్ జిల్లాలో ఇప్పటికీ అమ్మాయిలను చదివించడం వృథా అని భావిస్తారు. వారిపై ఖర్చు పెట్టడం దండగ అని.. పెళ్లి చేసి అత్తారింటికి పంపి తమ బాధ్యతను దించేసుకోవాలనుకునే తల్లిదండ్రులే ఎక్కువ. బీహార్ లో ఎంతో బాగా చదివే అమ్మాయికి కూడా అదే పరిస్థితి ఎదురైంది. కానీ సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆమె వీడియో ఆమెకు ఒక కొత్త దారిని చూపించింది. ఖుష్బూ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ఇంటర్వ్యూలో తన బాధను వెళ్లబోసుకుంటున్న ఆమె మాటలు వింటుంటే గుండె తరుక్కుపోయింది. పదో తరగతి పరీక్షల్లో 500కు 400 మార్కులు తెచ్చుకోవాలని తన తల్లిదండ్రులు లక్ష్యం పెట్టారు. ఖుష్బూ బాగానే చదివింది. కానీ, దురదృష్టవశాత్తూ ఒకే ఒక్క మార్కు తక్కువగా వచ్చింది - 399. ఆ ఒక్క మార్కు చాలు, ఆమె జీవితాన్ని మలుపు తిప్పడానికి.. అదే



జరిగింది.. ఖుష్బూకి సైన్స్ అంటే ప్రాణం. డాక్టర్ అవ్వాలని కలలు కంటోంది. కానీ, ఆ ఒక్క మార్కు కారణంగా ఆమెను సైన్స్ కోర్సులో చేరకుండా ఆర్ట్సులో చేర్పించారు. ఇంట్లో తన పట్ల చూపిస్తున్న పక్షపాతం గురించి ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తన అన్నయ్యలకు సైన్స్ చదివే అవకాశం ఇచ్చారని, తనకు మాత్రం ఒక్క మార్కు తక్కువ వచ్చిందని తన కలలను కాలరాశారని కన్నీటితో చెప్పింది. ఖుష్బూ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన ఈ విషయాలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఎంతోమంది ఆమెకు మద్దతుగా నిలిచారు. ఈ విషయం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి కూడా వెళ్లింది. ఆయన వెంటనే స్పందించారు. ఒకరోజు ఖుష్బూ ఫోన్ మోగింది. అవతలివైపు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారు ఉన్నారు. ఖుష్బూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. మంత్రి గారు ఆమెతో మాట్లాడారు. సైన్స్ విభాగంలో అడ్మిషన్ గురించి దానాపూర్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. "నీకు నచ్చిన సబ్జెక్టు చదువుకునేందుకు ప్రధాని మోదీ, సీఎం నీతీశ్ కుమార్ ప్రభుత్వాలు నీకు అండగా ఉన్నాయి. ఈ విషయమై నేను ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడాను. నువ్వు తప్పకుండా నీట్ పరీక్షకు కూడా ప్రిపేర్ అవ్వాలి. డాక్టర్ కావాలనే నీ కలను నెరవేర్చుకోవాలి," అని మంత్రి గారు ఖుష్బూకి భరోసా ఇచ్చారు. ఖుష్బూ కళ్ళల్లో మళ్ళీ నీళ్ళు తిరిగాయి. కానీ ఈసారి అవి బాధతో వచ్చినవి కావు. ఆనందంతో వచ్చినవి. తన కష్టాన్ని గుర్తించి, తన కలను నిజం చేయడానికి ఒక పెద్ద మనిషి అండగా నిలబడటం ఆమెకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. ఒకే ఒక్క మార్కుతో తన జీవితం ముగిసిపోయిందని అనుకున్న ఖుష్బూకి, ఇప్పుడు మళ్ళీ ఆశ చిగురించింది. తన కలల వైపు ఆమె ధైర్యంగా అడుగులు వేయడానికి సిద్ధమైంది.

# ఎలన్ మస్క్ 'ఏఐ'తో గోక్కుంటున్న తెలుగు యువత

ఇప్పుడు అంతా 'ఏఐ' మయం.. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతున్నాయి.. అంతా ఏఐ వల్లనే నడుస్తోంది. భవిష్యత్ అంతా ఏఐదేనని అంటున్నారు. ఇలాంటి సమయంలో అన్ని బడా టెక్ కంపెనీలు తమ తమ ఏఐలను ఆవిష్కరిస్తున్నాయి. ఓపెన్ ఏఐ నుంచి వచ్చిన చాట్ జీపీటీ సృష్టించిన ప్రభంజనంతో ఇప్పుడు చైనా డీప్ సీక్, గూగుల్ జెమినీ, మైక్రోసాఫ్ట్ కాపీలైట్ సహా ఎన్నో ఏఐలు వచ్చిపడ్డాయి. ఇప్పుడు ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ సైతం 'గ్రోక్' అంటూ తన మార్క్ ఏఐని ప్రవేశపెట్టారు. ఈ రోజుల్లో కృత్రిమ మేధస్సు ఒక సాధారణ అంశంగా అందరికీ అందుబాటులోకి వచ్చింది. యువతరం దాని సామర్థ్యాన్ని వివిధ రకాలుగా ఉపయోగిస్తోంది. చాట్‌జీపీటీకి పోటీగా ఎలాన్ మస్క్ ప్రారంభించిన గ్రోక్ ప్రత్యేకించి నెటిజన్లలో వినోదం కోసం ఒక సాధనంగా ప్రాచుర్యం పొందుతోంది. గత కొన్ని రోజులుగా ఎక్స్‌లో (గతంలో ట్విట్టర్) తెలుగు యువత గ్రోక్‌ను అడిగిన ప్రశ్నలు.. దానికి గ్రోక్ ఇచ్చిన సమాధానాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. చాలామంది %ూ×%ని విద్యా , సమాచార ప్రయోజనాల కోసం ఉపయోగిస్తుండగా.. తెలుగు యువత దానితో




మరింత సరదాగా వ్యవహరిస్తోంది. వారు గ్రోక్‌కు కొన్నిసార్లు అసభ్యకరమైన భాషను ఉపయోగిస్తూ విచిత్రమైన ప్రశ్నలు అడుగుతున్నారు. ఆశ్చర్యకరంగా గ్రోక్ కూడా అదే శైలిలో స్పందిస్తోంది, వారు ఉపయోగించిన పదాలను తిరిగి ఉపయోగిస్తూ హాస్యభరితమైన సమాధానాలు ఇస్తోంది. గ్రోక్ యొక్క ఈ ప్రతిస్పందనలు తెలుగు నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి, వారు మరింత సృజనాత్మకమైన ప్రశ్నలు అడుగుతూ ప్రతిస్పందనలు పొందుతున్నారు. గ్రోక్ యొక్క భాష , పదజాలం చూస్తుంటే, ఇది కేవలం ఒక AI కాదని, ఎవరో మనిషే సమాధానం ఇస్తున్నారేమో అనిపిస్తుంది. ఫ్యాన్ వార్స్‌లో సాధారణంగా ఉపయోగించే పదాలను , స్థానిక భాషను గ్రోక్ ఉపయోగించడం మరింత విస్మయానికి గురిచేస్తోంది. గ్రోక్ యొక్క సమాధానాల స్క్రీన్ షాట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒకవేళ గ్రోక్ తప్పు సమాధానం ఇస్తే, దానిని ఎత్తి చూపితే సరిదిద్దుకోవడం విశేషం. గ్రోక్ గురించి అనేక మీమ్స్ కూడా సృష్టించబడుతున్నాయి. అంతేకాకుండా, రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించిన ప్రశ్నలకు గ్రోక్ ఇచ్చే సమాధానాలు ప్రత్యేకంగా చెప్పుకోదగినవి. ఈ సమాధానాల కారణంగా గ్రోక్‌ను నిషేధించాలని డిమాండ్లు త్వరలో వినిపిస్తే ఆశ్చర్యం లేదు.

## చురకలు

## సంపాదకీయం

### డీలిమిటేషన్ తొలి దెబ్బ ప్రాంతీయ పార్టీలకే!

డీలిమిటేషన్ విషయంలో కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి దూకుడుగా ముందుకు వెళ్తోంది. ఒక ప్రణాళిక ప్రకారం అంతా చేసుకుంటోంది. బీజేపీ ఈ విషయంలో ఎంత అలెర్ట్ గా ఉందంటే 2022లో కొత్త పార్లమెంట్ భవనం నిర్మించింది. అందులో కేవలం 888 మంది మాత్రమే ఎంపీలు కూర్చునే విధంగా నిర్మాణం జరిగింది. లోక్‌సభలో 888 మంది పార్లమెంటు సభ్యులకు సౌకర్యవంతంగా వసతి కల్పించేలా దీనిని రూపొందించారు, ఇది పాత లోక్‌సభ సామర్థ్యం కంటే మూడు రెట్లు ఎక్కువగా చేశారు. అలాగే కొత్త రాజ్యసభ సమావేశ మందిరంలో 384 మంది సభ్యులకు సీట్లు ఉంటాయి. ఈ విధంగా చూస్తే కనుక బీజేపీ ముందే డీలిమిటేషన్ మీద ఒక అవగాహన పెంచుకుని ఈ విధంగా చేసింది అని భావించాల్సి ఉంది. అంటే ఈ రోజున దేశంలో 543 ఎంపీ సీట్లు ఉంటే అవి ఎంతవరకూ పెరుగుతాయన్న అంచనా బీజేపీకి ముందుగా ఉందని అంటున్నారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేయాలని బీజేపీ భావిస్తోంది ఇక ప్రతీ లోక్ సభ నియోజకవర్గంలో పాతిక నుంచి ముప్పయి లక్షల జనాభా దాకా ఓటర్లు ఉన్నారు. ఈ రకమైన జనాభా ఉత్తరాదిన ఎక్కువగా ఉంది. దాంతో దీనిని 20 లక్షలకు చేయాలని డీలిమిటేషన్ లో పెట్టుకున్నారని అంటున్నారు. ఆ విధంగా చేస్తే ఉత్తరాదిన ఇపుడు ఉన్న సీట్లకు మరింత ఎక్కువగా సీట్లు పెరుగుతాయి. కేవలం యూపీ బీహార్ లలో కలుపుకుని ఏకంగా 200 ఎంపీ సీట్లు ఈ డీలిమిటేషన్ లో అవుతాయని అంటున్నారు. ఇక ఈ దేశంలో 143 కోట్ల మంది జనాభా ఉన్నారు ప్రతీ ఇరవై లక్షల జనాభాకు ఒక లోక్ సభ సీటు అనుకుంటే 715 దాకా ఎంపీ సీట్లు పెరుగుతాయని ఒక అంచనా ఉంది. ఇక ఇందులో ఉత్తరాదిన జనాభా ఎక్కువగా ఉంటుంది కాబట్టి అక్కడే సీట్లు అధికంగా పెరుగుతాయని అంటున్నారు. ఈ విషయంలో దక్షిణాదికి తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆందోళన అయితే మేధావులలో ఉంది. దక్షిణాదిన చూసుకుంటే మొత్తం రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కేరళ, కర్ణాటక ఉన్నాయి. ఈ అయిదు రాష్ట్రాలలో ప్రస్తుతం ఎంపీల సంఖ్య 130 గా ఉంది. ఇక జనాభా విషయం తీసుకుంటే ఏపీలో అయిదు కోట్ల మూడున్నర లక్షలు ఉంటే తెలంగాణలో మూడు కోట్ల 8 లక్షల దాకా ఉంది. తమిళనాడులో ఏడు కోట్ల ఏడు లక్షలుగా ఉంటే కర్ణాటకలో ఆరు కోట్ల రెండు లక్షలుగా ఉంది. కేరళలో మూడున్నర కోట్ల జనాభా ఉంది. ఈ మొత్తం జనాభాను కలిపితే పాతిక కోట్ల దాకా జనాభా అవుతుంది. ఇక ప్రతీ ఇరవై లక్షలకు ఒక ఎంపీగా డీలిమిటేషన్ లో తీసుకుంటే 125 ఎంపీలే వస్తారు. అంటే ప్రస్తుతం ఉన్న 130 కంటే ఏకంగా అయిదు ఎంపీ సీట్లు తగ్గిపోతాయన్న మాట. దీంతో డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని అంటున్నారు. ఇకపోతే దక్షిణాదిన ఎక్కువగా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. తెలుగు నాట తెలుగుదేశం బీఆర్ఎస్ వైసీపీ, మజ్లిస్, జనసేన వంటివి ఉన్నాయి. ఇక కర్ణాటకలో జేడీఎస్ ఉంటే తమిళనాడులో డీఎంకే అన్నాడీఎంకే, సినీ నటుడు విజయ్ కొత్త పార్టీ ఉంది. ఇవన్నీ కూడా దశాబ్దాలుగా కొనసాగుతూ పార్లమెంట్ లో తమ ఉనికిని చాటుతున్నాయి. డీలిమిటేషన్ వల్ల దక్షిణాదిన సీట్లు తగ్గిపోతే ఆటోమేటిక్ గా ప్రాంతీయ పార్టీల రాజకీయ ప్రాబల్యం కూడా పోతుంది. ఎందుకంటే ఉత్తరాది సీట్లతోనే కాంగ్రెస్ అయినా బీజేపీ అయినా అధికారంలోకి వస్తాయి. దాంతో మెల్లగా దక్షిణాదిన ప్రాంతీయ వాయిస్ పోయి కాంగ్రెస్ బీజేపీ ఆ ప్లేస్ ని ఆక్రమించడానికి కూడా ఆస్కారం ఉంటుంది. బీజేపీ ఈ రోజున డీలిమిటేషన్ చేస్తున్నా కాంగ్రెస్ కి కూడా అది ఫ్యూచర్ లో ఉపయోగపడుతుంది. ఆ మాటకు వస్తే జాతీయ పార్టీలకు పోయింది ఏమీ లేదు. ఉత్తరాదిన ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది లేదు. దక్షిణాదిన మాత్రం ప్రాంతీయ పార్టీలకు పెద్ద దెబ్బ పడుతుంది అని అంటున్నారు. అయితే తమిళనాడులోని పార్టీలే ఈ విషయంలో కేంద్రం నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూంటే తెలుగునాట పార్టీలు మాత్రం కిమ్మనకుండా ఉన్నాయి. ఈ వైద్యం చూసే తీరు మంచిది కాదని అసలుకే ఎసరు తెస్తుందని అంటున్నారు. మేలుకోవాల్సింది మాత్రం ప్రాంతీయ పార్టీలే. దాని కంటే ముందు కేంద్రంలోని ఎన్డీయే కూటమికి ప్రాణ వాయువు అందిస్తున్న టీడీపీ జనసేన ఈ విషయంలో గట్టిగా పోరాడాలని వైసీపీ బీఆర్ఎస్ వంటివి కూడా గళం విప్పాలని అంతా కోరుతున్నారు.

# బ్రహ్మోత్సవాలలో మొక్కులు తీర్చుకున్న భక్తులు

బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా ఆది వారం నిర్వహించిన శ్రీవేంకటేశ్వర డోలోత్సవ సందర్భంగా, వంశపారంపర్య ఆచార ఆచరణ నేపథ్యంలో రాష్ట్రం నలుమూలలనుం కాక, మహారాష్ట్ర తదితర సుదూర ప్రాంతాలనుండి ఏతెంచిన భక్తజనం దేవస్థానంలో మొక్కులు తీర్చుకున్నారు. పిల్లా పాపలతో గోదావరి నదికి మూటా ముళ్ళే నెత్తిన పెట్టుకు వచ్చిన భక్తులు, మంగళ స్నానాలను ఆచరించి, గోదావరి మాతను అర్చించి, దానధర్మాదులను ఆచరించి, వివిధ ఆలయాలలో దైవ దర్శనాలు చేసుకున్నారు. శ్రీవేంకటేశ్వర మందిరంలో చిరకాల వాంఛలు ఈడేర్చాలని ప్రార్థిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.

**హోమశాలలో ప్రత్యేక పూజలు...** శ్రీ వేంకటేశ్వర తెప్పోత్సవ, డోలోత్సవ నిర్వ హణదినమైన ఆది వారం దేవస్థానంలో ప్రత్యేక బ్రహ్మోత్సవ పూజలు నిర్వహించారు. దేవస్థాన వంశపారంపర్య యాజ్ఞికులు, దేవతా పౌరోహితులు కందాళై పురుషోత్తమా చార్య, ఆస్థాన వేదపండితులు రమేశ శర్మల ఆధ్వర్యంలో, అర్చకులు నేరెళ్ళ శ్రీనివాసా చార్య, మోహనా చార్య, కిరణ్, వంశీ, విజయ్ ఉదయం నుండి యాగశాలకు స్వాముల ఉత్సవ మూర్తులను వేంచేపుచేసి, బ్రహ్మకలశ పూజ, ధ్వజారోహణము, తిరుక్కళ్యాణం, నిత్య హోమ పంటపంలో కలశ, విశ్వక్సేన, కర్మణః, పుణ్యావాచనం, అగ్నిద్యానం, వాసుదేవ, నారాయణ మంత్ర హవనం, సమిద్ధ హోమం, పంచసూక్త హవనాలు, ద్వాదశ దేవతా హోమాలు, సప్తావరణ హోమాలు, అష్టమంగళ, మూర్తి, సుదర్శన, విశ్వక్సేన, సర్వదేవతా, గరుడ హవనాలు, మూల మంత్ర హోమాలు, స్థాపిత దేవతా హవనములు, దోష పరి హారార్థం నవగ్రహ, నక్షత్ర హోమాలు నిర్వహించారు. మద్యాహ్నం బలి ప్రదానం, అష్ట దిక్పాలకుల ధ్వజారో హణం, గరుడ బ్రహ్మలకు బలిప్రదానం గావించగా, భక్తులు పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలలో పాల్గొని, కానుకలు, ముడుపులు, మొక్కులు చెల్లించు





కున్నారు. దేవస్థానం పక్షాన భక్తులందరికీ ఉచిత అన్నదానం గావించారు. స్థానిక ఆర్యవైశ్యులు, విద్యార్థులు స్వచ్ఛంద సేవకులుగా సేవలందించి, భక్తుల, యాత్రికుల ప్రశంసాపాత్రులైనారు. దేవస్థానం ఈ శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, పాలెపు గణేశ్, సిబ్బంది, స్వచ్ఛంద సంఘాల బాధ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...** బ్రహ్మోత్సవాలలో భాగంగా శేషప్ప కళా వేదికపై సంగీత రత్న కొరిడే నరహరి శర్మ ఆద్వర్యంలో దేవస్థానం పక్షాన నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానంగా శేషప్ప భక్త మండలి ఆధ్వర్యంలో ఎన్నం బాపురెడ్డి నిర్వహణలో సభ్యులు శేషప్ప విరచిత నరసింహ శతక పద్య గానం చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, ధర్మ కర్తలు గాయకులను సత్కరించారు.

**దేవస్థానానికి గణనీయ ఆదాయం...** బ్రహ్మోత్సవాలు సందర్భంగా దేవస్థానానికి 10వ తేదీ నుండి 15 వరకు ఆరు రోజులకు గాను గణనీయ ఆదాయం లభిస్తున్నది. వివిధ టికెట్ల ద్వారా 17,33,886 రూపాయలు, లడ్డూ, పులిహోర ప్రసాదం ద్వారా 19,34,010 రూపాయలు, అన్నదానం ద్వారా 4,26,388 రూపాయలు, మొత్తం 40,94,284 రూపాయల ఆదాయం లభించినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

**ప్రశంసా పాత్రం... అన్నపూర్ణ సమితి సేవాభావం...** స్థానిక అన్నపూర్ణ సేవా సమితి బ్రహ్మోత్సవాలలో చేస్తున్న సేవలు ప్రశంసాపా త్రాలు అవుతున్నాయి. సామాజిక సేవే పరమావధిగా పట్టణ వాసులకు ఎన్నో ప్రజాహిత సేవలు అందిస్తున్న సేవాసమితి, ఈ సారి బ్రహ్మోత్సవాలలో అనుదినం దేవస్థాన నం ...గోదావరి మార్గంలో భక్తుల దాహార్తి తీర్చేందుకు శీతల పానీయాలు, త్రాగునీరు అందిస్తున్నారు. ప్రధానంగా తెప్పోత్సవం, డోలోత్సవాల సందర్భంగా లస్సీ మజ్జిగ అందించి ప్రశంసలను పొందుతున్నారు. పెద్దంభట్ల నరేందర్ శర్మ నేతృత్వంలో , కొరిడే శంకర్, గుండి రామనాథం, కొరిడే దత్తాత్రేయ, పెండ్యాల బాల కృష్ణ, రవీందర్, మధు శంకర్, కషోజ్జల రాజేశ్వర శర్మ, అలువాల దత్తాత్రి, సంగన భట్ల నరేందర్, లక్ష్మీకాంత్, బావి మురళి తదితర సేవా సమితి బాధ్యులు స్వచ్ఛంద సేవలు అందించి ప్రశంసలను అందుకుంటున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**


# మహాత్మునిపై మహా విచారణ మరిచిపోలేని సంఘటన - మార్చి 18... - దేశంలో గాంధీజీ ఎదుర్కొన్న తొలి కోర్టు విచారణ దినం

జాతిపిత మహాత్మాగాంధీ జీవితంలో 11 సార్లు జైలుకు వెళ్లాడు. ఆయనకు వేసిన జైలు శిక్షలన్నీ పూర్తిగా అనుభవిస్తే 11 సంవత్సరాల 19 రోజులు జైల్లో ఉండాల్సి వచ్చేది. వివిధ సందర్భాలలో ఆయన శిక్ష తగ్గించేవారు, అలా ఆయన మొత్తం 6 సంవత్సరాల 10 నెలలు జైల్లో గడిపాడు. 39 యేళ్ల వయసులో ఆయన మొదటిసారి జైలుకి వెళ్లాడు. 75 యేళ్ల వయసులో ఆఖరిసారి జైలు నుండి బయటకు వచ్చాడు. బ్రిటిష్ వలస పాలకుల ఇష్టారాజ్య వ్యవహారాల పట్ల గాంధీజీ పలు మార్లు నిరసించాడు. పాలకుల నిర్ణయాలను వ్యతిరేకించాడు. తిరుగు బాటును బోధించాడు. సామూహిక పౌర శాసనోల్లంఘనాన్ని అనుసరించాడు. అనేకసార్లు జైలుకు వెళ్లాడు. అరెస్టు చేసినప్పుడు ఆయన నేరాన్ని వెంటనే అంగీకరించే వాడు. తనకు కఠిన శిక్ష విధించమనేవాడు. జైలు జీవితమంటే కష్టం, జైలుకి వెళ్లడమంటే అవమానం, జైలంటే భయంకరం, జైలంటే నేరస్తులకు శిక్షా కేంద్రం అనే సాధారణ భారతీయులకు జైలు పట్ల గల అభిప్రాయాలను, ఆలోచనలను మనసుల్లోంచి తొలగించే నిరంతర ప్రయత్నాలు చేశాడు. ప్రజల స్వేచ్ఛకు గండి కొట్టిన రౌలత్ చట్టం, అత్యంత దారుణమైన జలియన్వాలాబాగ్ మారణ హోమం నేపథ్యంలో సహాయ నిరాకరణకు పిలుపునిచ్చిన గాంధీజీ, దేశ ప్రజలను చైతన్య పరుస్తూ యంగ్ ఇండియాలో వ్యాసాలు రాశాడు. ఇవి బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ప్రజలను రెచ్చగొట్టేలా ఉ న్నాయంటూ.. గాంధీజీపై భారత నేర శిక్షాస్మృతి 124ఏ కింద రాజద్రోహం బ్రిటిష్ అధి కారులు కేసు నమోదు చేశారు. గాంధీజీతో పాటు యంగ్ ఇండియా ప్రచురణకర్త ఎస్.జి.బంకర్ పై కూడా కేసు నమోదు చేశారు. ఈ కేసులో 1922 మార్చి 18న అహ్మదాబాద్ లోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్లో 'మహా విచారణ' మొదలైంది. భారత దేశంలో గాంధీ ఎదుర్కొన్న సంబంధిత మొదటి కోర్టు విచారణ మరిచిపోలేని సంఘటన. కోర్టులో విచారణ ఆరంభం కాగానే గాంధీజీ తనపై అభియోగాలన్నింటినీ అంగీకరించారు. విప్లవ కార్యకలాపాల అభియోగాలపై జడ్జి గాంధీకి ఆరేళ్లు సాధారణ జైలు శిక్ష విధించాడు. "మీతో రాజకీయంగా విభేదించేవారు కూడా మిమ్మల్ని ఉన్నతమైన మనిషిగా, పవిత్రమైన సాధు జీవితం గడిపే వ్యక్తిగా గౌరవిస్తారు," అన్నారు నాటి న్యాయమూర్తి బ్రూమ్ ఫీల్డ్. గాంధీ మాట్లాడుతూ, "భారత దేశమంతా గౌరవించే దేశభక్తులు చాలా మంది ఈ సెక్షన్ కిందే జైలుకి వెళ్లారని నాకు తెలుసు, నాకూ ఇదే విధించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నేను నిప్పుతో ఆటలాడుతున్నానని నాకు తెలుసు, అయినా నేను అదే పని చేస్తాను." అన్నాడు. గాంధీ కోర్టు గదిలోకి వచ్చి, వెళ్లిపోతున్నప్పుడు అక్కడున్నవారంతా గౌరవంగా లేచి నిలబడ్డారు. పోలీసులు ఆయనను ముంబయి రాజకీయ ఖైదీ నం. 50 అని పేర్కొన్నారు. అడ్వొకేట్ జనరల్ స్ట్రాంగ్మన్ గాంధీజీ పై నేరారోపణలు చేస్తూ, అహింస పేరుతో ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రజలను గాంధీ రెచ్చగొడుతున్నారని, ముంబయి, మలబార్, చౌరీచౌరా సంఘటనల్లోని హింసాకాండను కూడా దృష్టిలో ఉంచుకొని తీర్పునివ్వాలని ని కోరాడు. గాంధీజీ తన వాదన వినిపిస్తూ... అడ్వొకేట్ జనరల్ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానని, ప్రభుత్వ వ్యవస్థ పట్ల అయిష్టమనేది తనకు అలవాటుగా మారిందని, మంచికి సహకారం ఎలాంటిదో.. చెడుకు సహాయ నిరాకరణ కూడా అలాంటిదేనని పేర్కొన్నాడు. హింసాయుతమైన సహాయ నిరాకరణ అనేది చెడును మరింత పెంచుతుందే తప్ప తగ్గించదనేది నా దేశవాసులకు తెలియ చెప్పాలను కుంటున్నాని, ముంబయి, చౌరీచౌరా సంఘటనలు తప్పేనని, బాధ్యతగల వ్యక్తిగా తాను నిర్ణయాలు తీసుకున్నప్పుడు వాటి పరిణామాలను కూడా ఊహించి ఉండాల్సిందని, నిప్పుతో ఆడుకుంటున్నానని తనకు తెలుసునన్నారు. అయితే దేశానికి తీరని హాని చేస్తున్న మీ ప్రభుత్వాన్ని సమర్థించలేను గదా అంటూ, హింస లేకుండా ఉద్యమం ఉండాలనుకున్నా, కానీ కొన్నిసార్లు నా ప్రజలు పిచ్చిగా వ్యవహరించారని, అందుకు క్షమాపణలు చెబుతున్నానని, అలాగని తాను క్షమాభిక్ష కోరటం లేదన్నాడు. అందుకే తనకు అత్యంత కఠినాతి కఠినమైన శిక్ష విధించాలని కోరుకుంటున్నానని... అహింస అంటే చెడుకు సహాయ నిరాకరణ చేసినందుకు విధించే శిక్షను భరించటం కూడా అంటూ. మీచట్టం ప్రకారం కఠినాతి కఠిన శిక్ష విధించండి. న్యాయమూర్తి దృష్టిలో తనది నేరం కావచ్చునని, తన దృష్టిలో మాత్రం పౌరుడిగా తన బాధ్యత అని వివరించాడు. జడ్జి తాము అనుకుంటున్న అదే నేరాన్ని అనేకమంది ఆంగ్లేయులు, అధికార యంత్రాంగంలోని భారతీయ సహచరులు కూడా చేస్తున్నారన్నాడు. భారత్ కు బ్రిటిష్ వ్యవస్థ చేసినంత



హాని మరేదీ చేయలేదని, ప్రజల స్వేచ్ఛను హరించే రౌలట్ చట్టం తేవడం, జలియన్ వాలాబాగ్ లో, పంజాబ్ లో దారుణాలకు పాల్పడటం లాంటి అవాంఛనీయ వ్యవస్థ పట్ల ఆరాధన పెంచుకుంటే పాపం చేసిన వాడినవుతానని ఆయన నొక్కి చెప్పాడు. తమరు పాటిస్తున్న చట్టం ప్రజలకు హాని చేస్తోందని భావిస్తే.. మీ పదవికి రాజీనామా చేసి, ఆ చెడుకు దూరంగా ఉండండి అని, తమ చట్టం ప్రజలకు మేలు చేసేదే అని అనుకుంటే తనను దోషిగా నిర్ధారించి కఠినాతి కఠిన శిక్ష విధించండి అంటూ అంటూ గాంధీజీ ముగించాడు. గాంధీజీ మాటలకు చలించిన న్యాయమూర్తి బ్రూమ్ ఫీల్డ్ అనూహ్యంగా గాంధీజీ ముందు తలవంచి అభివాదం చేసి తన తీర్పు చదివారు. బహుశా ఏ న్యాయ మూర్తికైనా ఇలాంటి పరిస్థితి ఇబ్బందికరమైనదే, నా సర్వీసులో మీలాంటి ప్రత్యేకమైన వ్యక్తిని చూడలేదు. చూడను కూడా. రాజకీయంగా మీతో విభేదించేవారు కూడా మీ విలువలను, ఆదర్శ జీవితాన్ని గౌరవించకుండా ఉండలేరు... అంటూ ఆరేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. ఒకవేళ ఈ శిక్షను ప్రభుత్వం తగ్గిస్తే.. నా కంటే సంతోషించే వారుండరు అంటూ మరోమారు గాంధీజీ ముందు గౌరవ పూర్వకంగా తలవంచి వెళ్లిపోయారు. గాంధీజీని తొలుత సబర్మతి జైలుకు, తర్వాత ప్రత్యేక రైలులో పుణేలోని యెరవాడ జైలుకు తరలించారు. అనారోగ్య కారణాల వల్ల 22 నెలల తర్వాత బేషరతుగా విడుదల చేశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# శత వసంతాల మాలపల్లి నవల




గాంధేయ వాదిగా, న్యాయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కుల వ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, "మాలపల్లి" అనే విప్లవాత్మకమైన నవలను రవించడం, తన దృక్పథానికి మద్దతుగా, "సహ పంక్తి భోజనాలు" నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఒక దళిత కుటుంబం సమా జంలో కలిసి మెలసి ఉండడానికి చేసే ప్రయత్నం, సదరు ప్రయత్నంలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సంఘటి తమై సమాజంలో నిర్లక్ష్యం చేయబడ్డ తమ ఉనికి కోసం, మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాలు వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలు ఉదాత్తంగా చిత్రీకరించ బడ్డాయి. సామాజిక మార్పు కోసం బలహీన దళిత, పీడిత వర్గాలు చైతన్యంతో సుసంఘ టితం కావాలని, పోరాటా లకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. 1922లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయ వెల్లురు జైలుకు ఉన్నవ లక్ష్మీనారాయణ తరలించ బడిన సమయం లోనే అక్కడే తన లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయమైన 'మాలపల్లి' నవలను ఆయన రచించారు. మాలపల్లి నవల దళిత కుటుంబాన్ని ప్రధాన కథాశంగా రచించిన తొలి రాజకీయ నవల. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావర ణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాల పల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్య గ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలాచారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమ గీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వర రావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామా న్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమ కూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షివిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. ఉన్నవ... మాల పల్లి, నాయకురాలు, బుడబుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధునిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరు పాడు గ్రామంలో 1877 డిసెంబరు 4న జన్మించి, 1958 సెప్టెంబరు 25 న మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్... 9440595494**

# దేశ భద్రత సుస్థిరకు ఆయుధ కర్మాగారాల భరోసా మార్చి 18... ఆయుధ కర్మాగారాల దినోత్సవం

భారత దేశంలో మార్చి 18వ తేదీని ఆయుధ కర్మాగారాల దినోత్సవంగా జరుపు కుంటారు. దేశ రక్షణలో ఆయుధ కర్మాగారాల పాత్రను గుర్తించడంతో పాటు, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియ జేయడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. 1801వ సంవత్సరం మార్చి 18వ తేదీన కోల్‌కతా లోని కాస్సిపూర్ వద్ద మొదటి ఆయుధ కర్మాగారాన్ని స్థాపించారు. భారత రక్షణ సామర్థ్యంలో ఒక కొత్త దశకు నాంది పలికింది. అప్పటి నుండి, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో అనేక ఆయుధ కర్మాగారాలు ఏర్పడ్డాయి. ఈ కర్మాగారాలు భారత సాయుధ దళాలకు అవసరమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తయారు చేస్తాయి. ఈ కర్మాగారాల అభివృద్ధి అనంతర కాలంలో భారత రక్షణ వ్యవస్థను మరింత బలపరిచింది. 2021వ సంవత్సరం అక్టోబరు 1వ తేదీ నుండి, భారత ప్రభుత్వం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును ఏడు ప్రభుత్వ రంగ సంస్థలుగా మార్చింది. ప్రస్తుతం ఇవి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీస్ బోర్డ్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి. ఈ కర్మాగారాలు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. భారత దేశం స్వయం సమృద్ధి సాధించడంలో ఈ కర్మాగారాలు సహాయ పడతాయి. ఈ కర్మాగారాలు అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. భారత దేశం యొక్క రక్షణ అవసరాలను తీర్చడంలో ఆయుధ కర్మాగారాలు చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఆయుధ కర్మాగారాలు భారత సాయుధ దళాలకు అవసరమైన ఆయుధాలు, మందుగుండ్లు, యుద్ధ సామగ్రి, రక్షణ పరికరాలు, వాహనాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు మొదలైన వాటిని తయారు చేస్తుంటాయి. ఇవి దేశ భద్రత కోసం అందించే సేవలు ఎంతగానో విలువైనవి. ఈ రోజున, ఆయుధ కర్మాగారాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆయుధ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు వంటివి నిర్వహిస్తారు. ఈ వేడుకలలో ఆయుధ కర్మాగారాల ఉద్యోగులు, అధికారులు మరియు ఇతరులు పాల్గొంటారు. యువతలో రక్షణ రంగంపై ఆసక్తిని కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విధంగా ఆయుధ కర్మాగారాల దినోత్సవం దేశ రక్షణలో ఆయుధ కర్మాగారాల ప్రాముఖ్యతను తెలియ జేస్తుంది. దేశ భద్రతను సుస్థిరంగా నిలుపు కోవడంలో ఆయుధ కర్మాగారాలు వహిస్తున్న పాత్ర అమోఘం. ప్రస్తుత యుగంలో విదేశీ ఆయుధాల మీద ఆధార పడకుండా స్వదేశీ తయారీకి ప్రాధాన్యత ఇచ్చే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆయుధ నిర్మాణంలో స్వయం సమృద్ధిని సాధించాలన్న ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి ఇది ప్రేరణగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్... 9440595494**

## సాగునీరు.. సజావుగా చేరేలా..

కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు వర్షాకాలంలోగా మరమ్మతులు పూర్తిచేయటంపై అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు కాల్వల మరమ్మతులు, మొక్కల తొలగింపు, పంపుహౌస్‌ల నిర్వహణ, ప్రాజెక్టుల గేట్లను బాగుచేయటం వంటి వాటిపై ఉభయ జిల్లాల సీఈలు ఈఎన్సీ(ఇంజినీర్ ఇన్ చీఫ్)కి ప్రతిపాదనలు పంపించారు. వీటిని బుధ, గురువారాల్లో ఉన్నతాధికారులు పరిశీలించారని, త్వరలోనే ఆమోదం లభించనుందని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు.

ఖమ్మం జిల్లాలో రూ. 4.73 కోట్లతో ప్రతిపాదనలు: సాగునీటి వనరుల సంరక్షణ, నిర్వహణలో భాగంగా భద్రాద్రి జిల్లాల్లో రూ. 5కోట్లు, ఖమ్మం జిల్లాలో రూ. 4.73కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు జలవనరులశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రధానంగా నీటిని పంట పొలాలు, ఇతర ప్రాంతాలకు సరఫరా చేసే కాల్వల్లో లీకేజీలను సరిచేయటానికి కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఎత్తిపోతల పథకాల్లో మరమ్మతులకు గురైన మోటార్ల స్థానంలో కొత్తవాటిని అమర్చనున్నారు. జలాశయాల్లోని గేట్లలో లీకేజీలు, ఇతర సమస్యలను సరిచేయనున్నారు. ప్రధాన జలాశయాలు తాలిపేరు, కిన్నెరసాని, వైరా, పాలేరు, వెంగళరావు సాగర్ తదితర వాటికి సాధారణ



మరమ్మతులు చేపట్టడంతో పాటు ఏవైనా సమస్యలుంటే పరిష్కరించనున్నారు.

**వార్షిక నిర్వహణ కార్యక్రమాలు ఇలా..**

రుతుపవనాల కంటే ముందు: మే-జూన్ మాసాల్లో జలాశయాల నిర్మాణ స్థితి, గేట్ల పనితనాన్ని తనిఖీ చేస్తారు.

రుతుపవనాల సమయంలో: జులై నుంచి అక్టోబర్ వరకు వర్షాల సమయంలో నీటి ప్రవాహాన్ని, వరదలను నిరంతరం పర్యవేక్షిస్తూ హెచ్చరికలు జారీ చేస్తుంటారు.

ఆ తరువాత: వర్షాకాలం తరువాత నీటి నిల్వలను అంచనా వేసి రబీ కోసం నీటి విడుదల ప్రణాళికలు రూపొందిస్తారు.

**ఎప్పుడెప్పుడు.. ఏమేం చేస్తారంటే**

ఏటా వర్షాకాలానికి ముందు, తర్వాత జలాశయాల నీటి నిల్వ సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. వర్షాకాలం ముందు ప్రాజెక్టు గేట్లు, కాల్వలు తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపడతారు. వీటితో పాటు జలాశయాల్లో పేరుకుపోయిన బురదను తొలగించి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తారు. వ్యవసాయ అవసరాలు, వరద నియంత్రణకు నీటిని పరిమితంగా విడుదల చేస్తారు. ఇందుకోసం వాతావరణశాఖ నుంచి వచ్చే వర్షపాత అంచనాలను ప్రామాణికంగా తీసుకుంటారు. రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ డేటా ద్వారా జలాశయాల నీటిస్థాయిలు, వర్షపాత ప్రభావాన్ని పర్యవేక్షిస్తారు. ప్రాజెక్టుల చుట్టుపక్కనున్న గ్రామాల రైతులతో నీటి వినియోగం, నిర్వహణ సమస్యలను చర్చించి పరిష్కరిస్తారు.

## రబీ ధాన్యం సేకరణకు సిద్ధం

ఖమ్మం : ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు పండించే ధాన్యంలో 2.58 లక్షల మెట్రిక్ టన్నులను పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు 344 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ కాలువలకు నీరు విడుదల చేయలేదు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవటం, సాగర్ కాలువలకు రెండు సీజన్లలో నీరు విడుదల చేయటంతో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన సన్నరకం వడ్లు ప్రభుత్వం కొనుగోలు చేసి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించింది. రబీ సీజన్‌లో సన్నరకం వడ్ల సాగు పెరిగింది. జిల్లాలో మరో 15 రోజుల్లో వరి కోతలు మొదలై వడ్లు మార్కెట్‌కు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈసారి రబీలో సన్నరకం వడ్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.వ్యవసాయ శాఖ లెక్కల మేరకు రబీ సీజన్‌లో 84,332 హెక్టార్లలో వరి పంట సాగులో ఉంది. ఇందులో 51,626 హెక్టార్లలో సన్నరకం వడ్లు, 32,706 హెక్టార్లలో దొడ్డు రకం సాగు చేస్తున్నారు. 5,45,151 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా బహిరంగ మార్కెట్, రైతుల సొంత అవసరాలకు పోను 2.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం (సన్నరకం 1.85 లక్షలు, దొడ్డు రకం 73 వేలు మెట్రిక్ టన్నులు) పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలుకు నిర్ణయించారు.మే నెల చివరి వరకు ధాన్యం ఖరీదు చేయనున్నారు.



64.62 లక్షల గోనె సంచులు కావాల్సి ఉండగా 19.39 లక్షలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. మరో 45.23 లక్షల సంచులను దశల వారీగా తెప్పించనున్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం జిల్లాలోని 70 మిల్లులకు అప్పగించనున్నారు. మిల్లర్లు ధాన్యం మరపట్టి బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది.

డ్వాక్రా మహిళా సంఘాలు 151, సొసైటీలు (పీఏసీఎస్) 162, డీసీఎంఎస్ 28, మెప్మా 3 చొప్పున మొత్తం 344 కొనుగోలు కేంద్రాలు కేటాయించారు. వీటికి కావాల్సిన టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, డ్రయర్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం పరీక్షించే, తూర్పార యంత్రాలు సహా అవసరమైన పరికరాలు సమకూర్చుకోనున్నారు.

రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఖరీఫ్‌లో విజయవంతంగా నడిపాం. రబీలోనూ సన్న రకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుంది. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయి.

గంటా శ్రీలత, డీఎంసీఎస్, ఖమ్మం

# సంరక్షిస్తేనే సజీవ ధారలు



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీటిపరంగా ఆదరువుగా నిలిచే గోదావరి, ఉప నది మానేరులను సంరక్షించుకుంటేనే భావితరాలకు సజీవ ధారలు అందే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో ఉరుకులు, పరుగుల ఉద్ధృతిని చూపిస్తూ ఉప్పొంగే నదీమ తల్లి ఎండాకాలం వచ్చిందంటే ఎడారిని తలపిస్తోంది. అతికష్టంగా పంట పొలాలకు సాగునీటిని, ప్రజలకు తాగు నీటినందిస్తోంది. నేడు నదుల ప్రాముఖ్యతను తెలిపేందుకు అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవాన్ని జరుపుకొంటున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గోదావరి నది నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై కథనం.

గోదావరి ఉమ్మడి జిల్లాలో 142 కి.మీ.ల మేర జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి వద్ద ప్రారంభమై పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఆరెంద శివారు వరకు ప్రవహిస్తోంది. నాలుగు జిల్లాల్లో 5.73 లక్షల ఎకరాల సాగు భూములకు ఎల్లంపల్లి, మధ్య, దిగువ మానేరు జలశయాలతోపాటు ఎస్సారెస్పీ ద్వారా ఏటా గోదావరి నీరు అందుతుంది. ఏడు జిల్లాల్లోని 16.4 లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఏడాదికి మొత్తంగా 1651 టీఎంసీల నీరు నిలిచి ఉండేలా ఈ పథకాన్ని రూపొందించారు.

**ఆక్రమణలతో..**

విశాలమైన గోదావరి పరీవాహక ప్రాంతం కాలక్రమేణా కుంచించుకుపోతోంది. ఎక్కడికక్కడే పరీవాహక ప్రాంతాల్లో సాగు చేసుకునే వారితో పాటు ఇతర నిర్మాణాలకు నదిని ఆక్రమించుకుంటున్న సందర్భాలున్నాయి. నదిని ఆనుకుని ఉన్న ధర్మపురి, మంథని, గోదావరిఖని పట్టణాల్లో వర్షాకాలం ముంపు సమస్య ఏర్పడుతోంది. కరకట్టల నిర్మాణమనే ప్రతిపాదన పలు చోట్ల ఉన్నా.. అది ఆచరణకు నోచుకోవడం లేదు.

**దోపిడీ..**

ఇసుక అక్రమ రవాణాతో నదీమ తల్లికి అక్రమార్కులు క్షోభను మిగులుస్తున్నారు. ఈ నదిలో ఇసుక లభ్యత ప్రతి 20-25 కి.మీ.ల పరిధిలో 1.20 కోట్ల క్యూబిక్ మీటర్లు ఉంటుంది. దీంతో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) 14 చోట్ల రీచ్‌లను ఏర్పాటు చేసింది. సర్కారుకు ఆదాయం సమకూరినా.. ఇష్టారాజ్యంగా తవ్వడంతో నీటి నిల్వ ప్రశ్నార్థకమైంది. దొడ్డిదారిన ఏడాదిలో 220 రోజులపాటు రోజులో వెయ్యి ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక దోపిడీకి గురవుతోంది. పర్యావరణానికి విఘాతం కలిగే ఈ చర్యపై పలు సంస్థలు హరిత న్యాయస్థానాన్ని ఆశ్రయించినా దందా ఆగడం లేదు.

**కలుషితం..**

ధర్మపురి, రామగుండం, గోదావరిఖని ప్రాంతాల్లో గోదావరి కలుషితమవుతోంది. కాలుష్య నియంత్రణ మండలి తనిఖీల్లో వ్యర్థ జలాలతోపాటు ప్లాస్టిక్ చేరుతున్నట్లు గుర్తించారు. ఫ్యాక్టరీల వ్యర్థాలతోపాటు మురుగు నీటిని నదీ జలాల్లోకి వదలడంతో ముప్పు వాటిల్లుతోంది. దాదాపు రోజు 120 ఎంఎల్‌డీల మురుగు నదిలో కలుస్తుండటంతో నది గరళంగా మారుతోంది.

**ఈ చర్యలు చేపట్టాలి..**నది పరీవాహక ప్రాంతం విషయంలో కచ్చితమైన హద్దుల కోసం ఏరియల్ సర్వే చేయాలి.ఆక్రమణలు, నీటి కలుషితం, ఇసుక దోపిడీపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.విపత్తులు ఎదురవకుండా అవసరమైన నిర్మాణాలకు ప్రణాళిక రూపొందించాలి.పర్యాటక ప్రదేశంగా నది పరీవాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు వసతులు కల్పించాలి.తిరుగు జలాలతో ఏర్పడే ఇబ్బందులకు అడ్డుకట్ట వేయాలి.సంరక్షణకు పాటు పడే స్వచ్ఛంద సంస్థలకు యంత్రాంగం సహకారం అందాలి.

# నేల సారం తెలిసేదెలా!




పెద్దపల్లి : వ్యవసాయంలో విచ్చలవిడిగా ఎరువుల వాడకంతో పర్యావరణానికి నష్టంతో పాటు పంట ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి. మరోవైపు రైతులకు దన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన మినీ భూసార కిట్లు మూలన పడ్డాయి. ఆయిల్‌పామ్ సాగుకు భూసార పరీక్షలు తప్పనిసరి కావడంతో రైతులు నమూనాలు తీసుకొని సొంత ఖర్చుతో కరీంనగర్ వెళ్తున్నారు. భూసార కిట్లను వినియోగంలోకి తీసుకొస్తే రైతులకు ప్రయోజనం కలగనుంది.

**ఇదీ ఉద్దేశం**

ప్రతి సీజన్‌లో పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు నిర్వహిస్తే ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం జరుగుతుంది. ఆ మేరకు అవసరమైన పోషకాలు అంది, అధిక దిగుబడులు వస్తాయి. గ్రామాల్లో మట్టి నమూనాలను పరీక్షించేందుకు రెండున్నరేళ్ల కిందట ప్రతి రైతు వేదికకు ప్రభుత్వం మినీ కిట్లు సరఫరా చేసింది. క్షేత్ర స్థాయిలో ఆసక్తి కలిగిన రైతులు ఏఈవోలను సంప్రదిస్తే మట్టి నమూనాలు తీసుకొని పరీక్షలు చేయాల్సి ఉంది. దూర ప్రాంతాల్లోని ప్రయోగశాలకు వెళ్తే అన్నదాతపై ఆర్థికంగా భారం పడుతుందనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. కిట్లకు అవసరమైన రసాయనాలను మొదట్లో అరకొరగా పంపిణీ చేయడంతో నామమాత్రంగా వినియోగించారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోక కిట్లు మూలనపడ్డాయి.

**54 వేదికలకు సరఫరా**

భూసార పరీక్షల నిర్వహణకు దూరా భారం తగ్గించేందుకు జిల్లాలో 54 రైతు వేదికలకు కిట్లు సరఫరా చేశారు. నేలలో నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణం ఏ స్థాయిలో ఉంటుందో మూడు రకాల పరీక్షలు చేయాల్సి ఉంటుంది.ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలి.వినియోగంలో లేక రైతు వేదికల్లోని కిట్లు పనికి రాకుండా పోతున్నాయి.

మట్టి సేకరించే విధానం ఇదీ..

ఎకరా విస్తీర్ణంలో నాలుగు నుంచి ఎనిమిది చోట్ల మట్టి నమూనాలు సేకరిస్తారు.15 సెం.మీ. లోతు తవ్వి 'వీ' ఆకారంలో మట్టిని తీసుకుంటారు.మట్టిని పేపర్‌పై వృత్తాకారంలో పోసి 'ఫ్లస్' ఆకృతిగా చేస్తారు.నాలుగు భాగాలుగా చేసి ఎదురెదురుగా ఉన్న రెండింటిని ఒక దగ్గరకు చేరుస్తారు.ఇలా చేస్తూ అర కిలో పరిమాణంలో మట్టిని సేకరించి ప్రయోగశాలకు పంపిస్తారు.

అవసరమైన వారు కరీంనగర్‌కు వెళ్లాల్సిందే

జిల్లాలో రైతులు ఏళ్ల తరబడి మూస ధోరణిలో విచ్చలవిడిగా ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేల సారం దెబ్బతింటోంది. యూరియా అధిక వాడకంతో నైట్రేట్ శాతం పెరుగుతోంది. నేలలో భాస్వరం, నైట్రేట్ మితంగా ఉంటేనే పోషకాల సమతుల్యతతో పర్యావరణ పరంగా ముప్పు తప్పుతుంది. మోతాదు మించడంతో పంట దిగుబడులూ తగ్గుతున్నాయి. స్థానికంగా ప్రయోగశాల లేకపోవడం, కిట్లు వాడకం లేక వ్యవసాయ అధికారులు నమూనాలను కరీంనగర్‌కు పంపిస్తున్నారు. ఫలితాల వెల్లడిలో జాప్యం జరుగుతోందని రైతులు సొంత ఖర్చులతో తీసుకెళ్లాల్సి వస్తోంది.

**ఫలితాల్లో ఆలస్యం లేకుండా చర్యలు**జిల్లాలోని రైతు వేదికలకు అందించిన మినీ భూసార కిట్లు పని చేయడం లేదు. అందులో వాడే ద్రావణాలకు నిధుల సమస్య ఉంది. రైతులు కోరితే మట్టి నమూనాలు సేకరించి కరీంనగర్‌కు పంపిస్తున్నాం. ఫలితాల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

# నాడు అద్భుతం.. నేడు దుర్భరం

హైదరాబాద్ : భాగ్యనగరానికి మూసీ నది వరంలాంటిది. నిజాం నవాబులు ఆ విషయాన్ని ఎప్పుడో నిరూపించారు. 'మహా వరద'తో నగరాన్ని ముంచేసిన మూసీకి.. జంట జలాశయాల నిర్మాణంతో కళ్లెం వేశారు. నది పొడవునా రక్షణ గోడ, ఇరువైపులా ఉద్యానవనాలను అభివృద్ధి చేశారు. అద్భుతమైన కట్టడాలు, ఆస్పత్రులు, నదిపై వంతెనలు నిర్మించారు. కానీ.. తర్వాతి పాలకుల నిర్లక్ష్యంతో నది దుర్భరంగా మారింది. ఇప్పుడు.. గుర్రపుడెక్క, దోమలు, నిర్మాణ వ్యర్థాలు, ఆక్రమణలు, మురుగు జలాలే కనిపిస్తున్నాయి. ఆక్రమణలు తొలగించి, అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మూసీని తీర్చిదిద్దుతామన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికపైనే నగరవాసులు ఆశపెట్టుకున్నారు. ఏటా మార్చి 14న నదుల సంరక్షణే లక్ష్యంగా నిర్వహించే 'అంతర్జాతీయ నదుల కార్యాచరణ దినోత్సవం' సందర్భంగా మూసీ నది పై ప్రత్యేక కథనం.

**నిజాం నవాబులు చేసిందే..**మూసీకి 1908లో భారీ వరదలు వచ్చాయి. మరోసారి అలాంటి సమస్య నగరానికి తలెత్తకూడదన్న సంకల్పంతో.. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ చర్యలు తీసుకున్నారు. నవాబు విజ్ఞప్తితో ప్రముఖ ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల నిర్మాణానికి, నది అభివృద్ధికి ప్రణాళిక ఇచ్చారు. ఆ మేరకు జలాశయాలు నిర్మాణమయ్యాయి. తర్వాతి రోజుల్లో..: తెలుగుదేశం ప్రభుత్వం 'నందనవనం' పేరుతో బాపూఘాట్ నుంచి నాగోల్ వరకు నదిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వందలాది మందికి పునరావాసం కల్పించి, కొంత మేర నదీ గర్భంలో కాంక్రీటు కాలువలు నిర్మించగా, 2001లో పనులు నిలిచినట్లు సమాచారం. కాంగ్రెస్ సర్కారు రూ.908కోట్లతో చేపట్టిన 'సేవ్ మూసీ' కార్యక్రమం కూడా అసంపూర్తిగా నిలిచిపోయింది. **2017లో ఎంఆర్‌డీసీఎల్ ఏర్పాటు..**

భారాస సర్కారు 2017లో మూసీ నది అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసింది. నది సుందరీకరణకు రూ.16,635 కోట్లతో అంచనాలు రూపొందించింది. సర్వేలో 8,475 ఆక్రమణలు ఉన్నట్లు లెక్క తేలింది. వాటిని తొలగించి.. పైవంతెనలు నిర్మిస్తామని సర్కారు ప్రకటించింది.

## బూడిద.. చూపుతుంది ఉపాధి

మణుగూరు : విద్యుదుత్పత్తి ప్లాంట్ నుంచి వెలువడే బూడిద వ్యర్థాలు ఉపాధిని కలిగించనున్నాయి. విద్యుదుత్పత్తికి వినియోగించే బొగ్గు ద్వారా బూడిద వెలువడుతుంది. అటువంటి బూడిదను అందించి ఇటుక తయారీ యూనిట్లను నెలకొల్పేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. బీటీపీఎస్ ప్లాంట్ నుంచి రోజుకు వేల టన్నుల్లో బూడిద వ్యర్థాలు వెలువడతాయి. అయితే ఆ బూడిదను సిమెంటు పరిశ్రమలు వినియోగిస్తాయి. అంతేకాకుండా బూడిదతో ఇటుకలను తయారు చేస్తారు. బూడిదను అందించటంతో ఇటుకల తయారీ పరిశ్రమలను స్థానికులు ఏర్పాటు చేసుకునే అవకాశం వచ్చింది. ఆ దిశగా యువకులు, ఔత్సాహికులు ముందుకు రావాలి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్న క్రమంలో వాటి నిర్మాణానికి ఇటుకల అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటుకల తయారీ పరిశ్రమలు ఉపాధిని కలిగిస్తాయి. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బూడిదతో



ఇటుకల తయారీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

**తక్కువ ధరకే...**బీటీపీఎస్ నుంచి వెలువడే బూడిదను అతి తక్కువ ధరకే అందించను న్నారు. బీటీపీఎస్ నుంచి వెలువడే బూడిదను రోజుకు యాష్ పాండ్‌కి 4,500 టన్నులు, సైలోకి 2 వేల టన్నులు పంపిస్తున్నారు. యాష్‌పాండ్ బూడిదను టన్నుకి రూ.1కి, సైలో బూడిదను టన్నుకి రూ.99కి అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీటీపీఎస్ ప్లాంట్ దూరంగా ఉండటంతో బూడిదను కొనుగోలు చేసే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. స్థానికులకు ఎటువంటి టెండర్ లేకుండానే తక్కువ ధరకు బూడిదను అందించేందుకు ప్లాంట్ అధికారులు సిద్ధంగా ఉన్నారు. **స్థానికులను ప్రోత్సహిస్తాం : బిచ్చన్న, సీఈ**

ఇటుక తయారీ పరిశ్రమల ఏర్పాటుకు బూడిదను అందించి స్థానికులను ప్రోత్సహిస్తాం. స్థానిక ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

## రక్తశుద్ధి సేవలు భేష్

ఆదిలాబాద్ : రిమ్స్ ఆసుపత్రిలో అపెక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాలసిస్(రక్తశుద్ధి) కేంద్రంలో బాధితులకు అందిస్తున్న సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. గత నెలలో రిమ్స్ డయాలసిస్ కేంద్రం రెండో స్థానంలో నిలిచింది. సిద్దిపేటలోని డయాలసిస్ కేంద్రం గత నెలలో 1,035 సెషన్స్ రక్త శుద్ధి చేసి మొదటి స్థానం, ఆదిలాబాద్ కేంద్రంలో 1,015 సెషన్స్ పూర్తయి రెండోస్థానంలో నిలిచాయి. ప్రతి రోజు నాలుగు షిఫ్టుల్లో 40 మంది బాధితులకు రక్తశుద్ధి చేస్తున్నారు. మొత్తం 97 మంది ఇందులో సేవలు పొందుతున్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో డయాలసిస్ కేంద్రం 2018లో డీమెట్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆ తరువాత అపెక్స్ సంస్థ వారు 2023 నుంచి ఈ కేంద్రం నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. 2023 నుంచి గత నెల వరకు ఈ కేంద్రంలో 20,116 సెషన్స్‌లో రక్త శుద్ధి చేశారు. ఈ కేంద్రంలో మొత్తం 15 పడకలు ఉన్నాయి. మొత్తం 97 మంది కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలను అందిస్తున్నారు. అత్యధిక మంది బాధితులకు సేవలందించడానికి కేంద్రం బాధ్యుడు రాథోడ్ ప్రేందాస్ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటూ బాధితులకు మెరుగైన విధంగా సేవలందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

బాధితులు నేరుగా సంప్రదించవచ్చు - డాక్టర్ రాథోడ్ జైసింగ్, రిమ్స్ సంచాలకుడురిమ్స్ డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ బాధితుల రక్తశుద్ధి కోసం అన్ని విధాల సౌకర్యవంతంగా మెరుగైన సేవలందించే ఏర్పాట్లు చేశారు. అవసరమైన బాధితులు నేరుగా కేంద్రంలో సంప్రదించి సేవలు పొందటానికి వీలు కల్పించాం. ప్రతి రోజు నాలుగు విడతలుగా రక్త శుద్ధి సేవలందిస్తున్నాం.

## పెన్‌గంగ హోరు.. కర్షకుల కన్నీరు

ఆదిలాబాద్ : వర్షాకాలంలో చెరువు నిండిందంటే చాలు చెరువుగట్టు దగ్గర కట్ట మైసమ్మ పేరిట ఊరంతా కలిసి చేసే వేడుక నేటికీ ఆనవాయితీగా వస్తూనే ఉంది. అందులో అంతర్లీనమైన భావమేంటో నేటి తరానికి అంతగా తెలియకపోయినా చెరువు పొంగి పంటలను ముంచెత్తకుండా, ఊరిపై ఉపద్రవం తలెత్తకుండా సమతుల్యతను పాటించాలని ముందు జాగ్రత్తలను వెల్లడించే హితం అందులో ఇమిడి ఉంది. నదుల ప్రాముఖ్యతను, వాటి వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వెల్లడించేలా ఏటా మార్చి 14న అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో పెన్‌గంగ నది దాని ప్రాముఖ్యతపై ప్రత్యేక కథనం.

**ఇదీ ప్రాముఖ్యత..** పెన్‌గంగ నది మహారాష్ట్రలోని బుల్డనా జిల్లా అజంతా పర్వత శ్రేణుల్లో మహద్ గ్రామంలో పుడుతుంది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గుబిడి నుంచి కుమురం భీం జిల్లా తుమ్మిహెట్టి వరకు 140 కి.మీ మేర నది ప్రవహిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో భీంపూర్, జైనథ్, బేల మండలాల మీదుగా ప్రవహిస్తోంది. వరదల సమయంలో భారీగా నీరు వృథాగా పోతోంది. జైనథ్ మండలం కోర్ట సమీపంలో 6 టీఎంసీల సామర్థ్యంతో చనాఖా-కోర్ట బ్యారేజీని ప్రభుత్వం చేపట్టింది. సంవత్సరం పొడవునా పెన్‌గంగలో నీరుంటుంది. మూగజీవాల దాహం తీర్చుతుంది. పంటలకు జీవం పోస్తోంది. పెన్‌గంగలో ఇసుక అక్రమ రవాణా నది పాలిట శాపంగా మారుతోంది. రోజూ వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. వర్షాకాలంలో గ్రామాలతో పాటు వేల ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయి.

**ఆక్రమణలతో ఏటా కష్టాలు..** పెన్‌గంగ ఉద్ధృతితో వర్షాకాలంలో అన్నదాతలకు కంటిపై కునుకు ఉండదు. సాత్నాల నుంచి వచ్చే వాగులపై కూడా ప్రభావం పడుతుంది. ఆదిలాబాద్‌లోని ఖానాపూర్, మావల చెరువులు పొంగినప్పుడు పట్టణంలోని శివారు కాలనీలకు ముప్పు పొంచి ఉంటోంది. మావల చెరువును ఆనుకొని ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో అనర్థాలకు దారి తీస్తోంది. బంగారుగూడ వాగు, భీంపూర్ మండలంలోని గుబిడి వాగు, తాంసి మండలంలోని మరికొన్ని వాగులు, ఒర్రెలకు వరద పోటెత్తుతుంది. ప్రధానంగా ఏజెన్సీలోని ఇంద్రవెల్లి, ఇచ్చోడ, ఆదిలాబాద్ గ్రామీణ మండలం వాగులలో నీటి ఉద్ధృతి పెరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**ముంచెత్తుతున్న వరద..** ఉమ్మడి జిల్లాలో సగటున 1,147 మి.మీ వర్షపాతం నమోదవుతోంది. వాగులు, వంకలు వరదలతో పోటెత్తినా ఎలాంటి ఇబ్బంది తలెత్తేది కాదు. ఇటీవలి కాలంలో పరిస్థితి మారుతోంది. ఒకప్పుడు 43 శాతం ఉన్న అటవీ విస్తీర్ణం క్రమంగా 23 శాతానికి తగ్గిపోవటం, నదులు, చెరువులను ఆక్రమించుకోవటంతో వరద గ్రామాలను ముంచెత్తుతోంది.

# విలీనం.. అభివృద్ధికి దూరం

వేములవాడ: మున్సిపాలిటీలో తమ గ్రామాలు విలీనమైతే మెరుగైన అభివృద్ధి ఉంటుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. వీధుల్లో కనీసం మురుగు కాలువలు, సీసీ రోడ్ల వసతి నేటికీ సమకూరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీలో తిప్పాపూర్, నాంపల్లి, అయ్యోరుపల్లి, శాత్రాజుపల్లి, కోనాయిపల్లి గ్రామాలను ఐదేళ్ల క్రితం విలీనం చేశారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల పరిపాలన మున్సిపల్ పరిధిలోకి వెళ్లి పోయింది. అప్పటి నుంచి తమకు సమస్యలు మొదలయ్యాయని ప్రజలు అంటున్నారు. ఏచిన్న పని కావాలన్నా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సి రావడంతో సమస్యలు మరింత పెరిగాయి. చాలా దూరంలో ఉన్న గ్రామాలను సైతం మున్సిపల్‌లో విలీనం చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. నాంపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి గ్రామాలు పట్టణానికి దాదాపు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. ఏదేని అవసరాలకు వేములవాడలోని మున్సిపల్ కార్యాలయానికి రావడం తమకు ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**శివారు కాలనీల్లోనూ...**

ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణం రోజు రోజుకూ విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లో కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పట్టణం చుట్టూ బైపాస్ రహదారులు, శివారు వీధులతో పాటు సాయినగర్, కోరుట్ల వైపు రోడ్డు, మల్లారం రోడ్డు, తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు నేటికీ లేవు. పట్టణం నుంచి మల్లారం వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి మురుగు కాలువ లేక పెద్ద ఎత్తున మురుగు రోడ్డుపై పారుతోంది. దుర్గంధం వెదజల్లడంతో తాము రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఆయా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అంటున్నారు. లేకుంటే వర్షాకాలంలో మురుగు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

**మౌలిక వసతులేవీ...**


విలీన గ్రామాల్లో మౌలిక వసతులు అంతంతమాత్రమే ఉన్నాయి. చాలా గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల సదుపాయం లేదు. వర్షాకాలంలో చాలా వీధులు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ మన్సిపల్‌లో రెండేళ్ల క్రితం టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 కోట్లతో పాటు ఇతరత్రా నిధులను మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి వెచ్చించినప్పటికీ అవి సరిపోలేదు. చాలా గ్రామాల్లోని అంతర్గత వీధుల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. వర్షాకాలంలో మురుగు వీధుల్లో పారుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యలు మొరపెట్టుకున్నా పరిష్కారం కావడం లేదని అంటున్నారు.

**నిధులు మంజూరు కావాల్సి ఉంది**

గతంలో మంజూరైన నిధులతో పట్టణంలోని వివిధ వార్డులతో పాటు విలీన గ్రామాల్లోనూ మురుగు కాలువలు, సీసీ రోడ్ల పనులు చేపట్టాము. పలుచోట్ల ఇంకా మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# ఆర్టీవో కార్యాలయానికి మోక్షమెప్పుడో..!

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గం మారుమూల గిరిజన ఏజెన్సీ ప్రాంతం. నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలో 60 శాతం వరకు గిరిజనులే నివసిస్తున్నారు. నిరక్షరాస్యత ఎక్కువగా ఉండి ఉపాధి కోసం వలసలు వెళ్లే ప్రాంతంలో 2013లో ఆర్టీఓ కార్యాలయం మంజూరైనప్పటికీ దశాబ్ద కాలంగా దాని ఏర్పాటు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వాహనదారులు లైసెన్సు పొందాలన్నా.. రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా.. తిప్పలు తప్పడం లేదు. డివిజన్‌లో చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, గుడిపల్లి, గుర్రంపోడ్, చింతపల్లి, కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాలున్నాయి. డిండి మండలం నాగర్‌కర్నూల్ జిల్లాను ఆవరించి ఉంటుంది. అంటే దేవరకొండకు 40 కి.మీ దూరంగా విసిరేసినట్లుగా ఉంటుంది. చందంపేట మండలం పొగిళ్ల గ్రామం దేవరకొండకు 60 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. దాదాపు కృష్ణాపరివాహక ప్రాంతంలో గ్రామాలుంటాయి. వీరు వాహనాలు కొనుగోలు చేసినప్పుడు వాటి రిజిస్ట్రేషన్, లైసెన్సు రెన్యువల్, ఓనర్‌షిప్ మార్పిడి, ఫిట్‌నెస్ చేపట్టాలంటే మిర్యాలగూడకు తీసుకొని వెళ్లాల్సిందే. మిర్యాలగూడ దాదాపు 130 నుంచి 150 కిమీ వరకు ఉంటుంది.



డివిజన్‌లో దాదాపు 30వేల ద్విచక్రవాహనాలు, 5వేల వరకు ఆటోలు, 10వేల నాలుగు చక్రాల వాహనాలున్నాయి. ట్రాక్టర్లు దాదాపు 3వేల వరకు ఉంటాయి. వీటితోపాటు లారీలు 2500 ఉంటాయి.

వాహనదారులకు ఇక్కట్లు:
శ్రీనివాసాచారి, దేవరకొండ
డివిజన్‌లో ఆర్టీవో కార్యాలయం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం దేవరకొండ నుంచి 80 కిమీ దూరంలో ఉన్న మిర్యాలగూడకు వెళ్లాలంటే ఒకరోజు సమయం పడుతుంది.

**ఏర్పాటుకు కృషి:**
నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్యే
నియోజకవర్గంలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు కోసం తన వంతుగా కృషిచేస్తున్నా. సంబంధిత అధికారులతో ఇప్పటికే దీనిపై చర్చించాం.

# దరఖాస్తుల గుట్టలు.. దేనికి సంకేతం



హైదరాబాద్ : నగరంలో నిర్మాణ అనుమతులకు నిరీక్షణ తప్పట్లేదు. పత్రాలన్నీ సవ్యంగా ఉన్నప్పటికీ.. దరఖాస్తులు నెలల తరబడి మూలుగుతున్నాయి. కొందరు ముడుపుల కోసం తొక్కిపెడుతుంటే.. మరికొందరు మితిమీరిన సందేహాలతో అపార్ట్‌మెంట్లు, ఆకాశహర్మ్యాల దస్త్రాలను అటకెక్కిస్తున్నారు. అధికారుల తీరుతో.. 21రోజుల్లో అనుమతి జారీ కావాలన్న టీజీ–బీపాస్ చట్టం అపఖ్యాతికి గురవుతోంది. గడువులోపు దస్త్రాన్ని ఆమోదించకపోతే అధికారులకు జరిమానా వేయాలన్న నిబంధన బుట్టదాఖలైంది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నెలకొన్న దుస్థితే ఇందుకు నిదర్శనం.

**తాత్సారం.. ఇదేం వ్యవహారం?**

ఐదు అంతస్తులకుపైగా చేపట్టే ప్రతి నిర్మాణ దరఖాస్తు జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయానికి రావాల్సిందే. వాటిపై వారానికోసారి టౌన్‌ప్లానింగ్ అధికారులు బిల్డింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని చర్చిస్తారు. అందులో ఆమోదం పొందిన దస్త్రాలను ఎంఎస్‌బీ(మల్టీ స్టోర్డ్ బిల్డింగ్) సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించాలి. ఆ సమావేశాన్ని నిర్వహించకుండా జీహెచ్‌ఎంసీ చాలా రోజులుగా తాత్సారం చేస్తోంది. ఈ నేపథ్యంలో భారీగా ముడుపుల వ్యవహారం నడుస్తోందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అందుకోసమే దరఖాస్తులను తొక్కిపెడుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

**ఉన్నతాధికారుల వద్ద..**

జీహెచ్‌ఎంసీ కమిషనర్ లాగిన్‌లో ప్రస్తుతం 56 దరఖాస్తులున్నాయి. అందులో 172 రోజులుగా నిలిచిన దస్త్రంతోపాటు, దీర్ఘకాలంగా పెండింగులోనివీ ఉన్నాయి. సీసీపీ (చీఫ్ సిటీ ప్లానర్) వద్ద 12 దస్త్రాలున్నట్టు సమాచారం. పై స్థాయిలోనే నిలుస్తుంటే.. మేమూ తక్కువ కాదనే ధోరణిలో.. కిందిస్థాయిలోని ఏసీపీ (అసిస్టెంట్ సిటీ ప్లానర్), సీపీ(సిటీ ప్లానర్)ల స్థాయిలోని అధికారులు దరఖాస్తులను తొక్కిపెడుతున్నారు.

**ముడుపుల కోసమేనా..?**

నగరంలో కీలకమైన కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లు కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపిస్తుంటాయి. ప్రధాన జోన్‌కు ఏసీపీగా పనిచేస్తోన్న అధికారి దస్త్రాన్ని కదిలించాలంటే.. నిర్మాణ సంస్థ దళారి ద్వారానే సంప్రదించాలి. మరో కీలక జోన్‌కు ఏసీపీగా ఉన్న మహిళా అధికారిదీ అదే పంథా. మూడు వారాలైతేగానీ భూమి తనిఖీకి వెళ్లరు. అవసరం లేకున్నా.. లాగిన్‌లోని దస్త్రాలను భూసేకరణ అధికారికి మళ్లించి.. తన వద్ద ఫైళ్లు లేవంటారు. ప్రధాన నగరంలోని జోన్‌కు సీపీగా పనిచేసే అధికారి ప్రొసిడింగ్ ఆర్డర్ ఇవ్వాలన్నా, దస్త్రాన్ని కదలించాలన్నా ముడుపులు సమర్పించుకోవాల్సిందే. టౌన్‌ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారి సైతం.. చట్టంలో లేని నిబంధనలను సొంతంగా సృష్టించి అనుమతుల జారీలో పక్షపాతం చూపుతున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

# నిరీక్షణకు తెర



వికారాబాద్: జిల్లాకు 22,404 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. కొత్త కార్డులు పొందిన వారికి ఈ నెల నుంచే బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కొత్త రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరంతరం దరఖాస్తుల ప్రక్రియ..: కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఇంకా కార్డు రాని వారు దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అయితే కొత్తగా అర్జీ చేసుకున్న వారికి కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని అధికారులు చెబుతున్నారు.

**కార్డులు ఇలా..**


జిల్లాలో 588 ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు, ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ పథకాల కింద 2,41,179 రేషన్ కార్డులు ఇది వరకే ఉన్నాయి. కులగణనలో సేకరించిన వివరాల ప్రకారం జిల్లాలో కుటుంబాల సంఖ్య 2.8 లక్షల వరకు ఉన్నాయి. కొత్తగా 22,404 జారీ చేయడంతో రేషన్ కార్డుల సంఖ్య 2,63,583కు పెరిగాయి.

**సంక్షేమ పథకాలకు దూరం..**

పదేళ్ల కిందట జన్మించిన పిల్లలకు రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు కాలేదు. నూతన రేషన్‌కార్డులు అందక రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వ సహాయానికి, సంక్షేమ పథకాలకు ఇన్నాళ్లు దూరమయ్యారు. ఆరోగ్యశ్రీ, 200 యూనిట్లలోపు విద్యుత్తు బిల్లులు, గ్యాస్ బండ రాయితీ, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హత ఉన్నా రేషన్ కార్డు చేతికందకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. 2021లో అర్హులు కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా అప్పట్లో 8,562 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో నిరీక్షణ తప్పలేదు.

**ఈ నెల నుంచే బియ్యం పంపిణీ..**జిల్లాలో నూతనంగా జారీ చేసిన 22,404 మంది రేషన్ కార్డుదారులకు ఈ నెల నుంచే బియ్యం పంపిణీ చేస్తాం. కొత్త కార్డుదారుల డీకేఆర్ పూర్తి కావడంతో ప్రింటౌట్ తీసుకుంటే సరిపోతుంది. ఇంకా కార్డులు రాని వారు పలువురు ఉన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. మోహన్‌బాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి

# కబ్జా చేసి.. కలిపేసుకొని



జగిత్యాల : ఉమ్మడి జిల్లా వరదాయనియైన శ్రీరామసాగర్ ప్రాజెక్టు భూములు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. ఆయకట్టుకు ప్రధానంగా నీటిని తరలించే కాకతీయ కాలువ 25వ కి.మీ వద్ద జగిత్యాల జిల్లాలోకి ప్రవేశించి 146 కి.మీ వరకు ఎల్‌ఎండీ ఎగువన జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు నీటిని అందిస్తోంది. ఎల్‌ఎండీ దిగువన 146 కి.మీ నుంచి కాకతీయ కాలువ కరీంనగర్ జిల్లా నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోకి ప్రవహిస్తుంది. కాకతీయ కాలువ నీటి తరలింపు, కాలువ వెడల్పు, లోతునుబట్టి ఇరువైపులా రహదారితో పాటు 150–250 అడుగులుండేలా అదనంగా భూమిని సేకరించారు. దీంతోపాటు ప్రధాన డిస్ట్రిబ్యూటరీలు, ఉపకాలువలు, పిల్లకాలువలు వందల కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్నాయి. ప్రధాన కాకతీయ కాలువకు ఇరుపక్కల భూమితో పాటు ఉపకాలువల వెంబడి పెద్దఎత్తున భూమి అన్యాక్రాంతమైంది.

**ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు..**

కాకతీయ కాలువకు ఇరువైపులా తవ్వుకుంటూవచ్చి పొలాలు చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీ ఉప కాలువకు మధ్యలో నుంచి ఓ వైపు 33, మరో వైపు 44 అడుగుల వరకు భూమి ఉండాల్సి ఉన్నా వందల కిలోమీటర్ల మేరకు ఒకవైపున కాలువ వరకు తమ భూముల్లో కలిపేసుకున్నారు. ఒకవైపున మాత్రమే రహదారి కుంచించుకుపోయి ఉండటం ప్రతి గ్రామంలోనూ కనిపిస్తోంది. మెట్‌పల్లి పట్టణం గుండా వెళ్తున్న ఓ ఉప కాలువను కొన్నేళ్ల కిందట ఆక్రమించి ఇళ్లు, ఇతర కట్టడాలు నిర్మించారు. సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ ఉప కాలువ ప్రస్తుతం మురుగు కాల్వగా మారింది. మెట్‌పల్లి మండలంలో పలు ఉప కాలువల స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. కోరుట్ల, మెట్‌పల్లి మండలాల గుండా వెళ్తున్న ప్రధాన కాలువ ఇరువైపులా భూమిని ఆక్రమించి వరి, మొక్కజొన్న, మామిడి తోటల పెంపకం చేపట్టారు. కొన్ని చోట్ల కోళ్లఫారాలను నిర్మించారు. వెల్లుల్ల శివారులో ఎస్సారెస్పీ ప్రధాన కాలువ స్థలాన్ని ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారని కొందరు రైతులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి.

కోరుట్ల మండలం కిషన్‌రావుపల్లెలో ఎస్సారెస్పీ మినీ కాలువను ఆక్రమించి ఇళ్లు, ఇతర కట్టడాలు చేపడుతున్నారు. కేవలం కిషన్‌రావుపల్లెనే కాకుండా వందలచోట్ల ఇలా ఎస్సారెస్పీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులో ఎస్సారెస్పీ డి–32(బీ) ఉపకాలువ. కొన్నేళ్లుగా తూముకు సరిపడా నీరు విడుదలకాకపోవడంతో ఉప కాలువలో నీరు ప్రవహించడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని కాలువను పలుచోట్ల ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు.

స్సారెస్పీ ప్రధాన కాలువ పక్కన అక్రమంగా మామిడి తోట సాగు చేస్తున్న ఈ చిత్రం కోరుట్ల పరిధిలోని ఏఖీన్‌పూర్ శివారులోనిది. ప్రధాన కాలువకు ఇరువైపులా ఎస్సారెస్పీకి చెందిన స్థలం ఉంటుంది. యథేచ్ఛగా ప్రధాన కాలువ పక్కన స్థలాన్ని ఆక్రమించి పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు.

**సర్వే చేసి డిజిటలైజ్ చేయాలి**

ఎ.హెచ్.ఖాన్, నీటిపారుదలశాఖ అధికారి

ఎస్సారెస్పీ స్థలాల ఆక్రమణల స్వాధీనానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. 1970 నుంచి ప్రాజెక్టు కాలువలు, క్యాంపులకు స్థలాలను సేకరించగా ప్రస్తుతం ఈ స్థలాలను మళ్లీ సర్వేచేసి మ్యాప్‌లను సిద్ధంచేసి డిజిటలైజ్ చేస్తేనే భవిష్యత్తులో ఆక్రమణలకు చోటుండదు. లక్షలాదిమందికి జీవనాన్ని అందించే ప్రాజెక్టు స్థలాల పరిరక్షణను ప్రజలందరూ బాధ్యతగా తీసుకోవాలి.

# గ్రామస్థుల గ్రంథాలయం..!

చిట్యాల : యువతను సన్మార్గం వైపు మళ్లించడంతో పాటు, నిరుద్యోగులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా గ్రామస్థులే స్వయంగా దాతల నుంచి సుమారు 10 వేల పైచిలుకు పుస్తకాలను సేకరించి 'నవయుగ చైతన్య గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చిట్యాల మండలం తాళ్లవెల్లంలకు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు కొండవీటి రాధాకృష్ణ (ఇటీవల మృతిచెందారు), మాదగోని భిక్షపతి గౌడ్, అభ్యుదయ రైతు పజ్జూరు అజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు గ్రామస్థులతో కలిసి తమ ఆలోచనను ఆచరణ రూపంలోకి తీసుకొచ్చారు. 2023 డిసెంబరులో జలసాధన ఉద్యమకారుడు దుశ్చర్ల సత్యనారాయణ చేతులమీదుగా ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించుకున్నారు.

**10 వేల పుస్తకాలు, రెండు దినపత్రికలు**



బీసీ కాలనీలోని బీసీ సామాజిక భవనం నాలుగు గదుల్లో రెండింటిని గ్రంథాలయానికి వినియోగించుకుంటున్నారు. షెడ్డు నిర్మించి, వయోవృద్ధులు వస్తే కూర్చోడానికి ఏర్పాటు చేయించారు. ఉదయం 6 గంటల నుంచి 10గం. వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు గ్రంథాలయ పనివేళలుగా నిర్ణయించారు. పదో తరగతి విద్యార్థుల నుంచి ఐఏఎస్‌కు సన్నద్ధమయ్యేవారికి అవసరమైన పుస్తకాలు ఉన్నాయి. గ్రంథాలయ సభ్యత్వానికి సంబంధించి ప్రవేశరుసుం నెలకు రూ.11 వసూలుచేసి, గ్రంథాలయం పేరిట తెరిచిన బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నారు. ప్రస్తుతం 40 మంది వరకు సభ్యులున్నారు. చదువరులు కూడా రోజుకు 30 మంది వరకు వస్తున్నారు. గ్రంథాలయ కేంద్రంగా చేసుకుని గ్రామస్థుడు గట్టోజు శ్రీనివాస్ చిన్నారులకు గురుకుల విద్యాసంస్థల ప్రవేశాలకు ఉచితశిక్షణ ఇస్తున్నారు.గ్రంథాలయ నిర్వహణ గ్రామస్థులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు విన్నవించామని మాదగోని భిక్షపతిగౌడ్ తెలిపారు. కలెక్టర్ స్పందించి జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి బాలమ్మను మా గ్రంథాలయ సందర్శనకు పంపించారు. నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు.

# వేగంగా.. పోతున్నారు..!

చౌటుప్పల్ : వేగం కన్నా ప్రాణం మిన్నా.. రహదారి భద్రతలో ప్రధాన సూత్రమిది. ప్రచారానికి బాగానే ఉన్నా.. పట్టించేకునే వారేరి?.. రోజూ హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో అతివేగం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడమే ప్రధాన కారణం. హైవేపై 80 కిలోమీటర్ల వేగం లోపు ప్రయాణించాలి. కానీ.. నిగనిగలాడే నాలుగు వరుసల జాతీయ రహదారిపై 100 నుంచి 150 కిమీ వేగంతో పలు వాహనాలు ప్రయాణిస్తున్నాయి. రయ్‌మంటూ బైక్‌పై దూసుకెళ్లే యువకుడు కన్నుమూసి కన్ను తెరిచేలోగా కనుమరుగవుతున్నాడు.

**ఎక్కువగా పాదచారులు, ద్విచక్రవాహనచోదకులే..**

రహదారిపై ఎక్కువగా కూడళ్ల వద్దే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డును దాటే సమయంలో పాదచారులు, ద్విచక్రవాహనచోదకులే ఎక్కువగా ప్రాణాలను విడుస్తున్నారు. నేరుగా వెళ్లే లైట్‌మోటారు, భారీ వాహనానచోదకులు కూడళ్ల వద్ద కూడా అధిక వేగంతో వెళ్తుండటమే దీనికి కారణం. హైవేపై సరిగ్గా సీసీ కెమెరాలు కూడా లేవు. కూడలికి కొద్దిదూరం సూచికబోర్డులు, బోలార్డ్స్, స్టడ్స్, డంబుల్ స్ట్రిప్స్ వంటివి పెట్టినా చోదకులు గమనించడం లేదు.కూడళ్ల వద్ద 40 కి.మీ వేగం కంటే అధికంగా వెళ్లొద్దు. కొన్నేళ్ల క్రితం చౌటుప్పల్ మండలం ఎల్లంబావి అండర్‌పాస్ వంతెనపై, పంతంగి టోల్‌ప్లాజా ముందు రాడో మీటరు ఏర్పాటు చేశారు. వేగంగా వెళ్తే వాహనం ఎంత వేగంతో వెళ్తుందో చూపించడంతోపాటు వాహనదారులను నెమ్మదిగా వెళ్లమని మీటరు సూచించేది. ఇప్పుడు రాడో మీటర్లు పనిచేయడం లేదు. దారి పొడవునా కూడళ్ల వద్ద అండర్‌పాస్‌లు లేకపోవడమే ప్రమాదాలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. అతివేగంగా వెళ్లడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించపోవడం వల్లే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని వాహనచోదకులకు తరచూ అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# 'చిన్న'బోవద్దని..!

మునగాల: చిన్నారుల భవిష్యత్తుకు బీజం పూర్వ ప్రాథమిక విద్య. నేడు ఆ విద్యకు నిలయాలైన అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాలకు చిరునామాగా నిలిచాయి. జిల్లాలో ఇప్పటికీ చాలా కేంద్రాలకు సొంత భవనాలు లేవు. మరికొన్ని కేంద్రాల్లో మరుగుదొడ్లు, విద్యుత్తు, తాగునీరు, ప్రహరీలు లేకుండా ఉన్నాయి. అసౌకర్యాల కారణంగా చిన్నారులను చేర్పించడానికి కొందరు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తుండగా.. లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావడానికి సుముఖత చూపడం లేదు.



ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు కోరింది. ప్రతిపాదనల్లో శిథిలావస్థలోని భవన నిర్మాణాలకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలకు మాత్రమే అవకాశం కల్పించింది. విద్యుత్తు సౌకర్యం, ప్రహరీ నిర్మాణాలకు అవకాశం ఇవ్వలేదు.

జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1,209 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 221 అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణానికిగానూ ఒక్కో దానికి రూ.36వేల చొప్పున, 40 అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి సౌకర్యం కల్పనకు ఒక్కోదానికి రూ.17 వేల చొప్పున మొత్తం రూ.1.16 కోట్లు మంజూరు చేశారు.

జిల్లా వ్యాప్తంగా 1.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు తెలిపారు. వెంటనే ఆయా ప్రాజెక్టులో ఎంపికైన అంగన్‌వాడీల్లో మరమ్మతులు చేపట్టి, చిన్నారులకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

చురకలు



# సాయంత్రం సీజ్.. ఉదయం కాంక్రీట్ తయారీ

హైదరాబాద్ : జంట జలాశయాలకు సమీపంలో సిమెంట్ కాంక్రీట్‌ను తయారు చేస్తున్న రెడీమిక్స్ ప్లాంట్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి రెడీమిక్స్ ప్లాంట్లను నిర్వహించకూడదని హిమాయత్ సాగర్ పరిసర ప్రాంతాల్లోని 21 రెడీమిక్స్ ప్లాంట్లను బుధవారం సాయంత్రం సీజ్ చేస్తే గురువారం ఉదయం నుంచి కాంక్రీట్ తయారీ జరుగుతూనే ఉంది. లారీల్లో లోడ్ అవుతూనే ఉంది.

**ముక్కుపుటాల్లోకి ధూళి**

రెడీమిక్స్ ప్లాంట్ల కారణంగా హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాలు, కొత్వాల్‌గూడ, సీఆర్ నగర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇళ్లల్లోంచి బయటకు వస్తే చాలు ముక్కు

పుటాల్లోకి సిమెంట్ ధూళి వెళ్తోందంటున్నారు. సాయంత్రం వేళల్లో



తలపై తెల్లగా పొరలు కనిపిస్తున్నాయి. ప్లాంట్లకు ముడిసరకులు తెచ్చే భారీ వాహనాలు తాండూరు నుంచి, కంకర వాహనాలు హయత్‌నగర్ నుంచి వస్తున్నాయి. రెడీ మిక్స్ తయారయ్యాక ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ నుంచి గచ్చిబౌలి, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు వెళ్తున్నాయి. భారీ వాహనాల టైర్లతో కొత్వాల్‌గూడ – ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ పూర్తిగా ధ్వంసమైంది.

**అధికారుల సాకులు..**

హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో రెడీమిక్స్ తయారీ ప్లాంట్లకు అనుమతులుండవు. పదేళ్లలో గండిపేట, మెయినాబాద్, శంషాబాద్ మున్సిపాలిటీల్లో 50 ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. వీటికి పరిశ్రమల శాఖ అధికారులు అనుమతులిచ్చారని రెవెన్యూ అధికారులంటున్నారు. కంకర కోసం పక్కనే గుట్టలను తవ్వుతున్నారని గనుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తే పీసీబీ అనుమతుల ఆధారంగా ఇచ్చామంటున్నారు.

# తుంపర్లతో దోమలపై యుద్ధం

హైదరాబాద్ : నీటి తుంపర్లతో దోమలను అంతం చేసేందుకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. నీటిలో కొద్దిపాటి రసాయనాన్ని కలిపి.. అతి సూక్ష్మ నీటి బిందువులను గాల్లోకి విరజిమ్మే పద్ధతిలో ఈ విధానం పనిచేస్తుంది. తుంపర్లు గాలిలో పొరలా ఏర్పడతాయి. అందులో చిక్కుకున్న దోమలు మృతి చెందుతాయని జీహెచ్ఎంసీ చెబుతోంది. శంషాబాద్‌లో 400ఎకరాల్లో విస్తరించిన కన్హా శాంతి వనంలోనూ కోల్డ్ ఫాగింగ్‌నే ఉపయోగిస్తున్నారని బల్దియా దోమల నియంత్రణ విభాగం చెబుతోంది. ఇప్పుడా ప్రక్రియను కూకట్‌పల్లి జోన్‌లో అమలుకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది.

**22 డివిజన్ల పరిధిలో..**

కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని జీహెచ్ఎంసీ అధికారులు గతేడాది ప్రశాసన్‌నగర్‌లో పరీక్షించారు. అక్కడ దోమల కట్టడి మెరుగ్గా జరిగినట్టు అప్పటి కమిషనర్ ప్రకటించారు. రెండో విడతలో కూకట్‌పల్లి జోన్‌లోని ఆల్విన్‌కాలనీలో పరీక్షించేందుకు ఈ నెల 15న బల్దియా ముహూర్తాన్ని నిర్ణయించింది. కోల్డ్ ఫాగింగ్ ముందు, తర్వాతి పరిస్థితులు, కోల్డ్ ఫాగింగ్‌తో దోమలు చనిపోతాయా, సొమ్మసిల్లి పడిపోతున్నాయా, ఎన్ని దోమలు నేల రాలుతున్నాయి అనే వివరాలు తెలుసుకుంటామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ప్రస్తుతం చేస్తున్న హాట్ ఫాగింగ్‌తో దోమలు కొంత సమయం సొమ్మసిల్లి పడిపోతాయి. మైకం వదలగానే మళ్లీ విజృంభిస్తాయి.

**ఎలా పనిచేస్తుందంటే..?**

నీటి పరిమాణంలో రెండు శాతం డెల్టామెత్రిన్ రసాయనాన్ని కలుపుతారు. ఫిల్మ్ ఫామింగ్ అక్వియస్ స్ప్రే టెక్నాలజీ(ఎఫ్ఎఫ్ఏఎస్‌టీ)తో పనిచేసే యంత్రాల్లో ఆ మిశ్రమాన్ని వేసి గాల్లోకి పిచికారి చేసినప్పుడు.. అతిసూక్ష్మ నీటి బిందువులు పొరలా ఏర్పడి దోమలను అంతం చేస్తాయని తెలిపారు.

# కోమటికుంటలో ఆక్రమణల నేలమట్టం

హైదరాబాద్: చెరువును ఆక్రమించి కట్టిన ప్రకృతి రిసార్ట్స్, కన్వెన్షన్‌హాల్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తూంకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజల్ గ్రామం కోమటి కుంటలో ఈ కూల్చివేతలు చేపట్టింది. ప్రధాన రహదారి పక్కనున్న చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భారీ భవనాలు, ఫంక్షన్ హాల్, విడిది కేంద్రాలు, ఇతర కట్టడాలను పూర్తిగా తొలగించింది. ఆ నిర్మాణాలన్నీ చెరువులో ఉన్నట్లు నీటిపారుదలశాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సర్వే లో స్పష్టమైనట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. భవనాలకు అనుమతి కూడా లేదన్నారు. 'సర్వే అనంతరం యజమానులకు నోటీసులిచ్చాం. వారు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఇరువైపులా వాదనలు విన్నాక.. అక్రమ కట్టడాలను కూల్చేయాలని తీర్పు చెప్పింది. తామే తొలగించుకుంటామని యజమానులు నెల సమయం అడిగారు. నెల దాటినా అలాగే ఉన్నాయి. అందువల్ల మేమే కూల్చివేశాం'అని రంగనాథ్ వివరించారు.

**రంగనాథ్‌తో ఏజెన్సీ ప్రతినిధుల భేటీ..**

శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో అనుమతి లేని ప్రకటనల హోర్డింగులపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో పలు ఏజెన్సీల ప్రతినిధులు బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌ను కలిశారు. 10రోజుల సమయం ఇస్తే స్వయంగా తొలగించుకుంటామని కోరారు. ఇప్పటికే మీకు సమయం ఇచ్చామని, మీరు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కూల్చుతున్నామని ఆయన వారికి వివరించారు. శంషాబాద్, కొత్వాల్‌గూడ, నార్సింగి, తొండుపల్లి, గొల్లపల్లి రోడ్డు, తెల్లాపూర్ ప్రాంతాల్లో గత వారం రోజులుగా 53 ప్రకటనల బోర్డులను తొలగించామని తెలిపారు.

**కొల్లూరులోనూ..**

కొల్లూరు ఎగ్జిట్ పాయింట్ సమీపంలో మైహోమ్ సంస్థకు చెందిన హోర్డింగ్‌ను హైడ్రా అధికారులు కూల్చివేశారు. పురపాలిక సంఘం నుంచి అనుమతి పున రుద్ధరించుకోని కారణంగా తొలగించి నట్లు హైడ్రా అధికారి సతీష్ తెలిపారు.

# భూములు రైతులవే.. హక్కులు లేవాయె



హైదరాబాద్ : హైదరాబాద్ సమీపంలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ యాచారం మండలంలోని నాలుగు గ్రామాల రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెడుతోంది. ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 600 మంది రైతుల నుంచి 2200 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీచేసింది. అంగీకరించని కొందరు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తీర్పు ప్రకటించేలోపు 2021లో ఆ భూములకు సంబంధించి రైతుల పేర్లను తొలగించి, తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీజీఐఐసీ) పేరును ధరణి పోర్టల్‌లో రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. హైకోర్టు తీర్పు ప్రకారం ధరణిలో తమ పేర్లపైకి మార్చాలంటూ రైతులు నాలుగేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నా స్పందన కొరవడింది.

నోటిఫికేషన్‌తో భూమిపై హక్కు.. ఈ నాలుగు గ్రామాల రైతులు తమకు వ్యవసాయమే ఆధారమంటూ భూము లు ఇవ్వకపోయినా... ప్రభుత్వం మాత్రం నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా.. ధరణి పోర్టల్ ద్వారా వారి భూములపై హక్కు తీసుకుంది. పరిహారం వద్దని, మా భూములు మాకు కావాలంటూ ఆందోళన చేయడంతో... మీరు పంటలు పండించుకోమంటూ అధికారులు సూచించారు.

**రైతు భరోసా రాలేదు...**

బ్యాంకులు రుణాలివ్వడం లేదు..

ధరణి పోర్టల్‌లో రైతులు పేర్లు లేకపోవడంతో నాలుగేళ్ల నుంచి రైతుబంధు రాలేదు. తాజాగా రైతు భరోసా ఇవ్వలేదు. 12 మంది రైతులు చనిపోగా వారి కుటుంబాలకు అందాల్సిన రూ.5 లక్షల చొప్పున రైతు బీమా సాయం అందలేదు. రూ.2 లక్షల రుణమాఫీపై స్పష్టత కరవై 200 మంది రైతులు గందరగోళంలో ఉన్నారు. ఒక్కో రైతు రూ.30వేల దాకా పంట రుణం బ్యాంకు ద్వారా పొందేవారు. ఇప్పుడా రుణ పరిమితిని రూ.50 వేలకు పెంచారు. నాలుగేళ్లుగా బ్యాంకులు వీరికి పంట రుణం ఇవ్వడం మానేశాయి. భూములపై హక్కులు లేకపోవడంతో..పిల్లలకు పెళ్లిళ్లు చేసేందుకు విక్రయిద్దామనుకుంటే ఎవరూ కొనడం లేదు.

# పనులు అర్ధంతరం.. ప్రయాణం నరకం



సిరిసిల్ల :నగరంలోని కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ అనుసంధాన రహదారిపై ప్రయాణం వాహనదారులకు సర్కస్ ఫీట్లను తలపిస్తోంది. ఏడాదిన్నర కిందట రోడ్డు నిర్మాణానికి తవ్వగా ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదు. అరకొర పనులు, అడుగడుగునా గుంతలతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాకేంద్రంలోని 60 డివిజన్‌లలో ముఖ్యమంత్రి హామీ (సీఎంఏ) నిధులతో రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణాలకు భారాస ప్రభుత్వ హయాంలో రూ.132.94 కోట్లు కేటాయించారు. అన్ని డివిజన్‌లలో సగం మేర పనులు పూర్తి చేయగా, చాలా చోట్ల అసంపూర్తిగా వదిలేశారు. కోతిరాంపూర్–కట్టరాంపూర్ మార్గం ఎప్పుడూ రద్దీగా ఉండగా పనులు అర్ధంతరంగా వదిలేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారితో పాటు స్థానికులకు నరక యాతన తప్పడం లేదు.

**లీకేజీలతో తాగునీరు కలుషితం**

కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్‌కు దూరం రెండు కిలోమీటర్లు ఉండగా అందులో కిలోమీటర్ మేర సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించారు. అక్కడి వరకే తాగునీటి పైపులైను పనులు చేశారు. మిగతా కిలోమీటరు దూరం ఏ పనులూ చేయలేదు. ఈ ప్రాంతంలో గతంలో వేసిన తాగునీటి పైపులు శిథిలమయ్యాయి. రోడ్డుపై గుంతలతో ఎక్కడ పడితే అక్కడ లీకేజీలవుతున్నాయి. శుద్ధ జలం పైపుల్లో మురుగు కలిసి నీరంతా కలుషితమై వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అవస్థలు పట్టించుకోండి సారూ!**

అసంపూర్తిగా ఉన్న రోడ్లపై వాహనాల రాకపోకలతో దారి పొడవునా అధ్వానంగా మారుతోంది. తరచూ ద్విచక్రవాహనదారులు అదుపు తప్పుతున్నాయి. మరమ్మతు పనులకు అదిగో, ఇదిగో అంటూ నెలల తరబడి సాగదీస్తున్నారు. తమ అవస్థలను పట్టించుకొనే లేరని స్థానికులు వాపోతున్నారు. గుత్తేదారుకు నిధులు మంజూరు చేయకుంటే పనులు అలాగే వదిలేస్తారా! అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

రహదారి : కట్టరాంపూర్– కోతిరాంపూర్

దూరం : కిలోమీటర్

కేటాయించిన వ్యయం : రూ.1.33 కోట్లు

చేయాల్సిన పనులు : రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్

# మట్టి తవ్వకం.. ఇష్టారాజ్యం



సిరిసిల్ల : జిల్లాలో ప్రభుత్వ పరంగా చేపడుతున్న మట్టి పనులు లేవు. మట్టి తవ్వకాలకు గనులశాఖ అనుమతులూ లేవు. అయినా అక్రమార్కులు తవ్వకాలు ఆపడంలేదు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల రాయల్టీకి గండి పడుతోంది. అక్రమంగా తవ్విన మట్టిని రియల్ వెంచర్లకు, ఇళ్లకు ఇతరత్రా అవసరాలకు తరలిస్తున్నారు. జిల్లాలో ఇటీవల కొత్తగా ఇసుక క్వారీలను గుర్తించారు. మట్టి తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తిస్తే ప్రభుత్వానికి ఆదాయం కలిసి వస్తుంది. అక్రమార్కులకు అడ్డుకట్ట పడనుంది. జిల్లాలో వేములవాడ గ్రామీణ మండలం అగ్రహారం, కోనరావుపేట మండలం కొలనూరు, చందుర్తి మండలం మల్యాల, రామన్నపేట. రుద్రంగి, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్. వీర్నపల్లి మండలం గర్జనపల్లి, వన్‌పల్లి గ్రామాల్లో ఎక్కువగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ, అటవీ భూములు కలిసి ఉండటంతో రెండు శాఖల అధికారులు ఎవరికివారు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక సెలవు రోజుల్లో అక్రమార్కులు పెద్దఎత్తున తవ్వకాలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ, ప్రైవేటు భూములు పక్కపక్కనే ఉండటంతో వ్యవసాయ సీజన్‌కు ముందు అదను చూసి తవ్వకాలు జరుపుతున్నారు. రెవెన్యూ శాఖలో గ్రామస్థాయిలో సిబ్బంది లేరు. ఒక వేళ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదులు చేసినా.. ఆర్ఐ ఇతర సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లే సరికి అక్రమార్కులు తప్పించుకుంటున్నారు. చందుర్తి మండలం మల్యాల శివారులో మల్లెగుట్ట ప్రాంతంలో అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి రెవెన్యూ అధికారులు, పోలీసులతో వెళ్లే సరికి తవ్వకాలు జరుపుతున్నవారు రెండు ట్రాక్టర్లను అక్కడే వదిలేసి వెళ్లారు. గనులశాఖలో ఇద్దరు ఆర్ఐలు మాత్రమే ఉన్నారు. రెవెన్యూ, గనులశాఖలో సిబ్బందిలేమి అక్రమార్కులకు వరంగా మారింది.

ప్రభుత్వ, ప్రైవేటు భూమిలో మట్టి తవ్వకాలకు ఆన్‌లైన్‌లో అనుమతులకు గనులశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రణాళికలు చేసింది. దీనికోసం విధివిధానాలను కూడా సిద్ధం చేసింది. దీనిలో టన్నుకు రూ.20లుగా ధరను నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రధానమైన రెవెన్యూ, గనులశాఖలో సిబ్బందిలేక ప్రతిపాదనల స్థాయిలోనే నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోంది. చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో మట్టిని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది 30 క్యూబిక్ మీటర్లకు రూ.10,926లు జరిమానా విధించారు. జరిమానాలు విధిస్తున్నాం

జిల్లాలో అక్రమంగా మట్టితవ్వకాలు జరుపుతున్న ప్రాంతాలపై నిఘా ఉంచాం. ఇటీవల పలు మండలాల్లో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న వారిని పట్టుకుని జరిమానా విధించాం. మట్టి తవ్వకాలను జరిపిన ప్రాంతాల్లో రెవెన్యూ, గనులశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నాం. క్రాంతి, గనులశాఖ సహాయ సంచాలకులు

# ప్రతికూల వాతావరణంతో తీవ్ర నష్టం

జగిత్యాల : వానాకాలంతో పోలిస్తే యాసంగి వరిసాగులో అనుకూల వాతావరణంతో పాటు చీడపీడల తీవ్రత, సాగులో సమస్యలు తక్కువగా ఉండి ధాన్యం దిగుబడులు అధికంగా వస్తాయి. కానీ ఈ యాసంగిలో మాత్రం ప్రతికూల వాతావరణం నెలకొనటంతో దిగుబడులమాట అటుంచి పైరు ఎదగటంలేదని రైతులు వాపోతున్నారు. నాటిన పైరు ఎరుపురంగు నుంచి ఆకుపచ్చగా మారి ఎదగడానికి యూరియాను అధికంగా వేసినచోట చీడపీడల తీవ్రత మరింతగా పెరిగింది. మరోవైపు దెబ్బతిన్న పంట కర్రలను తీసుకెళ్లి దుకాణాదారునికి చూపిస్తే పురుగు, తెగుళ్ల మందుతో పాటు పోషకాన్ని కూడా కలిపి పిచికారీ చేయాలని రైతులకు అంటగడుతున్నారు. ఈ మూడింటితోనూ వరిపైరు పచ్చబడకుంటే మందులను మార్చి ఇచ్చి మరోసారి పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. ఇదే తరుణంలో పలుచోట గ్రామాల్లో గంట గుళికలు, బయో ఉత్పత్తుల పేరిట అమ్మకాలు కూడా జోరుగా సాగి రైతులను పూర్తిగా ఆయోమయానికి,



ఆర్థిక నష్టానికి గురిచేస్తున్నాయి. నాటినపైరు కుదురుకొని పిలకలు వేయాల్సిన సమయమంతా కర్రలు నిలదొక్కుకునేందుకునే గడిచిపోయి పిలకలు రాక దిగుబడులు తగ్గనుండగా సస్యరక్షణ ఖర్చు నాలుగింతలు పెరిగిందని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో పల్లెల్లో జీరో ఉత్పాదకాల విక్రయాలను అరికట్టి వాడాల్సిన మందులను రైతులకు తెలిపేలా అధికారులు, శాస్త్రవేత్తలు రైతుల క్షేత్రాలను సందర్శించాల్సి ఉంది. కరీంనగర్ జిల్లాలో 2.33 లక్షల ఎకరాల్లో, పెద్దపల్లి 1.96, జగిత్యాల 2.53, సిరిసిల్ల జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. నవంబరు నుంచే వరినార్లు పోసి నాట్లువేయటం ప్రారంభించగా ఈ నెల మొదటివారం వరకు కూడా వరినాట్లు కొనసాగాయి. ఈ సీజన్‌లో చలి, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతంలో హెచ్చుతగ్గులు, పొడివాతావరణం నెలకొనటం తదితర ప్రతికూల వాతావరణం నెలకొంది. దీంతో వరిపైరుపై జింకు తదితర పోషక లోపాలు తలెత్తగా ఉల్లికోడు, మొగిపురుగు అత్యంత తీవ్రంగా ఆశించాయి. అగ్గితెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్లవంటివి పైరును నష్టపరుస్తుండగా నీరు నిలిచినచోట సల్ఫైడ్ ఇంజూరీ సమస్య కూడా తలెత్తింది.

# కొలతలు తీసేదెలా.. రికార్డు చేసేదెట్లా?

జగిత్యాల : కూలీల వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో సిబ్బంది నియామకం లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకంలో పలు అభివృద్ధి పనులు చేపడుతుండడంతో ఇబ్బందిగా మారింది. ఉమ్మడి జిల్లాలో 5.08 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా 9.48 కూలీలు ఉన్నారు. ఇందులో 3.27 లక్షల కుటుంబాలు యాక్టివ్ ఉండగా ఆయా కుటుంబాల్లో 4.94 లక్షల మంది పనులకు వెళుతున్నారు. వీరందరికీ పనులు కల్పించడం, పర్యవేక్షించేందుకు సిబ్బంది ఖాళీలతో ఇబ్బందులు తప్పడం లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 మంది అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి(ఏపీవో), 45 మంది సాంకేతిక సలహాదారుల(ఈసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీల భర్తీ లేకపోవడంతో ఉన్న సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. సాంకేతిక సహాయకులకు అయిదారు గ్రామాలకు పైగా క్షేత్ర స్థాయిలో పనుల పర్యవేక్షణ ఉండగా అదనంగా ఏపీవో, ఈసీల పనులు చూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. సాంకేతిక సహాయకులు కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఉన్న వారికే గ్రామాల అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

**కొత్త పంచాయతీలకు క్షేత్ర సహాయకులేరి?**

పనుల పర్యవేక్షణకు ప్రతి ఆరు గ్రామాలకు ఒక సాంకేతిక సహాయకులను నియమించాల్సి ఉండగా ప్రస్తుతం 12 నుంచి 16 పంచాయతీలను చూసుకోవాల్సి వస్తోంది. జగిత్యాల జిల్లాలో 68 మంది ఉండాల్సి ఉండగా కేవలం 38 పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే



పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతో నూతనంగా ఏర్పాటైన గ్రామాలకు క్షేత్ర సహాయకుల నియామకాలు చేపట్టకపోవడమే కాకుండా పాత పంచాయతీల్లోనే పూర్తి స్థాయిలో లేరు. జగిత్యాల జిల్లాలో 380 పంచాయతీలకు ప్రస్తుతం 215 మంది మాత్రమే క్షేత్ర సహాయకులు కొనసాగుతున్నారు.

పని ఒత్తిడి పెరిగింది : మహేష్, సాంకేతిక సహాయకుల సంఘం జిల్లా నాయకులు

ఒక్కో గ్రామంలో వంద మంది పనులకు వెళుతుండగా పర్యవేక్షణతో పాటు కొలతల బాధ్యతలు అప్పగించడంతో పని ఒత్తిడి పెరిగి ఇబ్బందిగా మారింది. 2013 నుంచి పోస్టుల భర్తీ లేకపోవడం, ఈసీల బాధ్యతలు అప్పగించడంతో ఎంబీ రికార్డులు చేయాల్సి వస్తోంది. దీనివల్ల సామాజిక తనిఖీల్లో నిధుల అవకతవకలు జరిగినట్లు చూపుతున్నారు. ప్రస్తుతం చేస్తున్న పనితోపాటు అదనపు బాధ్యతలు అప్పగించడంతో సమస్య ఏర్పడుతోంది.

# దళారులకే పంట!

శ్రీకాళహస్తి : వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులను దళారుల బారిన పడేలా చేసింది. వరినాట్లు వేసిన సమయం నుంచి నెల రోజుల వ్యవధి వరకు విధిగా ఈ-క్రాప్ నమోదు చేయాలి. అధికారులు నామమాత్రంగా నమోదు చేసి చేతులు దులుపుకోవడంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టినా ఈ-క్రాప్‌లో నమోదు కాని రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

అన్నదాతల పరిస్థితిని అలుసుగా తీసుకుంటున్న వ్యాపారులు, మిల్లర్లు సిండికేట్‌గా మారి ప్రభుత్వ మద్దతు ధరతో సంబంధం లేకుండా తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. తేమ పేరుతో బస్తాకు ఏకంగా ఐదు కిలోల చొప్పున అధికంగా ధాన్యం సేకరిస్తూ రైతులను మోసగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో రైతులు బస్తాకు రూ.200 వరకు నష్టపోతున్నారు. పెట్టుబడులకు చేసిన అప్పులకు వడ్డీలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మద్దతు ధర కల్పించేలా చర్యలు- రమేష్‌రెడ్డి, ఏడీఏ, శ్రీకాళహస్తి
ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటాం. సులభతరంగా ధాన్యం అమ్ముకోవడంతో పాటు సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చూస్తాం. దళారులు, మిల్లర్లు సిండికేట్‌గా వ్యవహరిస్తూ రైతులను మోసం చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

రోజుకో ధరతో అవస్థలు- సుబ్రహ్మణ్యంనాయుడు, రైతు దళారులు రోజుకో ధర చెబుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారు. రెండేళ్లకు ముందు 80 కిలోల బస్తా ధర రూ.2200 వరకు ఉండగా.. మూడు రోజులకు ముందు రూ.1830.. ప్రస్తుతం రూ.1750కి అడుగుతున్నారు. ఈ ఏడాది నష్టాలు చవిచూడాల్సి వచ్చింది.

# అలివిగాని అక్రమాలు

నందికొట్కూరు : కృష్ణానదిలో నిషేధిత అలివి వలలతో బహిరంగంగా చేపల వేట సాగుతున్నా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దళారులు కోస్తా ప్రాంతం నుంచి వందలాది మంది జాలర్లను పిలిపించుకున్నారు. వారు నది ఒడ్డునే గుడారాలు వేసుకుని తిష్టవేశారు. రేయింబవళ్లు వేట సాగిస్తున్నారు. చేప పిల్లల్నీ పట్టి ఒడ్డున ఆరబెడుతున్నారు. వాటిని ఎండు చేపలుగా మార్చి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. దీనివల్ల నదిలో మత్స్య సంపద తరిగిపోయి తాము జీవనోపాధి కోల్పోవాల్సి వస్తోందని స్థానిక మత్స్యకారులకు వాపోతున్నారు.

**అందరికీ మామూళ్లు**

ప్రస్తుతం నదిలో నీటిమట్టం తగ్గడంతో చేపల వేటకు అనుకూలంగా మారింది. ఇదే అదనుగా దళారులు వైజాగ్, ఇతర కోస్తా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జాలర్లను రప్పించారు.

నందికొట్కూరు మండలం శాతనకోట, జంగంపాడు, పగిడ్యాల మండలం నెహ్రూనగర్, కొత్తపల్లి మండలం సంగమేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాల సమీపాన కృష్ణానది ఒడ్డున ఇతర ప్రాంతాల జాలర్లు సుమారు 50 గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరు రేయింబవళ్లు వేట సాగిస్తున్నారు.

దళారులు జాలర్లకు నెలకు రూ.10 వేలు చెల్లించడంతో పాటు నెలకు సరిపడా సరకులు ఇస్తూ చేపలు పట్టిస్తున్నారు. దీంతో స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది.

రోజూ రూ.లక్షలు దండుకుంటున్న దళారులు మత్స్యశాఖ, పోలీస్,



రెవెన్యూ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు మామూళ్లు ఇస్తున్నారు. దీంతో పట్టపగలే బహిరంగంగా వేట సాగిస్తున్నా ఒక్కరూ అడ్డు చెప్పడం లేదన్న ఆరోపణలున్నాయి.

**నిత్యం రూ.లక్షల్లో ఆదాయం**ప్రస్తుతం నదిలో అలివి వలలకు చిరు చేపల నుంచి 4 కిలోల పరిమాణంలోని మీనాలు పడుతున్నాయి. పెద్ద చేపల్ని కిలో రూ.160తో విక్రయిస్తున్నారు. చిన్న చేపలను ఒడ్డునే ఆరబెడుతున్నారు. ఎండిన తర్వాత కిలో రూ.120తో విక్రయిస్తున్నారు. నిత్యం మూడు మండలాల పరిధిలో 1500 కిలోలకు పైగా చేపలు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎండు చేపలు పెద్దఎత్తున విక్రయిస్తున్నారు. ఏటా డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు దళారులు వేట సాగిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు.

# నీటిశుద్ధికి తుప్పు



డోన్ : ఎస్సీ వసతి గృహ విద్యార్థులకు మంచినీరు కరవైంది. నీటి శుద్ధి యంత్రాలకు మరమ్మతులకు గురికావడంతో 'బోరు' నీటినే తాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ బాలుర, బాలికల ప్రీ-మెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతిగృహాల విద్యార్థులకు శుద్ధి చేసిన నీరు ఇవ్వాలని 2019లో తెదేపా ప్రభుత్వం నిర్ణయించింది. డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్ (డీఎంఎఫ్) నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 74 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఆర్వోప్లాంట్లను ఏర్పాటు చేసే బాధ్యతను నాలుగు ఏజెన్సీలకు అప్పగించారు. ఒక్కో శుద్ధజలం ప్లాంటుకు రూ.1.46 లక్షల చొప్పున రూ.1.08 కోట్లు వెచ్చించారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో ఏడాది తర్వాత మూలకు చేరాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కొన్ని చోట్ల సంక్షేమాధికారులే సొంత నిధులు వెచ్చించి బాగు చేయించారు. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి బాగు చేయించాలని భావిభారతం విన్నవిస్తోంది. " త్వరలోనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తామని" జిల్లా అధికారిణి చింతామణి పేర్కొన్నారు.

# ఏదీ బకాయి వేతనం.. ఎన్నాళ్లీ దుర్భర జీవనం?



అనంతపురం : ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న వేతనదారులకు (కూలీలకు) ఇబ్బందులు తప్పటంలేదు. జనవరి 13 నుంచి చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు రూ.48 కోట్లు వేతన బకాయిలు చెల్లింపులు నిలిచిపోవటంతో కష్టాలు ఎక్కువయ్యాయి. ఎండలో పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవటంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. అనంతపురం జిల్లాలో 31 మండలాల పరిధిలో రోజువారీ 42 వేల మంది పనులు చేస్తున్నారు. వేసవి కావటంతో వ్యవసాయ పనులు లేక ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులపైనే ఆధారపడుతున్నారు. ఒక్కో కూలీకి వారు చేస్తున్న పనిని బట్టి సగటున రూ.263 మొత్తం రోజు కూలి చెల్లించాల్సి ఉంది. కరవు మండలాల్లో జాబ్‌కార్డులో ఉన్నవారికి 100 రోజుల పనిదినాలను 150 రోజులకు పెంచి ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది.

2018 సంవత్సరం వరకూ వేసవి కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం కూలీలకు పని ప్రదేశంలో తాత్కాలికంగా పరదా నీడ, తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి సౌకర్యాలు కల్పించి.. వారికి పనిముట్లను కల్పించింది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టార్పాలిన్ పట్టలు మాత్రమే ఇచ్చి మిగిలినవన్నీ నిలిపివేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మునుపటి సౌకర్యాలు కల్పిస్తుందని కూలీలు ఎదురుచూస్తున్నారు.

ఆదేశాలు వచ్చాయి... : సలీంబాషా, పీడీ, డ్వామా
కూలీలు పనిచేసే ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు వచ్చాయి. పంచాయితీ అధికారుల సహకారంతో తాగునీరు, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచుతాం. గతంలో ఇచ్చిన టార్పాలిన్ పట్టలు ఎక్కడున్నాయనే వివరాలు తెలుసుకుంటున్నాం. అందుబాటులో ఉన్న వాటిని పని ప్రదేశాల్లోకి తీసుకొస్తాం. అవి లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం. బకాయి వేతనాలు త్వరలోనే విడుదలవుతాయి.

అనంతపురం జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు: 3.13 లక్షలు
రోజువారీ పనులకు వస్తున్న కూలీలు: 42వేలు
వేతన బకాయిల మొత్తం : సుమారు రూ.48కోట్లు

# నిర్లక్ష్యమే శాపమై.. నిలువెల్లా కూపమై..



పాడేరు : నదులు నాగరికతను నేర్పాయి.. పాడి పంటలకు ఆధారంగా నిలిచాయి.. అభివృద్ధి అవకాశాలను చూపాయి. ఇంతటి ప్రాధాన్యతున్న నదులు నేడు మానవ నిర్లక్ష్యంతో వాటి సహజ స్వరూపం కోల్పోతున్నాయి. వాటి ప్రాముఖ్యం తెలియజేసేలా ఏటా మార్చి 14న అంతర్జాతీయ నదీ పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ప్రధాన నదుల పరిస్థితిని పరిశీలించగా చాలావరకు వాటి రూపురేఖలు మారిపోయాయి. నదుల్లోకి భారీగా వ్యర్థాలు, కలుషిత జలాలు వచ్చి చేరడంతో నీరు గరళమవుతోంది. ఇసుక తవ్వకాలు, ఆక్రమణలు పెరిగి వరదల వేళ పరిసర గ్రామాలను ముంచెత్తుతున్నాయి. జీవనాధారమైన నదీమతల్లులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

అనకాపల్లి జిల్లాలో శారదా, వరాహ, పెద్దేరు, తాండవ, సర్పా నదులు, అల్లూరి జిల్లాలో గోస్తనీ, సీలేరు నదులున్నాయి. ఇవి లక్షల మంది తాగునీటి అవసరాలను తీర్చుతున్నాయి. లక్షల ఎకరాల్లో పంటలకు సాగునీటికి ఆధారంగా ఉన్నాయి. కొంతమంది స్వార్థానికి ఈ నదులు జీవం కోల్పోతున్నాయి. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు సాగించడం, నదులకు ఇరువైపులా ఆక్రమించి పంటలు సాగుచేయడంతో నీటి చుక్క నిలవడానికి అవకాశం లేకుండాపోతోంది. ఫలితంగా తాగునీటి, సాగునీటికి ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. మన అభివృద్ధిలో నదుల పాత్రను అందరికీ తెలియజేసి వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వంతో పాటు ప్రజలు సామాజిక బాధ్యతగా తీసుకుని నదులకు రక్షణగా నిలవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

**పరిరక్షణ మన చేతుల్లోనే..**

అయిదేళ్ల క్రితం సోమదేవుపల్లిలో అమ్మవారి ఆలయం జనం చూస్తుండగానే నదిలో ఒరిగిపోయింది. అక్కడ వరదకట్ట నిర్మాణానికి రూ.10 కోట్లు, మూలపాలెం గ్రోయిన్ ఆనకట్టగా మార్చేందుకు రూ.37 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

వరాహ, సర్పా, శారదా, గోస్తనీ నదుల్లో ఆనకట్టలు, గ్రోయిన్లు అన్నీ పాడయ్యాయి. వీటికితోడు ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా గోతులు ప్రాణాంతకంగా ఏర్పడుతున్నాయి. దీంతోపాటు నదుల ప్రవాహ దిశ మారే పరిస్థితులున్నాయి.

తాండవ నదిపై నిమ్మ, ముఠా, భూమి ఆనకట్టలను పటిష్ఠపర్చాల్సి ఉంది. వరదలప్పుడు పాయకరావుపేటలో తాండవ నది ఒడ్డున ఉన్నవారు ముంపు భయాన్ని ఎదుర్కొంటున్నారు. గట్టు పటిష్ఠపరిచి ఉద్యానాలను ఏర్పాటు చేయొచ్చు. నర్సీపట్నంలో వరాహ నది ఉత్తరవాహినికి సమీపానే డంపింగ్‌యార్డు ఉంది. దీన్నుంచి కాలుష్యం నదిలో చేరుతోంది. ఈ తీరంలోనే స్నానఘట్టాలున్నా మహాశివరాత్రి, కార్తికమాసాల్లోనే నిర్వహణ పనులు చేపడుతున్నారు. మిగతా కాలాల్లో ఇక్కడంతా వ్యర్థాలే కనిపిస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమాలను చేపడుతోంది. అలాంటి రోజుల్లో నదుల్లో కాలుష్యంపైనా దృష్టిసారించాలి. వ్యర్థాలు నదుల్లో కలపకుండా సంపద కేంద్రాలకు చేరేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ఇసుక తవ్వకాల్లో వాల్టా చట్టం పక్కగా అమలు అయ్యేలా చూస్తే నదులకు కొంతవరకు మేలు చేసినట్లే అవుతుంది.

# కారుణ్యం చూపండి




కర్నూలు : ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు పలువురు ఎదురుచూస్తున్నారు. వైకాపా హయాంలో వాటి జాడ లేకపోవడంతో కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొన్నారు. ఉద్యోగాలభర్తీకి ఎన్నోసార్లు ఆందోళన చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అవసరమైన పత్రాలను పరిశీలించిన అధికారులు చర్యలేమీ తీసుకోకపోవడంతో స్పందించాలని కోరుతున్నారు. వయస్సు మీద పడుతుండటంతో ఉద్యోగం వస్తుందో...రాదోననే బెంగ ఎక్కువవుతోందని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కుటుంబాలను పోషించాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

**కూటమి రావడంతో...**కూటమి ప్రభుత్వం రావడంతో కారుణ్య నియామకాలపై కదలిక వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 23 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ముగ్గురు అభ్యర్థులు ఆరోగ్యపరంగా అర్హత సాధించకపోవడంతో తిరస్కరించారు. వేరే డిపార్ట్‌మెంట్ కావాలని కోరిన వారి దరఖాస్తులు కలెక్టరేట్‌కు చేరాయి. కనీస విద్యార్హత లేకపోవడంతో మరో ముగ్గురికి అవకాశం ఇవ్వలేదు. కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉంచారు. వారి దరఖాస్తులు పరిశీలించిన కమిటీ కర్నూలు జిల్లాలో 6, నంద్యాల జిల్లాలో అయిదుగురికి ఆర్టీసీలో ఉద్యోగావకాశాన్ని కల్పించారు.

**ప్రభుత్వ నిర్ణయంతో ఇంకొందరికి..**

ఆర్టీసీ ఉద్యోగులు జనవరి 1, 2020 నుంచి ప్రజా రవాణశాఖ ఉద్యోగులుగా సేవలు అందిస్తున్నారు. 2016 నుంచి 2019 డిసెంబరు వరకు చనిపోయిన వారి కుటుంబాలకు కారుణ్య నియామకాలకు ప్రభుత్వం అంగీకరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 డిసెంబర్ 31 ముందు వరకు కుటుంబాలకు వర్తించేలా ఉత్తర్వులు ఇచ్చారు. తాజా నిర్ణయంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మరో 50 మందికి ఉద్యోగాలు దక్కే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆయా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరలో జరుగుతుందని ఆర్టీసీ పరిపాలనాధికారులు వెల్లడించారు. వయసు మినహాయింపు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**ప్రభుత్వ నిర్ణయమే కీలకం -శ్రీనివాసులు(ప్రజారవాణాధికారి)**

ప్రభుత్వ నిర్ణయం మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 23 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. కేవలం 26 మంది అర్హత సాధించారు. ఆరోగ్యపరంగా కొందరు అనర్హులవ్వడంతో ముగ్గురికి ఉద్యోగం రాలేదు. ఉన్నత చదువులు చదివిన వారు వేరే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం కావాలని కోరడంతో వారి దరఖాస్తులను కలెక్టరేట్‌కు పంపించాం.

# మది కదలాలి.. నది మురవాలి

కర్నూలు : జలం ఉంటే జీవం బతుకుతుంది. నది ఉంటే నాగరికత అభివృద్ధి చెందుతుంది.. ఆరోగ్యకరమైన నదులు, పరిశుభ్రమైన నీటిని పొందడం మనందరి ప్రాథమిక హక్కు. సమస్త జీవుల మనుగడకు వేదికలైన నదులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి.. వాటిపై ఆధారపడి బతికే ప్రాణులకు ముప్పు పొంచి ఉంది. రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో నాలుగు నదులు ప్రవహిస్తున్నాయి. సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగు.. వందల గ్రామాలకు మంచినీరు అందించే నదీ జలం విషమిస్తోంది.. నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం సందర్భంగా ఈసారి "మన నదులు.. మన భవిష్యత్తు" థీమ్‌తో ముందుకెళ్తున్నారు.. దీనిని స్ఫూర్తిగా తీసుకొని నదుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**శుద్ధీకరణ పట్టని పురపాలికలు**

నదీ జలాల కాలుష్యాన్ని గుర్తించిన ఎన్‌జీటీ శేషశయనారెడ్డి కమిటీ కర్నూలు కార్పొరేషన్‌కు గతంలో రూ.5 కోట్ల జరిమానా విధించింది. కాలుష్య నియంత్రణ మండలి కర్నూలు కార్పొరేషన్‌కు 20కు పైగా తాఖీదులు జారీ చేసింది. అయినా పరిస్థితిలో మార్పులేదు.

నగరంలో దేవనగర్ హంద్రీ వంతెన సమీపంలో 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. పాత నగరం జమ్మిచెట్టు వద్ద ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మిస్తున్న శుద్ధి కేంద్రం పనులదీ ఇదే పరిస్థితి. నంద్యాల పట్టణ శివార్లలోని కర్నూలు బైపాస్ రోడ్డు సమీపంలో రూ.3 కోట్ల వ్యయంతో మూడు ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు మూడేళ్ల కిందట ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటి వరకు అడుగులు పడలేదు.

నది: హంద్రీ
జిల్లాలో ప్రవాహం (కి.మీ): 95
ఎక్కడి నుంచి ఎక్కడికి: దేవనకొండ-పత్తికొండ మధ్యలో పుట్టి కర్నూలు నగర శివారులోని జొహరాపురం వరకు.

**కుందూ నిండా గరళమే**

నంద్యాల పట్టణంలో నిత్యం విడుదలవుతున్న 30 ఎంఎల్‌డీ మురుగు నేరుగా కుందూలోకి వదిలేస్తున్నారు.

మురుగు నీటిలో కోలిఫాం 500 ఎంపీఎన్/100 మిల్లీలీటర్లు ఉండాలి. నంద్యాల పట్టణంలోని మురుగులో వెయ్యి వరకు ఉంది. ప్రమాణాల ప్రకారం లీటరు నీటిలో బయో కెమికల్ ఆక్సిజన్ (బీవోబీ) 30 ఎంజీ ఉండాలి. కుందూ నదిలో ఇది 40- 50 ఎంజీ వరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పాణ్యం, బనగానపల్లి, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లోని 40 గ్రామాలు కుందూ జలాలపై ఆధారపడ్డాయి. లక్ష జనాభాకు ఈ నది ద్వారానే మంచినీటి సరఫరా జరుగుతోంది.

నది: కుందూ
జిల్లాలో ప్రవాహం (కి.మీ): 97
ఎక్కడి నుంచి ఎక్కడికి: ఓర్వకల్లులో మొదలై కోవెలకుంట్ల వరకు ప్రవహిస్తుంది

**సీమ ప్రజల జీవనాధారం**

శ్రీశైలం జలాశయం ఆధారంగా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారు. రాయలసీమ ప్రాంతానికి ఇక్కడి నుంచే సాగునీరు వెళ్తోంది. కర్నూలు, కడప కాల్వ, శ్రీశైలం కుడిగట్టు కాల్వ, తెలుగు గంగ, హంద్రీనీవా కాల్వలకు శ్రీశైలం వెనుక జలాలు తరలిస్తారు.

శ్రీశైలం జలాశయానికి గతేడాది జులై 17 నుంచి వరద ప్రవాహం మొదలైంది.. కృష్ణా (జూరాల), తుంగభద్ర (సుంకేసుల), హంద్రీ నదుల నుంచి వరద పోటెత్తడంతో ఆరుసార్లు జలాశయం రేడియల్ క్రస్ట్ గేట్లు పైకెత్తారు.

నది: కృష్ణా
జిల్లాలో ప్రవాహం (కి.మీ): 98
ఎక్కడి నుంచి ఎక్కడికి: శాతనకోట వద్ద మొదలై శ్రీశైలం జలాశయం వరకు

**తుంగ కాలుష్య గంగ**

కర్నూలు నగరపాలక పరిధిలో రోజుకు సగటున 60 ఎంఎల్‌డీ మురుగునీరు విడుదల అవుతోంది. శుద్ధి చేయకుండా నేరుగా తుంగభద్రలోకి వదులుతున్నారు.

సాధారణంగా ఈ వ్యర్థాల్లో కోలి బ్యాక్టీరియా సగటున 600 సీఎఫ్‌యూ/100 ఎంఎల్ ఉండాలి. వివిధ ప్రాంతాల్లో 1100- 1200 దాటుతున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి గతంలో ప్రకటించింది. కోలి బ్యాక్టీరియా 50 దాటితే ఆ నీటిని శుద్ధిచేసి తాగాలి. లేకపోతే విరేచనాలు, టైఫాయిడ్, హెపటైటిస్ బారినపడే ప్రమాదం ఉంది.

తుంగభద్ర జలాలపై ఆధారపడి వివిధ చోట్ల సీపీడబ్ల్యూ పథకాలు నడుస్తున్నాయి. 193 గ్రామాల పరిధిలోని 5 లక్షల మందికిపైగా జనాభా తాగునీటి అవసరాలకు తుంగభద్ర జలాలే ఆధారం.

నది: తుంగభద్ర
జిల్లాలో ప్రవాహం (కి.మీ): 115
ఎక్కడి నుంచి ఎక్కడికి: కౌతాళం మండలం మేళిగనూరు వద్ద మొదలై సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది.

# లోటుపాట్ల దిద్దుబాటు

కర్నూలు: భానుడి దాటికి మార్చిలోనే 'మాడు'తోంది. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇళ్లల్లో ఏసీలు, ఫ్యాన్లు 24 గంటలు తిరగడంతో విద్యుత్తు మీటర్లు ఆగడం లేదు. ఏప్రిల్, మే వచ్చేసరికి వినియోగం తారస్థాయికి చేరుకుంటుంది. విద్యుత్తు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఉప కేంద్రాలపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. సాంకేతిక లోపాలు తలెత్తి సరఫరా నిలిచిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని అధిగమించేందుకు విద్యుత్తు శాఖ ముందస్తుగా చర్యలు చేపట్టింది. ప్రీమాన్‌సూన్ ఇన్‌స్పెక్షన్ (పీఎంఐ) కింద లోపాలు సరి చేస్తున్నారు.

గృహ, వాణిజ్యం, వ్యవసాయం, ప్రభుత్వ శాఖలు, కర్మాగారాలకు సంబంధించిన విద్యుత్తు వినియోగం జరుగుతోంది. ఏప్రిల్ నుంచి కోటాకు మించి సుమారు 15 ఎంయూ వరకు వినియోగం ఉండే అవకాశముంది. ఎండకాలంలో గాలులు బలంగా వీస్తాయి. సమీపంలో ఉండే చెట్ల కొమ్మల కారణంగా తరచూ విద్యుత్తు ట్రిప్ అవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పీఎంఐలో భాగంగా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లతోపాటు నియంత్రికల సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నారు.

విద్యుత్తు నియంత్రికలు, ఉప కేంద్రాల్లో ఉండే స్విచ్‌లను ఆన్ అండ్ ఆఫ్ చేసే సమయంలో స్పార్క్స్ వస్తుంటాయి. ఈ లోపాన్ని సరిచేసేందుకు గ్రీజ్ రాస్తున్నారు. వేసవిలో ఎండ తీవ్రత పెరిగేకొద్దీ విద్యుత్తు తీగలు మరింత వదులవుతాయి. పీఎంఐలో భాగంగా వదులుగా ఉన్న విద్యుత్తు తీగలు, వాలిపోయిన స్తంభాలు సరిచేస్తున్నారు. విద్యుత్తు స్తంభాలపై ఉండే పింగాణి భాగాలే ఇన్సులేటర్లు. షార్ట్‌సర్క్యూట్ కాకుండా ఇన్సులేటర్లు అడ్డుకుంటాయి. ఒక్కోసారి వాటిలో పగుళ్లు ఏర్పడతాయి. వేసవిలో విద్యుత్తు వినియోగం పెరిగినప్పుడు ఇన్సులేటర్లు పేలిపోయే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా తనిఖీలు చేస్తున్నారు.

చురకలు



# కన్నీరై'నది'

శ్రీకాళహస్తి : అక్రమార్కులు కబ్జా చేసి భారీ సౌధాలు నిర్మిస్తున్నారు. పరీవాహక ప్రాంతాల్లో ఇసుక దోచేస్తుండటంతో నదీమతల్లి కన్నీరు పెడుతోంది. నదులు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. పంటలను సస్యశ్యామలం చేయాల్సిన జలాలు జనావాసాలను ముంచెతుతున్నాయి. ఏటా మార్చి 14న నదుల పరిరక్షణ కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని నదులు సాగుకు ఉపయోగపడుతున్న తీరు, పెరుగుతున్న ఆక్రమణలు, ఇప్పటివరకు తలెత్తిన నష్టంపై కథనం.

**4 లక్షల ఎకరాలకు నీరు అందిస్తూ** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుశస్థలి, స్వర్ణముఖి, నీవా, కౌండిన్య, గార్గేయ, బాహుదా నదులు ప్రవహిస్తున్నాయి. సోమల, ఐరాల, గంగా ధరనెల్లూరు, చిత్తూరు, నగరి మండలాల్లో పెద్దగా ఇక్కట్లు తలెత్తడం లేదు. నదుల ద్వారా ఏటా సుమారు 4 లక్షల ఎకరాలు సాగవు తున్నాయి.

**కుశస్థలి కింద లక్ష ఎకరాలు**

జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గంలోని మండలాల్లో సుమారు 50



కిలోమీటర్లు కుశస్థలి నది ప్రవహిస్తుంది. ఈ నది కార్వేటినగరంలోని కృష్ణాపురం రిజర్వాయర్ వద్ద చిన్న కాలువగా మొదలై ఏపీ, తమిళనాడు ప్రాంతాల్లో ఏటా వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఏటా ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నదిపై 1972లో అప్పటి ఎమ్మెల్యే కిలారి గోపాలనాయుడు బుగ్గ ప్రాజెక్టు చేపట్టారు. దీని ద్వారా నగరి, నింద్ర విజయపురం, పిచ్చాటూరు మండలాల్లో సుమారు 40 చెరువులు ఏటా నింపుతున్నారు. దీని కింద లక్ష ఎకరాలు సాగవుతాయి. 1999లో కుడి, ఎడమ కాలువలు, చెక్‌డ్యామ్‌లు కట్టారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్ కొట్టుకుపోయింది. దాన్ని నిర్మిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. ఇసుక అక్రమార్కులకు నది వరంగా మారింది.

ఐరాల, పూతలపట్టులలో ప్రవహించే గార్గేయ నది కలవగుంటకు చేరుతుంది. అక్కడి నుంచి చిత్తూరుకు తాగునీరు అందిస్తున్నారు. ఈ నది సుమారు 20 కి.మీ ప్రవహిస్తుంది. ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

**కౌండిన్యపై 11 చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నా..**

పెద్దపంజాణి, పలమనేరు ప్రాంత రైతులకు వరప్రసాదినిగా ఉన్న కౌండిన్య ప్రాజెక్టు కింద సమృద్ధిగా వర్షాలు పడితే సుమారు 70 వేల ఎకరాలు సాగువుతుంది. గత ప్రభుత్వాల హయాంలో కౌండిన్య ప్రాజెక్టుపై 11 చెక్‌డ్యామ్‌లు నిర్మించి నీటిని నిలువరించారు. ఇసుక అక్రమార్కులు ధ్వంసం చేయడంతో వర్షపు నీరంతా తమిళనాడుకు వెళుతోంది. కల్వర్టులు బాగు చేయాలని కోరినా ప్రజాప్రతినిధుల చెవికెక్కడం లేదు. చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు చేపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఒకప్పుడు మంచి నీరు ప్రవహించే నీవా నదిలో ఇప్పుడు మురుగు పారుతోంది. చిత్తూరులోని తోటపాళ్యం, వీరభద్ర కాలనీ, రంగాచారి వీధి వెనుక భాగం, సంతపేట, రిక్షా కాలనీ, దొడ్డిపల్లి ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.

సోమల మండలంలోని గార్గేయ నది పరీవాహక ప్రాంతమంతా ఆక్రమణకు గురైంది. వర్షాకాలంలో ఇబ్బందులే. ఈ నదులపై చెక్‌డ్యాంలు నిర్మించడం ద్వారా నీటి నిల్వలు పెంచుకోవచ్చు.

# అంటకాగి అక్రమాలు

అనంతపురం : పేదలకు ఇళ్లు నిర్మించి వారికి అండగా నిలవాల్సిన కొందరు ఇంటి దొంగలుగా మారుతున్నారు. గత వైకాపా హయాంలో వైకాపా నేతలతో అంటకాగి సిమెంటు, స్టీలు, ఇసుకను నేతల సొంతానికి ఇవ్వడంతో పాటు అధికారులు అక్రమార్గంలో నడిచారు. ఇప్పటికే పలువురు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరిపై ఛార్జి మెమోలు ఇచ్చి విచారణ చేయిస్తున్నారు. ప్రధానంగా రాప్తాడు నియోజకవర్గంలోనే ఎక్కువగా అక్రమాలు సాగినట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చాయి. అయినా కొందరు గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల్లో మార్పు రాలేదు. తాజాగా రాయదుర్గంలో టన్నుల కొద్దీ ఉక్కు మాయం అయినట్లు వెలుగులోకి వచ్చింది. మళ్లీ గోదాములో ఉంచి దాన్ని తొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**15 టన్నులు..** జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను బట్టి గృహనిర్మాణ సంస్థ గోదాముల్లో స్టీలు ఉంచుతారు. రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి అక్కడే గోదాములో నిల్వ ఉంచారు. నిల్వ ఉన్న దానికి




ఇళ్ల నిర్మాణాలకు వినియోగానికి భారీగా వ్యత్యాసం ఉన్నట్లు అనుమానం రావడంతో ఆ శాఖకు చెందిన అధికారులు పరిశీలించి నిజమేనని తేల్చారు. అంతర్గతంగా మరో డివిజన్ స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించారు. సదరు అధికారితోపాటు స్థానికంగా సిబ్బందితో స్టీలు లెక్కగట్టారు. తక్కువగా ఉన్నట్లు తేలినా చర్యలకు వెనుకాడుతున్నారు. మొత్తంగా 15 టన్నులు మాయం అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే స్టీలు నాణ్యతను బట్టి టన్ను రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంది. ఈ లెక్కన రాయదుర్గంలోనే రూ.10 లక్షల విలువైన స్టీలు మాయం చేసి విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం.

# బాల్య వివాహాలు బంద్ అయ్యేదెలా?



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లాలో జరిగే ప్రతి వంద పెళ్లిళ్లల్లో.. 37 బాల్య వివాహాలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పేదరికం.. సంప్రదాయం, నిరక్షరాస్యత.. ఇలా కారణం ఏదైనా చదువుకునే వయసులో బాలికలపై మోయలేని భారాన్ని మోపుతున్నారు. బాలికకే కాదు.. పుట్టబోయే బిడ్డలకు ప్రాణాపాయమే. కుటుంబాలపై మరింత ఆర్థిక భారంతోపాటు మానసికంగా కుంగిపోవాల్సి వస్తోంది. మరోవైపు ఐసీడీఎస్ శాఖలు తూతూమంత్రంగా గణంకాలను నమోదు చేసి ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తున్నాయి. గడిచిన ఏడాదిలో ఇరు జిల్లాల్లో 282 బాల్యవివాహాలు జరిగినట్లు చూపుతున్నారు. 18 ఏళ్లలోపు గర్భం దాలుస్తున్న వారి వివరాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేశారు. టీనేజీ గర్భిణులు/తల్లులు 2,800 పైచిలుకు ఉండటం గమనార్హం. దీన్నిబట్టి బాల్యవివాహాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు అవగతం అవుతోంది.

**శాఖల సమన్వయంతో అడ్డుకట్ట**

బాల్యవివాహాల నిర్మూలన బాధ్యత ఐసీడీఎస్‌దేనన్న భావన ప్రభుత్వ శాఖల్లో నెలకొంది. విద్య, వైద్య–ఆరోగ్యం, మెప్మా, డీఆర్‌డీఏ–వెలుగు, కార్మిక, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, మున్సిపాలిటీ, సంక్షేమ.. ఇలా పలు శాఖల అధికారుల సమన్వయంతో పక్కా ప్రణాళికతో ముందుకెళితేనే నిర్మూలన సాధ్యం.

జిల్లా స్థాయి నిర్మూలన కమిటీలో 30 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 23 మంది ప్రభుత్వ శాఖల నుంచి తక్కిన వారందరూ ఎన్జీఓలు. ప్రతి నెలా సమీక్షలు నిర్వహించడం తప్ప..నిర్మాణాత్మక చర్యలు శూన్యం. గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లోనూ కమిటీలు ఉన్నా నిష్ప్రయోజనంగా మారాయి.

**ఎక్కువగా ఎక్కడెక్కడంటే..**

అనంత జిల్లా పరిధి: కళ్యాణదుర్గం, రాయదుర్గం, శింగనమల, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాలు

శ్రీసత్యసాయి జిల్లా: కదిరి, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాలు

**విస్తృతంగా అవగాహన**– నాగమణి, పీడీ, ఐసీడీఎస్

బాల్య వివాహాల నిర్మూలన నిరంతర కార్యక్రమం. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. గతంతో పోల్చితే ఇప్పుడు బాల్యవివాహాలు తగ్గాయి. మరింత విస్తృతంగా అవగాహన శిబిరాలను నిర్వహిస్తాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్నాం.

# నది..ఆక్రమణలకు అడ్డేదీ?



అనంతపురం: ఉమ్మడి అనంత జిల్లా ప్రజలు తాగు, సాగు నీటికి నదీజలాలపైనే ఆధారపడుతున్నారు. పెన్నాపై ఎగువ పెన్నా, పీఏబీఆర్, కుముద్వతి, మిడ్‌పెన్నార్, చాగల్లు.. చిత్రావతిపై బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, వేదవతిపై బైరవానితిప్ప ప్రాజెక్టులు నిర్మించి తాగు, సాగు నీరు అందిస్తున్నారు. కృష్ణా, తుంగభద్రను ఆధారం చేసుకుని హంద్రీనీవా, హెచ్చెల్సీ పథకాలను రూపొందించి లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నదులకు ముప్పు వాటిల్లుతోంది. నేడు నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**కబ్జా కోరల్లో పెన్నా..**

ఉమ్మడి జిల్లా పరిధిలో ఎన్ని కిలోమీటర్లు: 275

వరద ప్రభావిత ప్రాంతాలు: హిందూపురం, పామిడి, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాలు

నంది హిల్స్‌లో పుట్టి హిందూపురం మండలంలో ప్రవేశిస్తుంది. పరిగి, రొద్దం, రామగిరి, కంబదూరు, బెళుగుప్ప, కూడేరు, శింగనమల, గార్లదిన్నె, పామిడి, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాల మీదుగా కడప జిల్లాలోకి వెళుతుంది. 500 మీటర్ల వెడల్పు ఉండాల్సిన పెన్నా 100 మీటర్లకు కుదించుకుపోయింది.

2022 నుంచి వరదలు పోటెత్తుతున్నాయి. ఏటా 3 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతున్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. పునరుజ్జీవం కోసం సబ్ సర్‌ప్లస్ డ్యాంలు నిర్మించాలని.. ఇందుకు రూ.100 కోట్లు అవసరమని అంచనా వేశారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు.

**చిత్రావతిలో నిర్మాణాలు** ఉమ్మడి జిల్లా పరిధిలో ఎన్ని కిలోమీటర్లు: 166

వరద ప్రభావిత ప్రాంతాలు: గోరంట్ల, పుట్టపర్తి

కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్‌లో పుట్టి చిలమత్తూరు, గోరంట్ల, బుక్కపట్నం, పుట్టపర్తి, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, యల్లనూరు మండలాల మీదుగా కడప జిల్లాలోకి ప్రవేశిస్తుంది.

2021, నవంబరులో వరదలు పుట్టపర్తి పట్టణాన్ని ముంచెత్తడంతో ఆస్తి నష్టం వాటిల్లింది. అప్పట్లో అక్రమనిర్మాణాలు గుర్తించినా తొలగించలేదు.

పుట్టపర్తిలో మురుగును శుద్ధి చేయకుండానే చిత్రావతిలోకి విడుదల చేస్తుండటంతో కలుషితమవుతోంది. సీసం వంటి హానికర మూలకాలు ఉన్నట్లు గుర్తించారు.

వేదవతి–హగరిలో ఇసుక దోపిడీ

ఉమ్మడి జిల్లా పరిధిలో ఎన్ని కిలోమీటర్లు: 100(చిన్న హగరితో కలిపి)

వరద ప్రభావిత ప్రాంతాలు: బొమ్మనహాళ్, రాయదుర్గం మండలాలు

కర్ణాటకలో పుట్టి గుమ్మఘట్ట మండలం బైరవానితిప్ప వద్ద ప్రవేశిస్తుంది. బొమ్మనహాళ్ మండలం సింగనహళ్లిలోని సంగమేశ్వరం వద్ద చిన్నహగరి నది కలుస్తుంది.

నదిలో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేసి రూపు కోల్పోయేలా చేస్తున్నారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాల్, రాయదుర్గం మండలం జుంజురాంపల్లి, గుండ్లపల్లిలో నదిని ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల ఆర్డీటీ సంస్థ సబ్ సర్‌ప్లస్ డ్యాంలు నిర్మించినా ఆక్రమణల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి.

పండమేరు.. కర్ణాటకలో పుట్టే పండమేరు నది రామగిరి మండలం నసనకోటలో శ్రీసత్యసాయి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. కనగానపల్లి, రాప్తాడు మీదుగా అనంతపురం చెరువులో కలుస్తుంది. 73 కిలోమీటర్ల ఉన్న నది అనంతపురం పరిధిలో కబ్జాకు గురైంది. గతేడాది వరదలకు పలు కాలనీలు జలదిగ్బంధం అయ్యాయి.

# రిజిస్ట్రేషన్ శాఖకు దొరకని అద్దె భవనం




అనంతపురం : ప్రభుత్వానికి పైసా ఆదాయం ఇవ్వని శాఖలకు సొంత భవనాలు ఆధునిక హంగులతో ఉన్నాయి. ఆదాయం సమకూర్చే ఈ శాఖకు సొంత భవనాలు లేకపోవడం విడ్డూరంగా ఉంది. జిల్లా రిజిస్ట్రేషన్, అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నడుస్తున్న అద్దె భవనాన్ని 4 నెలల్లోగా ఖాళీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ భవనాన్ని సంబంధించిన యజమాని హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆ మేరకు తీర్పు ఇచ్చింది. రాష్ట్ర ఖజానాకు కామధేనువు లాంటి రిజిస్ట్రేషన్ శాఖకు సొంత భవనాలు లేవు. రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్, మార్కెట్ విలువల రిజిస్ట్రార్, అర్బన్, గ్రామీణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. రాంనగర్‌లో ఉన్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నడుస్తున్న భవనం పాతదైంది. ఇరుకుగా కూడా ఉంది. వసతులు కూడా లేవు. రోజు వేలాది మంది ప్రజలు పనుల కోసం వస్తుంటారు. కూర్చోడానికి స్థలం, మూత్రశాలలు కూడా లేవు. 25 ఏళ్ల నుంచి మూడు కార్యాలయాలు ఈ భవనంలోనే నడుపుతున్నారు. రాంనగర్‌లో ఉన్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్, చిట్‌ఫండ్ కార్యాలయాలు ఖాళీ చేయాలని గతంలో యజమాని తాఖీదులు ఇచ్చాడు. మరోచోట భవనం లేకపోవడంతో ఐదారేళ్ల నుంచి నడుపుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఈ భవనం పరిస్థితి బాగా లేదని తేల్చారు. ప్రస్తుతం ఈ భవనానికి నెలకు రూ. 70 వేల వరకు ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. ఒక చదరపు అడుగు రూ.10ల లెక్కన అద్దె చెల్లిస్తున్నారు. ఎక్కడ వెతికినా అనుకూలమైన అద్దె భవనం దొరకలేదు. మూడు కార్యాలయాలకు అనుగుణంగా ఉండే భవనం కావాలని ఆ శాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. ఇప్పటికి అలాంటి భవనం ఎక్కడా కనిపించలేదు. జిల్లా రిజిస్ట్రార్ జి.భార్గవ్ ప్రభుత్వ భవనం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

మే లోగా ఖాళీ చేయాల్సిందే... : రమణరావు, అనంతపురం సబ్ రిజిస్ట్రార్ మే లోగా వేరొక భవనంలోకి మారాలని చూస్తున్నాం. త్వరలో ప్రకటన కూడా ఇస్తున్నాం. అనుకూలమైన భవనం ఉంటే వెంటనే కార్యాలయాన్ని తరలిస్తాం.

# గుట్టుగా పట్టణ ప్రణాళిక!

హిందూపురం : హిందూపురం పురపాలికలో పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) అధికారుల తీరు విస్తుగొలిపేలా ఉంది. అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ దిక్సూచి లాంటిది. రాబోయే 30 ఏళ్లలో పట్టణ విస్తరణ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించాలి. అన్ని వివరాలు సేకరించి, అన్ని వర్గాలతో సమావేశాలు నిర్వహించి, ప్రజల సలహాలు, సూచనలతో తయారు చేయాలి. వైకాపా హయాంలో అలాంటివి ఏమీ చేయలేదు. అవగాహన లేనివారు రూపొందించారు. దానిని దాచిపెట్టి ఇటీవల అమల్లోకి తెస్తున్నారు.

**గోడమీదే మాస్టర్ ప్లాన్...** ఎవరైనా పట్టణంలోని వివరాలు తెలుసుకోవా



లంటే... మున్సిపల్ కార్యాలయంలో గోడకు అతికించిన మాస్టర్ ప్లాన్ నమూనా కాగితాన్ని చూడాల్సిన పరిస్థితి. దానిని చూసి ఎవరూ అర్థం చేసుకోలేరు. డిజిటల్ రూపంలో రూపొందించకుండా గోడకు పరిమితం చేశారు. వాటి వివరాలు మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లుకు తెలియవంటే ఆశ్చర్య పోవాల్సిన పని లేదు. గోడ మీద చూసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతుండటం గమనార్హం.

**పలు తప్పిదాలు..** పట్టణంలోని డీఆర్ కాలనీలో భవన నిర్మాణాలు అడ్డుగా ఉన్నా, అవసరం లేకపోయినా 80 అడుగుల రోడ్డును ప్రతిపాదించారు. పరిగి రోడ్‌ను పరిశ్రమల జోన్‌గా గుర్తించారు. ఇలా చేయడంతో ఈ రెండు ప్రాంతాల్లో స్థల, భవన యజమానులు నష్టపోతున్నారు. ఇలాంటి తప్పిదాలు అనేకం ఉన్నట్లు తెలుస్తోంది.

**అందరికీ తెలిసేలా చేస్తాం : రమేశ్, మున్సిపల్ ఛైర్మన్.** మాస్టర్‌ప్లాన్ రికార్డు లేని మాట వాస్తవమే. కౌన్సిల్‌కు అందజేయలేదు. అధికారులతో చర్చించి, డిజిటలీకరణ చేయించి పుస్తక రూపంలోనూ తీసుకొచ్చేలా చర్యలు తీసుకొంటాం. అంతా పారదర్శకంగా ఉండేలా చూస్తాం.

# రక్షణ కరవు.. సిబ్బంది కొరత

పెనుకొండ : అటవీశాఖలో అడవుల విస్తీర్ణానికి తగ్గట్టుగా సిబ్బందిని నియమించక పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పెనుకొండ అటవీశాఖ పరిధిలో మొత్తం 32 వేల హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని పర్యవేక్షించడానికి క్షేత్ర అధికారులు, సహాయ అటవీ క్షేత్ర అధికారులు, గార్డులు ఇలా మొత్తం 35 మంది ఉండాలి. కేవలం 13 మందితోనే నెట్టుకురావడంతో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా సకాలంలో సంఘటనా స్థలికి చేరుకోలేక విలువైన అటవీసంపద అగ్నికి ఆహుతవుతోంది.

**పర్యావరణానికి ముప్పు**

ఫిబ్రవరి నెలాఖరు వచ్చిందంటేచాలు సువిశాల అటవీ ప్రాంతంలో ఎక్కడో ఒకచోట ఆకతాయిలు, మందుబాబులు, పశువుల కాపరులు ఇలా ఎవరో ఒకరు ఎండు గ్రాసానికి నిప్పు పెడుతున్నారు. దీంతో వేలాదిగా పచ్చని మొక్కలు, చెట్లు మంటల్లో తగలబడి పోతున్నాయి. అడవి జంతువులు, పశుపక్షాదులు హాహాకారాలు చేస్తున్నాయి. పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నారు. అగ్నిమాపక వాహనం అధికారులు, సిబ్బందితో కలసి తమ శాఖలో ఉన్న అరకొర అధికారు



లు, సిబ్బంది అటవీ ప్రాంతానికి సకాలంలో చేరుకోలేక మంటలను ఆర్పడం, అటవీ ప్రాంతాలను కాపాడుకోవడం కత్తిమీద సాములా మారింది. మంటలను అదుపు చేసేందుకు అవసరమైన ఆధునిక యంత్రాలు, పద్ధతులను ప్రభుత్వం, ఉన్నతాధికారులు అమలు చేయక పోవడంతో ఏటా వేల ఎకరాల్లో అటవీ సంపద బూడిదయిపోతోంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

అధికారులు, సిబ్బంది కొరతగా ఉన్న విషయాన్ని తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్నేళ్లుగా అటవీశాఖలో సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడంతో కొరత ఏర్పడింది. వెంటనే స్పందించి సిబ్బందిని సమకూర్చాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. సిబ్బంది సమకూరితే సమస్యలు తీరిపోతాయి. శ్రీనివాసరెడ్డి, అటవీశాఖ రేంజర్, పెనుకొండ

# ప్రజల కష్టాలు

పుంగనూరు : జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులు అంతంతమాత్రమే.. ఫలితంగా వేసవి వచ్చిందంటే చాలు ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈసారి వేసవికి ముందే దాహార్తి సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, కుప్పం, నగరి పురపాలికల్లో, చిత్తూరు కార్పొరేషన్‌లో నీటి సమస్య తలెత్తుతోంది. దీనికి తోడు సక్రమంగా పనిచేయని బోరు మోటార్లు, విస్తరించని తాగునీటి గొట్టాలతో ప్రజలు నీటి కటకట అనుభవిస్తున్నారు. ప్రస్తుతం నగరి పురపాలికలో మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో ఏదొక వీధిలో, కాలనీలో నీటి సమస్య తాండవం చేస్తోంది. ఈ క్రమంలో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది.

**మున్సిపాలిటీలో ఇలా..** పుంగనూరు పురపాలికలో భగత్‌సింగ్‌కాలనీ మిట్ట, మేలుపట్ల మలుపు, శుభారాం డిగ్రీ కళాశాల వెనుక, పెద్దిరెడ్డికాలనీ వీధులకు పురపాలక ట్యాంకర్లతో చాలీచాలని నీటిని అందిస్తున్నారు. పలమనేరులో మొన్నటి వరకు మూడు రోజులకోసారి వచ్చే నీళ్లు ప్రస్తుతం వారానికోసారి సరఫరా చేస్తున్నారు. 86 బోర్లలో 20 బోర్లు ఎండిపోగా, 10 బోర్లలో నీటిమట్టం తగ్గిపోయింది.

కుప్పం పురపాలికలో తాత్కాలిక ట్యాంకర్ల ఏర్పాటుకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. చిత్తూరు కార్పొరేషన్‌లో శివారు ప్రాంతాలు, పైపులైన్లు లేని ప్రాంతాలకు ట్యాంకర్లు, అద్దె ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. నగరి పురపాలికలో ప్రస్తుతానికి నీటి సమస్య లేదు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.48లక్షలు, మరో రూ.20లక్షలతో మోటార్లు కొనుగోలు, ఇతర ప్రణాళికలు రూపొందించారు.

చురకలు



# సూర్య ఘర్‌తో వెలుగులు

గణపవరం : కూటమి ప్రభుత్వం సూర్య ఘర్ పథకంతో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో వెలుగులు నింపనుంది. గత ప్రభుత్వాలు వీరికి విద్యుత్తు బిల్లుల్లో 200 యూనిట్ల వరకు రాయితీలు మాత్రమే ఇచ్చేవి. ప్రస్తుత ప్రభుత్వం పాత విధానాలకు స్వస్తి పలికి వారిపై పైసా భారం పడకుండా సౌర ఫలకాలు ఏర్పాటుచేయనుంది. ఒక్కో ఇంటికి సౌర ఫలకాలు ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.1.15 లక్షలు ఖర్చవుతుండగా కేంద్ర ప్రభుత్వం రాయితీ కింద రూ.60 వేలు చెల్లిస్తోంది. మిగతా రూ.55 వేలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించి.. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సౌర ఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్తు బిల్లుల భారం పడకుండా ఉండేందుకు కసరత్తు చేస్తోంది.

దశల వారీగా.. రెండు కిలోవాట్ల సౌర ఫలకాల ఏర్పాటుతో ప్రతి నెలా సుమారు 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. లబ్ధిదారు వినియోగించుకోగా మిగిలింది విద్యుత్తు గ్రిడ్‌కు వెళ్తుంది. దశల వారీగా



సౌర ఫలకాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. శ్లాబులు లేని ఇళ్లకు వీటిని ఎలా అమర్చాలనే విషయమై సర్వే చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించడంతో వారు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. పూరి గుడిసెలు, రేకుల షెడ్లపై ఏవిధంగా అమర్చాలో సమాలోచనలు చేస్తున్నారు. ఆదేశాలు రాగానే అమలు.. ఎస్సీ, ఎస్టీలకు సూర్యఘర్ అమలు కోసం సర్వే ప్రారంభించాం. శ్లాబు ఇళ్లు, పూరి గుడెసెలు, రేకుల షెడ్లలో ఉన్నవారి వివరాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపడతాం.సాల్మన్‌రాజు, ఎస్‌ఈ, ఏపీఈపీడీసీఎల్, ఏలూరు

# బడుల్లో బోగస్ విద్యార్థులెందరు !

ఒంగోలు : ఎయిడెడ్ పాఠశాలల్లో యూడైస్ లెక్కల ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేస్తారు. అక్కడ పనిచేసే వారికి ప్రభుత్వమే వేతనాలు చెల్లిస్తుంది. ఈ క్రమంలో కొన్ని యాజమాన్యాలు క్షేత్రస్థాయి అధికారులను సానుకూలపరచుకొని తప్పుడు లెక్కలు చూపుతున్నాయనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థుల సంఖ్య పరిశీలనకు త్రీమెన్ కమిటీని అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ఉప విద్యాశాఖాధికారి, ఎంఈవో, ఉన్న పాఠశాల సీనియర్ ప్రధానోపా



ధ్యాయుడు ఉంటారు. వీరు జిల్లాలోని 98 ఎయిడెడ్ పాఠశాలలను పరిశీలిస్తారు. దీంతో ఎయిడెడ్ యాజమాన్యాల లెక్కల్లో నిజాలు బట్టబయలు కానున్నాయి.

తల్లిదండ్రుల ఫిర్యాదుతో చర్యలు: ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా ఉపాధ్యాయులకు ప్రభుత్వం వృథాగా వేతనాలు చెల్లిస్తోందంటూ కొమరోలుకు చెందిన కొందరు తల్లిదండ్రులు ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ త్రీమెన్ కమిటీలను నియమించారు. పాఠశాలకు వెళ్లి వాస్తవంగా ఎంతమంది పిల్లలు ఉన్నారనే వివరాలు పంపాలని డీఈవోలను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అదనంగా ఉన్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణలో భాగంగా అవసరమైన ఇతర పాఠశాలల్లో నియమించనున్నట్లు సమాచారం.

నలభై లోపుంటే తుది నోటీసులు నలభై మందిలోపు విద్యార్థులున్న ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యాలకు తుది నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ కమిషనర్ డీఈవోలకు ఆదేశాలిచ్చారు. ఇటువంటివి జిల్లాలో 28 ఉన్నట్లు గుర్తించారు. గత మూడేళ్లుగా ఆ సంఖ్య పెరగకపోగా తగ్గుతుండటంతో మూసివేతకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికి రెండుసార్లు నోటీసులు జారీ చేసింది. తుదిగా ఇప్పుడు ఇవ్వనున్నారు. ఏప్రిల్ 23లోపు వాటిని మూసివేసి విద్యార్థులను సమీప పాఠశాలల్లో చేర్చాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# వంతెనలు వణికిస్తున్నాయి..



టెక్కలి : టెక్కలి– పాతపట్నం మార్గంలో తిర్లంగి, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఉన్న ఆర్‌అండ్‌బీ వంతెనలు శిథిలస్థితికి చేరి ప్రయాణికుల్ని భయపెడుతున్నాయి. టెక్కలి నుంచి సారవకోట, పాతపట్నం మండలాలకు చెందిన ప్రజల రాకపోకలతో నిత్యం ఈ మార్గం రద్దీగా ఉంటుంది. గ్రానైట్ క్వారీలు సైతం ఉండటంతో భారీ బ్లాక్‌లను రవాణా చేస్తుంటారు. ఈ రెండుచోట్ల వంతెనలు పూర్తిగా శిథిలమయ్యాయి. తిర్లంగి వద్ద రక్షణగోడ సైతం విరిగి ప్రమాదకరంగా మారింది. లక్ష్మీపురం గ్రామ కూడలిలో ఉన్న వంతెన కింది భాగంలో ఇనుప ఊచలు బయటపడి భయంగొల్పుతున్నాయి. సమస్యపై ఆర్‌అండ్‌బీ ఏఈ జగదీశ్ మాట్లాడుతూ తిర్లంగి వద్ద రూ.1.20 లక్షలు, లక్ష్మీపురం కూడలి వద్ద వంతెనకు రూ.1.60 లక్షలతో మరమ్మతు పనులకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించామన్నారు.

# సహకారం సెప‘రేటు’..!



అనకాపల్లి : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నుంచి సంబంధిత అధికారులు అందినంత దోచుకుంటున్నారు. పీఏసీఎస్‌ల్లో రోజువారీ లావాదేవీలకు రేటు కట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. కాసులివ్వకుంటే కొర్రీలు పెట్టి అడ్డుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల్లో సహకారం సెప‘రేటు’ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సీఈవోల నుంచి జిల్లా అధికారుల వరకు సహకార సంఘాలను తమ జేబు సంస్థగా మార్చుకున్నారు. ఇప్పటికే చెట్టుపల్లి, జానకీరామపురం సంఘాల్లో సీఈవోలు భారీగా నిధులు దుర్వినియోగం చేశారు. తాజాగా జిల్లా సహకార కార్యాలయంలో ఫర్నిచర్ కోసం పీఏసీఎస్‌ల నుంచి అనధికార వసూళ్ల విషయంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి గోవిందరావు సస్పెన్షన్‌కు గురయ్యారు. వీరే కాదు పర్సన్ ఇన్‌ఛార్జుల పేరుతో కొందరు.. ఆడిటర్ల పేరుతో మరికొందరు సహకార సంఘాలను పీడించేస్తున్నారు. ఈ తతంగమంతా తెలిసినా జిల్లా అధికారులు ఏమీ పట్టనట్టే వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

జిల్లాల పునర్విభజన తర్వాత అనకాపల్లి జిల్లా సహకార అధికారి (డీసీవో) కార్యాలయాన్ని కశింకోటలో ఏర్పాటు చేశారు. అందులో ఫర్నిచర్ కోసమంటూ జిల్లాలోని 74 పీఏసీఎస్‌ల నుంచి విరాళాలు దండుకున్నారు. ఒక్కో సంఘం నుంచి కనిష్ఠంగా రూ.5 వేల గరిష్ఠంగా రూ.10 వేలు చొప్పున వసూళ్లు చేశారు. సహకారశాఖ ఆడిటర్లు, మరికొంత మంది సిబ్బంది ఈ ఘనకార్యం చేశారు. రెండేళ్లు ఈ వ్యవహారం గుట్టుగానే ఉంచారు. తర్వాత వారిలో వారికే పొసగక ఫిర్యాదులు చేసుకోవడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో డీసీఏ గోవిందరావే పీఏసీఎస్‌ల నుంచి తమను వసూళ్లు చేయమని చెప్పారని, అందుకు సాక్ష్యాలు కూడా ఉన్నాయని కొంతమంది సహకార శాఖ కమిషనరేట్‌కు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణలో నిజమేనని తేలడంతో గోవిందరావును సస్పెండ్ చేశారు. అయితే అధికారిక ఉత్తర్వులు లేకుండా నోటి మాటగా చెబితే వసూళ్లకు పాల్పడడం కిందిస్థాయి సిబ్బందిది కూడా తప్పే అవుతుంది కదా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ సంబంధిత శాఖలోనే చర్చించుకుంటున్నారు.

**పైసలిస్తేనే దస్త్రాలు కదిలేది..**

ప్రాథమిక సహకార సంఘాలకు పాలకవర్గాలు లేవు. సహకార శాఖ అధికారులే పర్సన్ ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 98 సంఘాలున్నాయి. నాలుగైదు సంఘాలకు కలిపి ఒక పర్సన్ ఇన్‌ఛార్జిని నియమించారు. వీరిలో కొంతమంది పీఏసీఎస్‌లో ఏ దస్త్రంపై సంతకం చేయాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి. రైతులు రుణాలను రెన్యువల్ చేసే క్రమంలో ఎక్కువ డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్టేషనరీ కొనుగోలు, జీతాలు బిల్లులు మార్చినప్పుడు పర్సంటేజీ ప్రకారం ఇస్తేనే సంతకాలు చేస్తున్నారు. సహకార సంఘాల్లో వ్యవహారాలన్నీ చేతిరాతతోనే జరుగుతున్నాయి. డబ్బులిస్తే సర్దుబాటు లేకుంటే అడ్డుకుంటూ వేధిస్తున్నారని ఓ పీఏసీఎస్ సీఈవో ‘ఈనాడు’ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగైదు సంఘాల పర్యవేక్షణ పేరుతో రవాణా భత్యం భారీగానే నొక్కేశారు. సీఈవోలు విశాఖ నుంచి రాకపోకలు సాగించడం, బినామీ పేర్లతో వారు కూడా రుణాలు పొందడంతో పర్సన్ ఇన్‌ఛార్జులు, ఆడిటర్లు ఎంత అడిగితే అంత సమర్పించుకుంటున్నారు.

# భూతాల చెట్టాపట్టాలు

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో ‘రెవెన్యూ’లో భారీ అక్రమాలు జరిగాయి. కొందరు రెవెన్యూ అధికారులు, వైకాపా నాయకులు కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారు. అందులో ఫ్రీహోల్డ్ వ్యవహారం ఒకటి. 20 ఏళ్లు దాటిన.. 2003కు ముందు పేదలకు పంపిణీ చేసిన భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పిస్తూ గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాని మాటున నిబంధనలకు విరుద్ధంగా వేల ఎకరాలకు అయినవారికి కట్టబెట్టారు. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**అనర్హులకు యాజమాన్య హక్కులు**

ఉమ్మడి జిల్లాలో 2004, 05లో ఎసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు పంపిణీ చేశారు. కొన్నింటికి అసైన్‌మెంట్ కమిటీ లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా పట్టాలిచ్చారు. 2003 తర్వాత పట్టాలిచ్చిన, అసలు పట్టాలే లేకుండా ఆన్‌లైన్‌లో ఉన్న భూములకూ హక్కులు కల్పించారు. నిబంధనల ప్రకారం 2003కు ముందు పట్టాలున్నవారే ఫ్రీహోల్డ్‌కు అర్హులు. ఆ ముసుగులో వందలాది ఎకరాలకు పైగా యాజమాన్య హక్కులు కల్పించారు. దీనిపై అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. **వేగవంతం చేయాలి మరి**

గతేడాది అక్టోబరు నుంచి ఫ్రీహోల్డ్ భూములను రెవెన్యూ యంత్రాంగం పునఃపరిశీలిస్తూనే ఉంది. ఫ్రీహోల్డ్ అయిన భూములకు సంబంధించిన క్రయవిక్రయాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లను ఆపేశారు. నెలలు గడుస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా ఎన్ని ఎకరాలు చేశారన్న లెక్క తేల్చడంలో జిల్లా యంత్రాంగాలు జాప్యం చేస్తున్నాయి. కలెక్టరేట్‌లలో గత ఐదు నెలలుగా ఫ్రీహోల్డ్ భూముల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

**75,930 ఎకరాల పరిశీలన**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,00,394.44 ఎకరాలకు ఫ్రీహోల్డ్ (యాజమాన్య హక్కులు) కల్పించారు. అందులో 75,930.81 ఎకరాల పరిశీలన పూర్తైంది. ఇందులో 30,764.44 ఎకరాలను మాత్రమే జిల్లా పాలనాధికారులు ఆమోదించారు. ఇక 18,070.35 ఎకరాలకు సంబంధించి వ్యత్యాసాలున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో 33,447.22 ఎకరాలకు సంబంధించి నిబంధల ప్రకారం జరిగాయని, సుమారు 2,142 ఎకరాలు చట్ట విరుద్ధంగా చేశారని ప్రాథమికంగా నిర్ధారించారు. మరో 11,874.08 ఎకరాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

**505.43 ఎకరాలు గల్లంతు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,2,84.93 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేశారు. చట్టబద్ధంగా 1,779.5 ఎకరాలు ఉండగా. 505.43 ఎకరాల భూములు వ్యత్యాసాలున్నాయని తేల్చారు. ఉమ్మడి జిల్లాలో 2,292.88 ఎకరాలకు సంబంధించిన వివరాలను కంప్యూటరీకరణ చేశారు. కర్నూలు జిల్లాలో మొత్తం 556.67 ఎకరాలకు గాను 497.13 ఎకరాలను నిబంధనల ప్రకారం రిజిస్టర్ చేశారు. మరో 59.54 ఎకరాలకు సంబంధించి వ్యత్యాసాలున్నాయి. ఇప్పటివరకు 538.71 ఎకరాలను పరిశీలించగా.. మరో 17.96 ఎకరాలను పరిశీలించాల్సి ఉంది.

# ఆర్‌యూ.. ఇదేం వరూసా



కర్నూలు : రాయలసీమ విశ్వవిద్యాలయం (ఆర్‌యూ)లో ప్రగతి పనులు నత్తను తలపిస్తున్నాయి. విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో భాగంగా రాయలసీమ వర్సిటీకి కేంద్రం రూ.20 కోట్లు కేటాయించింది. 2020 నుంచి నేటికీ నిధులు ఖర్చు చేయలేదు. గుత్తేదారులకు పనులు అప్పగిస్తే అన్నీ వారే చూసుకునే అవకాశమున్నా పూర్తిస్థాయిలో వీసీలుగా పనిచేసినవారు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ప్రస్తుత ఇన్‌ఛార్జి వీసీ రూ.10 కోట్ల విలువైన పనులను యుద్ధప్రాతిపదికన చేస్తుండటం గమనార్హం.

**‘దారి’తప్పిన నిర్మాణం**

జగన్నాథగట్టు ప్రధాన రహదారి నుంచి ఇంజినీరింగ్ కళాశాల భవనం వరకు ఉన్న దూరంలో కొంతమేర రూ.40 లక్షలు వెచ్చించి గ్రావెల్ రోడ్డు వేశారు. ఆయా పనులు నాసిరకంగా జరిగాయన్న ఆరోపణలు రావడంతో దానిపై అప్పటి కలెక్టర్ ఆదేశాలమేరకు ఆర్ అండ్ బి అధికారులు విచారణ జరిపారు. నిధులు వెచ్చించిన తీరుపై సమగ్ర విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**అర్ధంతరంగా ఆగిపోయాయి**జగన్నాథగట్టుపై ఉన్న 180 ఎకరాల్లో ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాల నిర్మించాలని కొన్నేళ్ల కిందట నిర్ణయించారు. రూసా కింద కేటాయిం చిన రూ.20 కోట్ల నిధుల్లో రూ.10 కోట్లతో భవనాలు నిర్మించాలని భావించారు. గత వైకాపా ప్రభుత్వం ఎ.పి.ఇ.డబ్ల్యు.ఐ.డి.సి.కి పనులు అప్పగించింది. గుత్తేదారు సుమారు రూ.కోటి విలువైన పనులు చేశారు. బిల్లులు ఎంతకీ విడుదల చేయకపోవడంతో పనులు మధ్యలో ఆపేశారు.

**మరమ్మతులకు భారీగా ఖర్చు**

రాయలసీమ విశ్వవిద్యాలయంలో వసతిగృహాలు, అకడమిక్, పరిపాలన, గ్రంథాలయం తదితర భవనాల మరమ్మతులకు ఏకంగా రూ.4 కోట్లు వెచ్చిస్తున్నారు. మొత్తం పది పనులకుగానూ ఇప్పటికే ఎనిమిది పనులు మొదలయ్యాయి. మరమ్మతులకు అంతమొత్తం వినియోగిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.కోట్లలో అంచనా..**కంప్యూటర్ సైన్స్ ల్యాబ్, ఏఐ ల్యాబ్‌లకు అవసరమైన కంప్యూటర్లతో పాటు వాటి ఏర్పాటుకు సంబంధించి ఫర్నిచర్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈసీఈ ల్యాబ్‌కు అవసరమైన పరికరాలకు రూ.కోటి వ్యయమవుతుందని అంచనా వేశారు. అన్ని పీజీ కోర్సులకు సంబంధించి ల్యాబ్ ఉపకరణాలకు రూ.3 కోట్లవుతుందని అంచనా వేస్తున్నారు. కొనుగోళ్ల పేరుతో భారీగా వ్యయం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

# చెరువుకు చేవ : మొదటి దశలో రూ.15 కోట్లు

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వం చెరువుల అభివృద్ధిని పట్టించుకోలేదు. కనీసం పూడికతీత పనులు చేపట్టలేదు. దీంతో చాలా ప్రాంతాల్లో తటాకాలు రూపు కోల్పోయాయి. కూటమి ప్రభుత్వం చెరువులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్.ఆర్.ఆర్. (మరమ్మతులు, పునర్నిర్మాణం, పునరుద్ధరణ) పథకం కింద నిధులివ్వాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో ట్రిబులార్–3లో భాగంగా ఉమ్మడి జిల్లాలో చెరువులను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వాటా 40 శాతం, కేంద్రం 60 శాతం నిధులతో బాగు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన చెరువుల అభివృద్ధికి రూ.48 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్. పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొదటి దశలో రూ.15 కోట్ల విలువతో పనులు చేపట్టేందుకు 7 చెరువుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఆలూరు మండలం వెంగళాయదొడ్డి చెరువు బాగుకు రూ.4.10 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. దీని కింద 1,350 ఎకరాల ఆయకట్టు ఉంది. కాల్వలు పూడిపోవడంతో ఆయకట్టు తగ్గుతోంది. .. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదనలు పంపామని జలవనరుల శాఖ ఆస్పరి ఏఈఈ రంగడు ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. నిధుల విడుదలైన వెంటనే పనులు చేపడతామన్నారు.

# అనంతార్థ.. మాయలెన్నో!

కావలి : అనంతార్థ అసోసియేట్స్ మనీస్కామ్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధితుల సంఖ్య పెరుగుతోంది. పొరుగు జిల్లాల్లోని వారు కూడా భారీగా పెట్టుబడి పెట్టారు. ప్రకాశం జిల్లాలోని ఓ మండల తహసీల్దార్ ఏకంగా రూ.కోటి వరకు డిపాజిట్ చేసినట్లు సమాచారం. సదరు తహసీల్దార్ కొండాపురం మండలంలో ఉన్న తన మిత్రుడి ద్వారా ఇందులో చేరారు. ఆయన మిత్రుడు రూ.11 లక్షలు చెల్లించి డివిడెండ్లు పొందడంతో అతను రూ.కోటి పెట్టినట్లు తెలుస్తోంది. కావలిలోని స్వర్ణ వ్యాపారులు తమ సొమ్ము పోగొట్టుకున్నట్లు చెపుతున్నారు.

**బ్యాంకు ఖాతాల స్తంభన**



స్కాంపై విచారణ చేస్తున్న పోలీసులు నిందితుల ఖాతాలను స్తంభింపజేస్తున్నారు. ఇప్పటివరకు 20 మందికిపైగా కీలక నిందితుల బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలు నిలిపేశారు. మరో 100 మందివి కూడా సీజ్ చేస్తారని సమాచారం. ఇతర ప్రాంతాల వారు ఎందరో ఫిర్యాదులు చేస్తున్నారు. కావలి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో నెలకొన్న వర్గపోరుతో ఈ వ్యవహారం బయటపడినట్లు సమాచారం.

**ఆటో డెబిట్ పద్ధతిలో చెల్లింపు**

డిపాజిట్‌దార్లకు తొలుత డివిడెండ్‌ను ఆటో డెబిట్ విధానంలో సకాలంలో చేరేలా ఏర్పాట్లు చేశారు. నగదు జమ కాగానే ఆ సంస్థ ప్రమోటర్లు నేరుగా డిపాజిటర్లకు ఫోన్లు చేస్తారు. మీ ఖాతాల్లో ఈ వాయిదా డివిడెండ్ జమ అయిందని చూసుకోవాలని పలకరిస్తారు. ఇలా నమ్మకం పెంచుకొని తరువాత అక్రమాలకు పాల్పడ్డారు.

**ఇంకా ఎన్నో..**ఆ సంస్థలో చేసిన అనుభవంతో పలువురు ఏజెంట్లు సొంతంగా ఈ స్కీమ్‌లు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పాతూరు, వైకుంఠపురంలో ఇలాంటి వసూళ్లు చేస్తున్నట్లు వెలుగులోకి వస్తోంది. తామే ప్రతి నెలా ఆరేడు శాతానికి పైగా డివిడెండ్లు ఇస్తామని వసూళ్లకు పాల్పడ్డారు. స్టాక్‌మార్కెట్ లావాదేవీలకు ఖాతాలను ప్రారంభించి అమలుచేస్తున్నారు.

# సాగు.. సాంకేతిక సొబగు

నెల్లూరు : వ్యవసాయ రంగంలో వినూత్న పోకడలు.. ఉత్తమ యాజమాన్య పద్ధతులు.. యంత్ర పరికరాల వినియోగం.. ఆక్వాలో మేలైన విధానాలను రైతుల దరి చేర్చడమే లక్ష్యంగా మూడేళ్ల తర్వాత నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానం(ఏఆర్ఎస్)లో నేడు కిసాన్ మేళా జరగనుంది. ‘ఆధునిక సాంకేతికత– లాభసాటి వ్యవసాయం’ అన్న నినాదంతో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం– వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం రైతులకు మేలు చేకూర్చనుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**నూతన వంగడాల క్షేత్ర ప్రదర్శన**

నూతన వరి వంగడాల ఆవిష్కరణలో నెల్లూరులోని ఏఆర్ఎస్‌ది దేశంలోనే ప్రత్యేకస్థానం. నెల్లూరు మసూరి(ఎన్ఎల్ఆర్ 34449) రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతుండగా– ఎన్ఎల్ఆర్– 40024, ఎన్ఎల్ఆర్– 3354, ఎన్ఎల్ఆర్– 40054, ఎన్ఎల్ఆర్– 3238 తదితర 30 వరి రకాలు ఇక్కడ పురుడు పోసుకున్నవే కావడం గమనార్హం.

**60 స్టాళ్ల ఏర్పాటు**

కిసాన్ మేళాలలో భాగంగా వివిధ అంశాలపై ఏఆర్ఎస్ ప్రాంగణంలో 60 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. వాటిలో వరితో పాటు అపరాలు, వేరుసెనగ, నూనె గింజలు, పత్తి, చిరుధాన్యాలు పంటల్లో ఆధునిక యాజమాన్య పద్ధతులు, మెట్ట వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ తదితర అంశాలతో పాటు నిమ్మ, మామిడి, కొబ్బరి సాగులో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తలు వివరించనున్నారు. ఆక్వా కల్చర్‌లో నూతన అభివృద్ధి కార్యక్రమాలు, శాస్త్రవేత్తలు, రైతుల చర్చా కార్యక్రమం, వ్యవసాయ క్విజ్‌లు కిసాన్ మేళాలలో భాగంగా జరగనున్నాయి.

**సద్వినియోగం చేసుకోవాలి**

మూడేళ్ల తర్వాత కిసాన్‌మేళా నెల్లూరు ఏఆర్ఎస్‌లో జరుగుతోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, రైతుల సందేహాలను నివృత్తి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలి. యు.వినీత, ప్రధాన శాస్త్రవేత్త, ఏఆర్ఎస్ హెడ్

# ఉపశమనం..!

టెక్కలి :జిల్లాలో ఖరీఫ్ ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాత పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. ప్రస్తుత తరుణంలో లక్ష టన్నుల మేర ధాన్యపు నిల్వలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిల్వలు వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, నరసన్నపేట నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి లేకపోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా జిల్లాకు 60 వేల టన్నులు అదనపు లక్ష్యం ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. గత ఖరీఫ్‌లో 3.6 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, దాదాపు 9.51 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులొచ్చాయి. ఇదంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని లేదు. రైతుల వద్ద స్తంభించిన ముతక రకం తీసుకోవాలని వస్తున్న డిమాండ్‌తో జిల్లాలో 4.9 లక్షల టన్నులు తీసుకునేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు 4.57 లక్షల టన్నులు కొన్నారు. నిర్దేశిత లక్ష్యం పూర్తి కాకుండానే జిల్లా వ్యాప్తంగా ప్రక్రియ దాదాపు నిలిచిపోయింది. దీంతో పెద్ద ఎత్తున రైతుల వద్ద ధాన్యం నిల్వలున్నాయి. రహదారులు, కల్లాల్లో బస్తాలు పేరుకుపోయాయి.

అరకొరగా ఇస్తే మళ్లీ ఇబ్బందులే.. రైతుల నుంచి వస్తున్న ఒత్తిడితో ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి కనీసం 90 వేల టన్నుల లక్ష్యమివ్వాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కానీ అదనంగా జిల్లాకు 60 వేల టన్నుల ధాన్యం లక్ష్యం ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అధికారుల లెక్కల ప్రకారం 76,950 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాల్లో, 13,550 మెట్రిక్ టన్నులు కుప్పల రూపంలో ఉన్నాయి. అరకొర లక్ష్యం ఇస్తే తీవ్ర ఇబ్బందులు పడతామని రైతులు పేర్కొంటున్నారు. ‘ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తక్షణమే కొనుగోలు చేస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.’ అని పౌర సరఫరాల సంస్థ డీఎం టి.వేణుగోపాల్ పేర్కొన్నారు. దాచుకునే దారిలేక పొలాల్లోనే ఉంచాం – యాళ్ల పాపారావు, మాకివలస, నరసన్నపేట మండలం రెండెకరాల్లో వరి పంటను కుప్పల రూపేనా పొలాల్లోనే ఉంచాం. ఎలుకలు, పక్షులు తాకిడితో ధాన్యం నష్టపోతున్నాను. లక్ష్యం లేకపోవడంతో వరి కుప్పలు విడదీసి నూర్చలేక పోతున్నాం. ధాన్యం కొనుగోలుకు వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

# బియ్యం లేవు.. డబ్బులిస్తామంటున్నారు..!



చిత్తూరు : బియ్యం లేవు.. తక్కువగా వచ్చాయి.. బియ్యానికి బదులు డబ్బులిస్తాం.. లేకపోతే వచ్చే నెలలో అందజేస్తాం. గట్టిగా ప్రశ్నిస్తే రావద్దు అంటున్నారని కార్డుదారులు లబోదిదోమంటున్నారు. ఈ ఘటన చిత్తూరు నగర పరిధి 28వ డివిజన్ వినాయకపురం చౌక దుకాణం 41లో చోటుచేసుకుంది. సదరు చౌక దుకాణ డీలరు బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని ముప్పతిప్పలకు గురిచేస్తున్నారంటూ కార్డుదారుల ఆవేదన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించారు. వినాయకపురం చౌక దుకాణం పరిధిలో 396 బియ్యం కార్డులున్నాయి. ఫిబ్రవరి నెలకు సం బంధించి ఇప్పటివరకు 159 కార్డులకే సరకులు అందజేసినట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు చెబుతున్నాయి. 'సరకులు ఎప్పుడిస్తారో తెలియదు. బియ్యంలో కోత, కందిపప్పు ఒక నెల ఇస్తే మరో నెల ఇవ్వరు. ఎండీయూ వాహనం ఎక్కడుందో తెలియదు. ప్రతి నెలా దుకాణం వద్దే బియ్యం తీసుకుంటు న్నాం. ఈ నెలలో బియ్యం తక్కువ గా వచ్చా యి.. బియ్యానికి బదులు డబ్బులిస్తామని కొందరికి.. 35 కిలోలు ఇవ్వాల్సిన కార్డుదారులకు 20 కిలోలు అందజేశారు. మిగిలిన 15 కిలోలు వచ్చే నెలలో ఇస్తామన్నారు. లేని పక్షంలో నగదు ఇస్తామంటున్నారు' అని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. తిండి గింజలు లేకపోతే మేం ఎలా బతకాలని కార్డుదారు వనజ వాపోయారు.

**డీలరుపై చర్యలు..**

విచారించి డీలరుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. కార్డుదారులకు విధిగా నిత్యావసర సరకులు అందజేయాలి. బియ్యానికి బదులు నగదు ఇచ్చినట్లు రుజువైతే కేసు నమోదు చేస్తాం. శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

# పెరిగిన వ్యయం.. ఆగదు యజ్ఞం

అనకాపల్లి: వైకాపా హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తిచేయడానికి కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. నీటి వనరుల లభ్యతపై అంచనా లేకుండా గత ప్రభుత్వం చేసిన పనులతో నిధులు వృథా అయ్యాయే తప్ప తాగునీరు మాత్రం అందుబాటులోకి రాలేదు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తలసరి 55 లీటర్ల నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో జలాశయాల నుంచి నీటిని వాడుకునేందుకు కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2058 నాటికి జనాభా ఎంత పెరుగుతుందో అంచనా వేసి అప్పటి



అవసరాలకు సరిపడా నీటిని అందించేలా ఏర్పాట్లు చేయడానికి సవిర నివేదికలు (డీపీఆర్) తయారు చేశారు.

**జలాశయాల నుంచి ఇంటికి చేరేది ఎలా అంటే..:** రిజర్వాయర్ నుంచి నీటిని కాలువలు, ఇతర మార్గాల ద్వారా సేకరించి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చేరవేస్తారు. అక్కడ శుద్ధి చేసిన నీటిని సమీపంలో సంపులకు పంపిస్తారు. అక్కడి నుంచి పంప్ హౌస్, గ్రామాల్లో వాటర్ ట్యాంకులకు గ్రావిటీ విధానంలో పైపుల ద్వారా చేరుతుంది. నీళ్ల ట్యాంకుల నుంచి ఇంటింటా కుళాయిలకు సరఫరా చేస్తారు. దీనికోసం అనకాపల్లి జిల్లా మొత్తంగా నీటిని అందించేందుకు సుమారు రూ.2,639 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వానికి ఈ ప్రతిపాదనలు పంపించామని త్వరలో అనుమతులు రానున్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ రామస్వామి తెలిపారు.

# రెండు కొండలు.. నాలుగు జాతీయ రహదారులు

నంద్యాల: నంద్యాల జిల్లాలో నాలుగు జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉందని 'కూటమి' ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. జాతీయ రహదారి-44, జాతీయ రహదారి-40 అనుసంధానం చేసేలా ప్యాపిలి నుంచి పాణ్యం వరకు నాలుగు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇవన్నీ పూర్తయితే నల్లమల- ఎర్రమల కొండలను కలిపేలా ప్రయాణం సాగనుంది. రవాణా రంగానికి మరింత మేలు చేయనుంది. ప్యాపిలి నుంచి పాణ్యం వరకు నిర్మించే జాతీయ రహదారి బనగానపల్లి మీదుగా వెళ్తుంది. అదేవిధంగా బనగానపల్లి- కోవెలకుంట్ల, బేతంచెర్ల- బనగానపల్లి మీదుగా కొత్తవి నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. కోవెలకుంట్ల-ఆళ్లగడ్డ మధ్య 10 మీటర్ల పొడవునా ఆధునికీకరిస్తారు. ఇందుకు అవసరమయ్యే భూమిని సేకరించనున్నారు. గతంలో నిలిచిపోయిన అమరావతి- అనంతపురం రహదారికి ఇటీవలే కేంద్రం పచ్చజెండా ఊపింది. బేతంచెర్ల- డోన్ మధ్య ఎన్‌హెచ్ 340బీ రహదారి పనులు రూ.600 కోట్లతో జరుగుతున్నాయి.

# వడివడిగా జల్‌జీవన్ సాగేలా..



చిత్తూరు : పల్లెలోని ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. వైకాపా హయాంలో 2019 ఆగస్టులో పనులు మొదలుకాగా 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇచ్చిన నిధులను జగన్ సర్కార్ మళ్లించడంతో ఐదేళ్లయినా ఇవి ఓ కొలిక్కి రాలేదు. అస్తవ్యస్తంగా మారిన ఈ పథకాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. 2028 వరకు మిషన్‌ను పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో పనులు వేగంగా పట్టాలెక్కించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించింది. పంచాయతీలను బలోపేతం చేసేందుకు ఎప్పటికప్పుడు కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులను విడుదల చేసింది. ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఇదే తరహాలో జలజీవన్ మిషన్‌నూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బోర్లు వేసి ఉపరితల ట్యాంకులకు నీరు అందిస్తే అవి సురక్షితం కావనే భావనతో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు గండికోట, కండలేరు జలాశయాల నుంచి జలాలు తీసుకురావాలని నిర్ణయించారు. ఇప్పటికే దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

**వైకాపా కార్యకర్తలకు పందేరం**

వైకాపా హయాంలో రూ.5 లక్షలలోపు పనులను నామినేషన్ ప్రాతిపదికపై అప్పగించారు. ఫ్యాను పార్టీ కార్యకర్తలకు అప్పగించాలనే ఉద్దేశంతోనే పనుల విలువను విభజించి ఆ పార్టీ శ్రేణులకు కట్టబెట్టారు. పనులు ముందుకు వెళ్లకపోవడానికి ఇది కూడా ఓ కారణం. దీనికితోడు కేంద్రం ఇచ్చిన వాటాకు అనుగుణంగా రాష్ట్రం నిధులు విడుదల చేయలేదు.

**25 శాతంలోపు రద్దు చేసి..**

ఇదేక్రమంలో 25 శాతం లోపు జరిగిన పనులన్నీ రద్దు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ నిధులను పైప్‌లైన్ పనులకు వెచ్చించాలని అనుకుంటున్నారు. ః అదేవిధంగా మంజూరైనా ప్రారంభమవ్వని పనులనూ రద్దుల పద్దులో చేర్చింది. అంతకుమించితే త్వరగా చేయాలని

జలజీవన్ పనుల్లో 25 శాతం దాటిన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సర్కార్ ఆదేశించింది. వీటి పురోగతిపై తరచూ సమీక్షించాలని అధికారులకు సూచనలు ఇచ్చింది.

జిల్లాలో ఇలా..

మొత్తం పనులు 5,041
ప్రారంభం కానివి 1,921
పురోగతిలో ఉన్నవి 286
పూర్తయినవి 2,432
రద్దు చేసినవి 402
కేటాయింపులు (రూ.కోట్లలో) 431.45
చేసిన వ్యయం 101.20

తిరుపతి జిల్లాలో మరో 728 పనులు గుత్తేదారులకు అప్పగించినా మొదలు కాలేదు.

# మభ్యపెట్టి.. మాయచేసి..!



విశాఖపట్నం : 'అంత చేస్తాం... ఇంత చేస్తాం..' అంటూ మభ్యపెట్టిన వైకాపా నాయకుల మాయ మాటలు నమ్మిన ప్రజలు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఆస్తులు పోయి.. చేతికందిన పరిహార పత్రాలు చెల్లుబాటు అవుతాయో..? లేదోనని..? కలవరపడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సింహాచలం గోశాల నుంచి అడివివరం వరకు ఉన్న బీఆర్టీఎస్ విస్తరణ పనులు చేపట్టి, ఆస్తులు కోల్పోయిన బాధితులకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) పత్రాలు అందజేశారు. మొత్తం 210 మందికి పత్రాలు జారీ చేయగా, మరో 80 మందికి నేటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఆయా పత్రాల చెల్లుబాటుపై అప్పట్లో వైకాపా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సింహాచలం దేవస్థానం భూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన నేపథ్యంలో.. స్థలాల క్రమబద్ధీకరణపైనా త్వరలో నిర్ణయం వెలువడనుంది. అప్పుడే వైకాపా జారీ చేసిన టీడీఆర్ బాండ్ల భవితవ్యం తేలనుంది.

**హక్కులు లేకపోవడంతో:** పాతగోశాల కూడలి నుంచి అడివివరం వరకు ఉన్న సింహాచలం దేవస్థానం భూముల్ని ఆక్రమించి ఏళ్ల కిందట నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి యాజమాన్య హక్కులు లేవు. దీంతో ఆ ప్రాంతంలో బీఆర్టీఎస్ రహదారి నిర్మాణ పనులు జరగలేదు. అయితే నిత్యం వాహన రాకపోకలకు, అప్పన్నస్వామి నిజరూప దర్శన సమయంలో, గిరి ప్రదక్షిణ రోజున ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా రహదారి విస్తరణ చేపట్టాలని వైకాపా హయాంలో నిర్ణయించారు.

**హడావుడి పనులు:** గత సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా హడావుడిగా విస్తరణ పనులు చేపట్టిన వైకాపా ప్రభుత్వం.. బాధితులకు ఇచ్చే నష్టపరిహారం, టీడీఆర్ పత్రాల జారీలో స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించలేదు. దేవస్థానాలకు చెందిన స్థలాలకు టీడీఆర్‌లు ఇవ్వాలంటే నిబంధనలు మార్పు చేసి కొత్త జీఓ జారీ చేయాల్సి ఉంటుంది. కాని అప్పట్లో ఆస్తులు కోల్పోయిన బాధితుల్ని నమ్మించడానికి అయిదుగురు స్థానిక అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, వారి నిర్ణయం మేరకు టీడీఆర్ పత్రాలు ఇచ్చేశారు. రూ.200 కోట్ల విలువైన టీడీఆర్‌లు జారీ చేసినప్పుడు కనీసం కౌన్సిల్ తీర్మానం చేయలేదు. ఈ మొత్తం ప్రక్రియలో అప్పటి నాయకులు, అధికారులపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో టీడీఆర్‌ల చెల్లుబాటుపై బాధితులంతా ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే కోటి ఆశలతో ఉన్నారు.

**అధికారులు చర్చించారు...!:** నాటి టీడీఆర్‌లపై అప్పటి ఎమ్మెల్యే, కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. ప్రభుత్వ అనుమతితోనే పత్రాలు జారీ అయ్యాయి. అయితే కౌన్సిల్‌లో తీర్మానంపై ఎలాంటి ప్రతిపాదన రాకపోవడంతో... ఆ ప్రక్రియ చేపట్టలేదు. హరివెంకటకుమారి, జీవీఎంసీ మేయర్

# గాజువాకలో ఇసుక దుమారం



విశాఖపట్నం : గాజువాక కేంద్రంగా ఇసుక వ్యవహారం దుమారం రేపుతోంది. అధిక లోడ్లతో వస్తున్న లారీలను తహసీల్దార్ పట్టుకొని మిందిలోని ఇసుక యార్డుకు తరలించడంపై విమర్శలు వస్తున్నాయి. కొందరి ఒత్తిళ్లతో కావాలనే లారీలను పట్టుకుంటున్నారని ఇసుక రవాణాదారులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ పరిణామాలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. మరో వైపు అందుబాటు ధరలో ఇసుక దొరక్క కొనుగోలు దారులు ఇబ్బంది పడుతున్నారు.

తక్కువ పరిమాణంలో ఇసుక అవసరమైన వారి కోసం జిల్లాలో గాజువాక, భీమిలి, ముడసర్లోవ వద్ద ప్రభుత్వం నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసింది. టెండర్ల ద్వారా గుత్తేదారులను ఎంపిక చేసి వారితో వీటిని నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ కొనుగోలు చేయాలంటే వినియోగదారులు కాస్త ఎక్కువ వెచ్చించాల్సి వస్తోంది.

మింధి(గాజువాక)లోని నిల్వ కేంద్రంలో రవాణా ఖర్చుతో కలిపి టన్నుకు రూ.1300 ఖర్చవుతుంది. ఇది భారమని భావించి కొందరు తక్కువకు లభించే చోట కొనుగోలు చేసుకుంటున్నారు. కొందరు రవాణాదారులు టన్ను రూ.వెయ్యిలోపే అమ్ముతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో ఎక్కడి నుంచైనా ఇసుక తెచ్చుకునే వీలుంది. దీంతో కొందరు అలా తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిల్వ కేంద్రాల్లోని ఇసుక కొనుగోలుకు చాలా మంది ఆసక్తి చూపడం లేదు. దీంతో అక్కడి నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో గుత్తేదారుకు నష్టం వస్తుందని ఆ కేంద్రానికి చెందిన వ్యక్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి లారీలను పట్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిరసన బాట: మరో వైపు ప్రజల అవసరాలకు ఇసుక రవాణా చేస్తుంటే గుత్తేదారుకు చెందిన కొందరు మనుషులు లారీలను అడ్డుకొని రెవెన్యూ సిబ్బందిని పిలిపించి టైర్లలో గాలి తీయిస్తున్నారని ఇసుక రవాణాదారులు వాపోతున్నారు. అంతేకాకుండా ఆ ఇసుకను గుత్తేదారు యార్డులో డంపు చేయిస్తున్నారన్నారు. గత కొద్ది రోజులుగా గుత్తేదారుకు, రవాణాదారుల మధ్య వివాదం తీవ్ర స్థాయిలో సాగుతుంది. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమస్య తీవ్రమవుతుండడంతో వారంతా నిరసనబాట పడతామంటున్నారు.

**ఏడు లారీలు స్వాధీనం:** అధిక లోడుతో వెళ్తున్న ఏడు ఇసుక లారీలను తహసీల్దార్ శ్రీవల్లి స్వాధీనం చేసుకున్నారు. కొన్నింటిలో పరిమితికి మించి ఉండడాన్ని గుర్తించి వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి అపరాధ రుసుం వేశారు. కొందరు రుసుం చెల్లించినా వాటిల్లోని ఇసుకను మింది నిల్వ కేంద్రంలో డంపింగ్ చేయించారు. ఆ ఇసుకను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని ఆమె ఉన్నతాధికారులకు లేఖ రాశారు. అపరాధ రుసుం చెల్లిస్తామని, ఇసుకతో కలిపి లారీలు అప్పగించాలని రవాణాదారులు తహసీల్దార్ మీద ఒత్తిడి తెస్తుండగా దీనికి సదరు అధికారి ససేమిరా అన్నారు.

# సాగవోయి.. దీక్షధారి

ఆత్మకూరు : దట్టమైన అడవి.. ఎత్తయిన కొండలు..పక్షుల కిలకిలరావాలు.. పచ్చని గొడుగు కింద పయనం.. అణువణువునా ఆధ్యాత్మిక చింతన.. దట్టమైన నల్లమలలో 40 కి.మీ నడకదారిలో పది రోజుల పాటు శివనామస్మరణ మార్మోగనుంది. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిమంది శివమాలధారులు, మొక్కులున్న భక్తులు ఈ మార్గంలో మల్లన్న సన్నిధికి పాదయాత్రగా వెళ్లనున్నారు. ఈ నెల 17 నుంచి 23 వరకు అటవీ శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. **మంచినీరు:** పాదయాత్రగా వచ్చే భక్తులు తమ వెంట 2, 5 లీటర్ల నీటి సీసాలే తీసుకెళ్లడానికి అనుమతిస్తారు. స్టీలు, రాగి, గుడ్డసంచుల్లో నీరు తెచ్చుకుంటే మంచిది. మూడు ప్రాంతాల్లో నీటి ట్యాంకులు అందుబాటులో ఉంచనున్నారు.

**నిరంతరం పర్యవేక్షణ:** 25 మంది అటవీ సిబ్బంది, 40 మంది ప్రొటెక్షన్ వాచర్లు, 70 మంది వాలంటీర్లు సేవలు అందించనున్నారు. ఒక్కో బేస్ క్యాంప్‌లో 5- 10 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు.

చెత్తకుండీలు: చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులు ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా దారి వెంట కి.మీలకు రెండు చొప్పున సుమారు వంద చెత్తకుండీలు ఉంచుతారు. విడిది కేంద్రాలు: పల్లెకట్ట, పాతపెంట,



నాగలూటి, పంగిడి, దామర్లకుంట, పెచ్చెర్వు, వీరభద్రుని తాపలు, మఠంబావి, భీమునికొలను, కైలాసద్వారం, అటకేశ్వరం ప్రాంతాల్లో తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నదానాలు: నాగలూటి, దామర్లకుంట, పెచ్చెర్వు, భీమునికొలను ప్రాంతాల్లో అన్నదాన కేంద్రాలు ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతి ఇచ్చింది. వైద్య శిబిరాలు: నడకదారిలో పది చోట్ల, వెంకటాపురం, కృష్ణాపురం, ఆత్మకూరు, ఎస్సార్బీసీ కాలనీ, మార్గ మధ్యలోని ఇతర గ్రామాలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

ఇవి నిషేధం: పాదయాత్ర భక్తులు బీడీ, సిగరెట్, అగ్గిపెట్టె వంటి వాటిని తీసుకెళ్లకూడదు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేసిన అనంతరమే పంపిస్తారు. వీరు రాకపోవడమే మంచింది: గుండె, ఆస్తమా వంటి జబ్బులున్న వారు, 70 ఏళ్లు పైబడిన వారు పాదయాత్ర చేయటం శ్రేయస్కరం కాదు. దారిలో వైద్యశిబిరాలున్నా అత్యవసర సేవలు అందుబాటులో ఉండవు.

# బేరాలు.. దొంగాటలు

ఒంగోలు : క్రీడలకు నకిలీ మకిలి అంటింది. సంఘాల నిర్వాహకులు కొందరు కాసుల కక్కుర్తితో అర్హులకు తీరని అన్యాయం చేస్తున్నారు. దొంగ పత్రాలు సృష్టించి జేబులు నింపుకొంటున్నారు. అదే సమయంలో ఎన్నో త్యాగాలు చేస్తున్న వారిని ఎదతాళి చేస్తున్నారు. తమ బేరాలు, చీకటి వ్యవహారాలతో అసలు సంఘాలు, క్రీడాకారులను అవమానించేలా వ్యవహరిస్తున్నారు.

**మూసేసిన కళాశాల పేరిట మస్కా**

గ్రామ సచివాలయంలో పశు సంవర్ధక సహాయకుడిగా పనిచేస్తున్న ఓ యువకుడు ఇటీవల హైకోర్టులో ఉద్యోగానికి ఎంపికయ్యారు. అతను నకిలీ క్రీడా పత్రాలతో కొలువు సాధించారంటూ అదే పోస్టుకు పోటీ పడిన మరో యువకుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సింగరాయకొండ విక్టరీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పనిచేసిన బక్కా ఈశ్వరయ్య అనే వ్యక్తి కూడా స్పందించారు. 2022లోనే తమ కళాశాల మూసివేసినప్పటికీ తన సంతకాన్ని ఫోర్జరీ చేసి 2024లో నకిలీ పత్రాలు సృష్టించారని గత సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందించారు. బాధ్యులైన కొన్ని క్రీడా సంఘాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో నకిలీ ధ్రువీకరణ పత్రాల బాగోతం మరోసారి తెర పైకి వచ్చింది.



**అర్హులకు ఎనలేని అన్యాయం**

క్రీడలనే భవిష్యత్తుగా ఎంచుకున్న క్రీడాకారులు వ్యక్తిగత జీవితాలను పణంగా పెడుతుంటారు. మైదానమే లోకంగా నిత్యం సాధనలోనే మునిగి తేలుతుంటారు. వారి కుటుంబాలు కూడా విందులూ వినోదాలు, శుభకార్యాలకు దూరంగా ఉంటూ తమ పిల్లల భవిష్యత్తు కోసం వారిని ప్రోత్సహిస్తుంటారు. అటువంటి వారి కృషి, పట్టుదల, త్యాగాలను అపహాస్యం చేసేలా కొందరు క్రీడాసంఘాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. కనీసం ఎప్పుడూ మైదానం ముఖం చూడని వారికీ, క్రీడలతో కనీసం పరిచయమే లేనివారికి పత్రాలను తెగనమ్ముకుంటున్నారు. ప్రతిభావంతులకు ఎనలేని అన్యాయం చేస్తున్నారు.

**అడ్డదారుల్లో భలే వ్యాపారం**

క్రీడాసంఘాల నిర్వహణను కొందరు లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో క్రీడా కోటా ఉండటంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆటల దిశగా ప్రోత్సహిస్తున్నారు. అదే సమయంలో మరికొందరు అడ్డదారులు వెతుకుతున్నారు. ఇటువంటి వారి ఆశలను కొన్ని క్రీడా సంఘాల నిర్వాహకులు ఆదాయ వనరుగా భావించి దొంగాట ఆడుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పత్రాలకు ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు. జిల్లాలోని పలు క్రీడా సంఘాలకు ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా అధ్యక్ష, కార్యదర్శులమంటూ కొందరు పదవులను పట్టుకుని వేలాడుతున్నారు. ఒలింపిక్ సంఘం గుర్తింపు లేని క్రీడాంశాలను నిర్వహిస్తూ ఇటు క్రీడాకారులు, అటు వారి తల్లిదండ్రులను భ్రమల్లో ఉంచి సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్లే పేరిట భారీగా ముడుపులు గుంజుతున్నారు. ఈ తరహా క్రీడా సంఘాల ప్రతినిధులపై ఉన్నతాధికారులు స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి ఉంది.

చురకలు



## ఈమె వయసు తగ్గుతుందా ఏంటి?

2001లో 'ఇష్టం' సినిమాతో టాలీవుడ్‌లో శ్రియా సరన్ అడుగు పెట్టింది. మొదటి సినిమానే భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అంతే కాకుండా నటనకు ఆస్కారం ఉన్న పాత్ర చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఇష్టం సినిమాతో టాలీవుడ్‌లో జెండా పాతిన శ్రియా వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం రాలేదు. ఇష్టం సినిమా సూపర్ హిట్ కావడంతో వెంటనే స్టార్ హీరో నాగార్జున సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. అప్పట్లో నాగార్జున సినిమాలో నటించే అవకాశం రావడం అనేది స్టార్ హీరోయిన్ కావడానికి దారి వంటిది అంటారు. అలా నాగార్జున నటించిన సంతోషం సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించినప్పటికీ ఎక్కువ గుర్తింపు ఈమెకే లభించింది. నాగార్జునతో సినిమా తర్వాత మరోసారి బాలకృష్ణతో సినిమాలో నటించింది. బాలకృష్ణ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్ చెన్నకేశవ రెడ్డి సినిమాలో శ్రియా నటించింది. ఆ తర్వాత తరుణ్‌తో నువ్వే నువ్వే, ఉదయ్ కిరణ్ తో నీకు నేను నాకు నువ్వు, మెగాస్టార్ చిరంజీవితో ఠాగూర్ సినిమాలు చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పటి నుంచి వరుసగా మూడు సంవత్సరాలు వరుస విజయాలను సొంతం చేసుకుంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా అర డజను సినిమాలు వరుసగా ఈమెకు సక్సెస్‌ను తెచ్చి పెట్టడంతో దాదాపు



రెండు దశాబ్దాల పాటు సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. తెలుగులోనే కాకుండా హిందీ, తమిళ్, ఇంగ్లీష్ సినిమాలోనూ శ్రియా నటించిన విషయం తెల్సిందే. శ్రియా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు పాతిక ఏళ్లు అవుతోంది, అంతే కాకుండా ఆమె వయసు కూడా నాలుగు పదులు దాటింది. హీరోయిన్‌గా వరుసగా ఆఫర్లు దక్కడం లేదు. దాంతో కొన్నాళ్ల క్రితం పెళ్లి చేసుకుని తల్లిగా కూడా మారింది. పెళ్లి, పిల్లల తర్వాత సినిమా ఇండస్ట్రీ ఎందుకు, సోషల్ మీడియా ఎందుకు అని కొందరు అనుకుంటూ ఉంటారు. కానీ శ్రియా మాత్రం అలా అనుకోలేదు. వచ్చిన ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది. సోషల్ మీడియాలో తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఫ్యాన్స్‌ను మాత్రమే కాకుండా అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. సింపుల్ బ్లూ అండ్ బ్లాక్ కాంబోలో ఔట్ ఫిట్‌ను ధరించిన శ్రియా సరన్ ఎప్పటిలాగే మతి పోగొట్టే విధంగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. శ్రియా అందం ముందు ఈమధ్య కాలంలో ఇండస్ట్రీలో అడుగు పెట్టి స్టార్ హీరోయిన్స్‌గా గుర్తింపు తెచ్చుకున్న వారు సైతం దిగదుడుపే అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో శ్రియా ఈ ఫోటోలను షేర్ చేసిన వెంటనే లక్షల్లో లైక్స్ వస్తున్నాయి. అంతే కాకుండా ఈమె వయసు పెరుగుతుందా, తగ్గుతుందా అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇష్టం సినిమాలో ఎంత క్యూట్‌గా ఉందో ఇప్పుడు కూడా అంతే క్యూట్‌గా అందంగా ఉందని కొందరు ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.

## 'హిట్ 3'.. నాని గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడు!

నాని హీరోగా నటించనున్న 'హిట్ 3' సినిమా గురించి రోజుకో కొత్త అప్డేట్ బయటికి వస్తోంది. మొదటి రెండు భాగాల్లో వరుసగా విశ్వక్ సేన్, అడివి శేష్‌లు లీడ్ రోల్స్ చేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీలో.. ఇప్పుడు నాని మెయిన్ లీడ్‌గా వస్తుండటం సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇదే సర్‌ప్రైజ్‌కు తోడు.. ఈ సినిమాలో మరో ఆసక్తికరమైన నటుడిని తీసుకొచ్చినట్టు సమాచారం. సినిమా కేవలం తెలుగు ప్రేక్షకులకు మాత్రమే కాకుండా.. పాన్ ఇండియా రేంజ్‌లో ఆకట్టుకునేలా ఉండబోతోందట. దర్శకుడు శైలేష్ కొలను ఈసారి కథను మరింత విస్తృతంగా అందరికి కనెక్ట్ అయ్యేలా డిజైన్ చేశారని సమాచారం. కాశ్మీర్ నుంచి బీహార్ వరకు విస్తరించిన కథాంశంతో, ఇండియా మొత్తం తిరిగే ప్లాన్‌లో ఉన్నట్లు టాక్. ఇందులో హిందీలోనే మాట్లాడే ఒక క్యారెక్టర్ కాస్త హైలెట్ అవుతుందట. ఇక అందుకు అవసరమయ్యే క్యారెక్టర్‌కు ఒక ప్రముఖ నటుడిని తీసుకున్నారట. అతను మరెవరో కాదు, 'సూపర్ బాయ్స్ ఆఫ్ మలేగావ్' ఫేమ్ సాకిబ్ అయూబ్ అని తెలుస్తోంది. నానికి ఏ క్యారెక్టర్ కోసం ఏం కావాలో స్పష్టంగా తెలుసు. అందుకే తన వాయిస్, యాక్టింగ్ పరంగా బాగా కనెక్ట్ అయ్యేలా చేసినట్టు చెబుతున్నారు. సినిమా ప్రీ ప్రొడక్షన్ సమయంలోనే సాకిబ్‌ను ఈ పాత్రకు తీసుకోవాలని నాని డిసైడ్ అయ్యాడట.



మొదటిసారి నానితో కలిసి పనిచేసే అవకాశం రావడంతో, సాకిబ్ ఆశ్చర్యపోయాడట. కానీ షూటింగ్ మొదలైన తర్వాత ఆయన నాని వర్కింగ్ స్టైల్, పర్ఫెక్షన్ చూసి నానికి అంతం రిస్పెక్ట్ ఎందుకు ఇస్తారో అర్థమైందని అంటున్నాడు. సినిమా పాన్ ఇండియా లెవల్లో నిర్మించబోతుండటంతో.. ఇందులోని పాత్రలకు మరింత ప్రాముఖ్యత పెరిగిందట. 'హిట్ 3'లో నాని చేసే పాత్రలో భారీ యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయని టాక్. ఇదివరకు వచ్చిన రెండు పార్ట్స్‌లోనూ డిటెక్టివ్ థ్రిల్లర్ టోన్ ఎక్కువగా ఉండగా.. ఈసారి మాత్రం స్టోరీ మలుపులు మరింత థ్రిల్లింగ్‌గా ఉండబోతున్నాయి. పైగా గత సినిమాల కంటే స్క్రీన్‌ప్లేలో ఇన్వెస్టిగేషన్‌ను మళ్లీ కొత్తగా ట్రై చేసినట్టు తెలుస్తోంది. హిందీ బాషా నేపథ్యంతో కూడిన క్యారెక్టర్ కావడం వల్ల సాకిబ్ ఈ సినిమా కోసం స్పెషల్‌గా వాయిస్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాడట. ఇక నాని 'హిట్ 3'కి మాత్రమే కాదు, ఈ ఫ్రాంచైజీకి నిర్మాతగా ఉండడం అతనికి స్పెషల్ క్రెడిట్ తెచ్చిపెట్టింది. గతంలో వచ్చిన రెండు భాగాలూ నాని బ్యానర్‌లోనే వచ్చాయి. కానీ ఈసారి మూడో పార్ట్‌లోనే మెయిన్ లీడ్‌గా నటిస్తూ మరో ప్రయోగం చేస్తున్నాడు. ఇది కచ్చితంగా సినిమాకు మరింత బలం ఇవ్వబోతుంది. థ్రిల్లర్ జానర్‌కు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యాన్ని నాని ఎలాగైనా మరింత ప్రామాణికంగా ఉపయోగించుకోవాలని ప్లాన్ చేస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా 2025లో విడుదల కానుంది. అందులోనూ హిట్ ఫ్రాంచైజీ గత రెండు సినిమాలకు బాగా పేరు రావడం, టెక్నికల్ వాల్యూస్ పరంగా చాలా హై స్టాండర్డ్స్‌లో ఉండటంతో 'హిట్ 3'పై భారీ అంచనాలు ఉన్నాయి. మరి, నాని ప్రధాన పాత్రలో వచ్చిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.





## విక్రమ్ వీర ధీర శూర టీజర్ టాక్..!




చియాన్ విక్రమ్ హీరోగా యాక్షన్ రూరల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా వస్తున్న సినిమా వీర ధీర శూర. ఈ సినిమాను ఎస్.యు అరుణ్ కుమార్ డైరెక్ట్ చేశారు. సిద్ధార్థ్ తో చిత్తా అదే తెలుగులో చిన్నా గా రిలీజైన సినిమాను డైరెక్ట్ చేసిన ఈ దర్శకుడు ఇప్పుడు విక్రం తో వీర ధీర శూర సినిమా తెరకెక్కించారు. ఈ సినిమాను హెచ్.ఆర్ పిక్చర్స్, రియా శిభు నిర్మించారు. ఈ సినిమాకు సంబందించిన టీజర్ లేటెస్ట్ గా రిలీజ్ చేశారు మేకర్స్. రేషన్ డీలర్ అయిన విక్రమ్ కి పోలీస్ ఆఫీసర్ ఎస్.జె సూర్య మధ్య జరిగే యుద్ధమే వీర ధీర శూర సినిమా కథ అని తెలుస్తుంది. సినిమా టీజర్ లో కథ గురించి పక్కన పెడితే విజువల్స్, బిజిఎం విక్రం యాక్షన్ ఇవన్నీ అదిరిపోయాయి. చాలా రోజుల తర్వాత విక్రం తన మార్క్ సినిమాతో వస్తున్నాడని టీజర్ చూస్తేనే అనిపించింది. తంగళాన్ తో వచ్చి పర్వాలేదు అనిపించుకున్న విక్రం ఈసారి వీర ధీర శూర తో హిట్ టార్గెట్ పెట్టుకున్నాడని అర్థమవుతుంది. సినిమాకు జివి ప్రకాష్ మ్యూజిక్ మరో హైలెట్ అయ్యేలా ఉంది. సినిమా టీజర్ తోనే ఆడియన్స్ లో మంచి పాజిటివ్ బజ్ ఏర్పరచుకున్నారు. చియాన్ విక్రమ్ కు తెలుగులో కూడా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. శివపుత్రుడు, అపరిచితుడు సినిమాల టైం నుంచి విక్రమ్ సినిమాలు తెలుగులో బాగా ఆడాయి. ఐతే ఈమధ్య పూర్తిగా ఫాం కోల్పోయిన ఆయన తిరిగి ఫాంలోకి రావాలని తెగ ప్రయత్నిస్తున్నాడు. సినిమాలో విక్రమ్ తో పాటుగా ఎస్.జె సూర్య, సూరజ్ వెంజరమూడు, దసరా విజయన్ నటిస్తున్నారు. మార్చి 27న రిలీజ్ ప్లాన్ చేసిన ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తెస్తున్నారు. సినిమా టీజర్ చూస్తే విక్రం కోరుకుంటున్న సూపర్ హిట్ దక్కేలానే ఉంది. చియాన్ విక్రం సినిమా అంటే చాలు తెలుగు ఆడియన్స్ ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూసేవాళ్లు. ఐతే ఈమధ్య ఆయన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టాయి. అందుకే విక్రం సినిమా అంటే ఇదివరకు ఉన్నంత బజ్ లేదు. ఐతే వీర ధీర శూర టీజర్ మాత్రం అంచనాలు పెంచేలా ఉంది. సినిమా హిట్ పడితే మాత్రం విక్రం తిరిగి ఫాం లోకి వచ్చినట్టే లెక్క అని చెప్పొచ్చు.

## 'కాలమేగా కరిగింది' ట్రైలర్ టాక్: కలహాలే లేని ఓ ప్రేమ కథ



సినిమా అనేది కేవలం విజువల్ ఎక్స్‌పీరియన్స్ మాత్రమే కాదు, మనసును తాకే భావోద్వేగాల కలయిక కూడా. ఇప్పటివరకు వెండితెరపై ప్రేమకథలు ఎన్నో వచ్చాయి, పోయాయి. కానీ కొన్ని కథలు మన లోపల ఏదో తీయని అనుభూతిని మిగిల్చి మన జీవితంలో ఓ భాగమైపోతాయి. అటువంటి ప్రత్యేకమైన అనుభూతిని కలిగించేందుకు 'కాలమేగా కరిగింది' చిత్రం సిద్ధమవుతోంది. ఇక ట్రైలర్ విడుదల చేయగా మరింత పాజిటివ్ వైబ్ క్రియేట్ చేస్తోంది. మునుపటి కాలపు ప్రేమకథల్లో ఉండే మాధుర్యాన్ని, అమాయకత్వాన్ని ఈ కథలో సరికొత్తగా మలిచారు. మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా విడుదలవుతున్న ఈ సినిమా, ప్రేమను కవిత్వంగా మలిచిన ఓ ప్రత్యేకమైన ప్రయాణంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన రెండు పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ట్రైలర్‌లో చూపించిన విజువల్స్ కూడా బలంగా చెబుతున్నాయి. స్కూల్ డేస్ లోని బాల్యప్రేమ, అందులోని అమాయకత్వం, మొదటి చూపు ప్రేమ, ఆతర్వాత మారిన పరిస్థితులు.. ఇవన్నీ కలిసిన ఈ ప్రయాణాన్ని మధురంగా మలిచారు. ఫణి-బిందు అనే ప్రేమికుల మధ్య ప్రేమ కథను సున్నితంగా అల్లిన విధానం ఆకట్టుకుంటుంది. దూరమైన అనుబంధాలు, మళ్లీ కలిసే అవకాశాలు ఇవన్నీ కథను మరింత ఆసక్తికరంగా మలచనున్నాయి. ఈ కథలో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. కలహాలే లేని ప్రేమకథ.. అని ట్యాగ్ ఇచ్చినట్లుగా ఎలాంటి విరుద్ధతలూ లేవు. అణచివేత, సంఘర్షణ, ఊహించని మలుపులు లేవు. కానీ నెమ్మదిగా పండే భావోద్వేగం, ఒకరినొకరు గుర్తు చేసుకుంటూ వెళ్ళే అనుభూతి ఇందులో ప్రధానంగా కనిపిస్తుంది. ట్రైలర్ చూసినవారిలో ఒకటే మాట వినిపిస్తోంది.. ఇది ప్రేమను మళ్లీ నమ్మించే సినిమా. ప్రేమ అనేది ఒకరికి దూరమైపోయినా జ్ఞాపకాల రూపంలో మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. ఇదే విషయాన్ని ఈ కథ మృదువుగా చెబుతోంది. సింగార మోహన్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. కథను సమర్థంగా హ్యాండిల్ చేసిన విధానం ట్రైలర్‌లోనే స్పష్టంగా కనిపిస్తోంది. వినీత్ పబ్బటి అందించిన విజువల్స్ ప్రతి ఫ్రేమ్‌ను అందంగా మార్చాయి. అందమైన లొకేషన్లు, రీ-కనెక్ట్ అవుతున్న జ్ఞాపకాలు సినిమాకు ఓ ప్రత్యేకమైన టోన్ అందించాయి. గుడప్పన్ అందించిన సంగీతం ఇప్పటికే మంచి స్పందన అందుకుంది. బీజీఎమ్ అయితే కథను మరింత ఎమోషనల్‌గా మలచనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వినయ్ కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముడిగొండ, నోమినా తారా ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని సింగార క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై మరే శివశంకర్ నిర్మించారు. ట్రైలర్ చూసిన తర్వాత సినిమా మీద అంచనాలు పెరిగాయి. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో మేకర్స్ త్వరలో మరిన్ని అప్డేట్స్ విడుదల చేయనున్నారు. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఆదరించే అలవాటు తెలుగు ప్రేక్షకులకు ఉన్న సంగతి తెలిసిందే. ఇక 'కాలమేగా కరిగింది' కూడా అదే తరహాలో ఆకట్టుకునే అవకాశం ఉన్నట్లు అనిపిస్తోంది.

## అనన్య నాగళ్ల.. సడన్ గా ఇలా హీటెక్కిస్తే ఎలా?

తెలుగు ప్రేక్షకులకు మల్లేశం చిత్రంతో పరిచయమైన అనన్య నాగళ్ల, అప్పట్లో తన సహజమైన నటనతో మంచి పేరు తెచ్చుకుంది. ఓ గ్రామీణ యువతిగా కనిపించిన ఆమె, ఆ సినిమాతోనే నటిగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. అయితే అనన్య కెరీర్‌ను పరిశీలిస్తే, ఆమె ప్రయాణం కేవలం నటనతోనే కాకుండా గ్లామర్ వైపు కూడా యూ టర్న్ తీసుకుంటున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. వకీల్ సాబ్ వంటి సినిమాల్లో తన మృదువైన నటన చూపించినప్పటికీ, ప్రస్తుతం సోషల్ మీడియాలో తన గ్లామరస్ లుక్స్‌తో మరో లెవల్ క్రేజ్ తెచ్చుకుంటోంది. ఇటీవల అనన్య నాగళ్ల ఫొటోషూట్స్ ట్రెండ్ అవుతున్నాయి. మరింత బోల్డ్ అవతారం ఎత్తిన అనన్య, తన స్టైల్‌ను పూర్తిగా మార్చేసింది. ఆమె షేర్ చేసిన సారీ ఫొటోలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతున్నాయి. పసుపు రంగు చీరలో, క్లోజ్-ఫిట్ బ్లౌజ్‌తో ఒంటిపై కాంతిని మెరిపిస్తూ ఆమె ఇచ్చిన హొయలే వేరు. కిల్లింగ్ లుక్స్‌తో,



కళ్లతో మాట్లాడే అందంతో ఆమె ఫొటోలు వైరల్ అయ్యాయి. ఒకప్పుడు క్లాసిక్ పాత్రల్లో మాత్రమే కనిపించిన అనన్య, ఇప్పుడు ఫుల్ గ్లామరస్ అవతార్‌లో దర్శనమిస్తోంది. ఇది చూసిన నెటిజన్లు, ఇమే మల్లేశం భామననే.. అంటూ ఆశ్చర్యపోతున్నారు. ప్రత్యేకంగా, ఆమె తన సోషల్ మీడియా ఫాలోయింగ్‌ను పెంచుకునే దిశగా ముందుకు సాగుతుందనే అభిప్రాయం కలుగుతోంది. డిజిటల్ ప్రపంచంలో యాక్టివ్‌గా ఉంటూ, నిత్యం హాట్ ఫోటోషూట్‌లతో ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగిస్తోంది. ఇటీవల ఆమెను వెబ్‌సిరీస్‌లు, మిడియం రేంజ్ సినిమాలు కూడా పలకరిస్తున్నాయట. ఆమె గ్లామర్ గేమ్ మరింత పెంచుకుంటూ వెళితే, టాలీవుడ్‌లో టాప్ గ్లామరస్ హీరోయిన్‌గా మారేందుకు సమయం చాలా దూరం లేదని అంటున్నారు. సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలోనూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారిన అనన్య నాగళ్ల, భవిష్యత్తులో మరింత వైవిధ్యమైన పాత్రలతో రాణిస్తుందా లేక ఫుల్ గ్లామర్ రూట్‌లోకి వెళ్లిపోతుందా? అనే చర్చ మాత్రం ఇండస్ట్రీలో నడుస్తోంది. ఏదేమైనా, ఆమె తాజా గ్లామరస్ ఫోటోషూట్‌లు మాత్రం టాలీవుడ్ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారాయి.

## డ్రాగన్... ముందుగానే ఎన్టీఆర్!

ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ ఇటీవలే ప్రారంభం అయిన విషయం తెల్సిందే. ఎన్టీఆర్ లేని యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించి ఒక ఫోటోను సైతం విడుదల చేశారు. భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిపిన దర్శకుడు ప్రశాంత్ నీల్ కొత్త షెడ్యూల్‌కి ప్లాన్ చేస్తున్నాడు. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ నెలలోనే ఎన్టీఆర్ షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నాడు. మొదట ఈ సినిమా కోసం ఎన్టీఆర్ వచ్చే నెల నుంచి షూటింగ్ కి హాజరు కావాల్సి ఉంది. కానీ వార్ 2 సినిమా పాట చిత్రీకరణ మధ్యలో నిలిచి పోవడంతో ఎన్టీఆర్ కి ముందుగానే సమయం లభించిందట. వార్ 2 సినిమా పాట చిత్రీకరణ సమయంలో హృతిక్ రోషన్ ప్రమాదానికి గురి అయ్యాడు. ఆయన నిల్చోవడానికి ఇబ్బంది పడుతున్నాడు. ఇలాంటి సమయంలో ఆయన డాన్స్ చేసే పరిస్థితి లేదు. దాంతో కనీసం నెల రోజుల పాటు షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చారు. ఆ కారణంగానే డ్రాగన్ సినిమా షూటింగ్ కోసం ఎన్టీఆర్ ముందుగానే డేట్లు ఇచ్చాడని తెలుస్తోంది. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమా ఉంటుంది అంటూ మేకర్స్ చెబుతూ వస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ



సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సైతం సహ నిర్మాతగా ఈ సినిమా నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నాడు. ఎన్టీఆర్ ఈ నెలలో పాల్గొనబోతున్న షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీన్స్‌ను షూట్ చేయబోతున్నారు. అంతే కాకుండా ఎన్టీఆర్ పై సోలో సాంగ్‌ను షూట్ చేస్తారని తెలుస్తోంది. ఒకే షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలు, సోలో సాంగ్‌ను షూట్ చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఈ షెడ్యూల్ ఏప్రిల్ రెండవ వారం లేదా మూడో వారం వరకు కొనసాగుతుందని తెలుస్తోంది. ఆ తర్వాత తిరిగి వార్ 2 షూటింగ్‌లో ఎన్టీఆర్ పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. తద్వారా ఎన్టీఆర్ రెండు సినిమాలను సమాంతరంగా చేస్తున్నట్లు అవుతుంది. ఈమధ్య కాలంలో ఇలా ఒకేసారి రెండు సినిమాలు చేస్తున్న హీరోలు తక్కువ మంది ఉన్నారు. ప్రభాస్ మాత్రం ఒకేసారి మూడు నాలుగు సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే.

డ్రాగన్ సినిమాను 2026 సంక్రాంతికి విడుదల చేస్తామని ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ సినిమా అంటే కచ్చితంగా భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. అందుకు తగ్గట్లుగానే వీఎఫ్ఎక్స్ వర్క్ ఉంటుంది. అయినా కూడా వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను విడుదల చేయడం సాధ్యమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రశాంత్ నీల్ ప్రతిసారి తన సినిమాను అనుకున్న డేట్‌కి కాకుండా వాయిదా వేస్తూ వస్తున్నారు. కనుక ఈ సినిమాను సైతం ఆయన వాయిదా వేస్తారని కొందరు భావిస్తున్నారు. ఒకవేళ నిజంగానే వచ్చే ఏడాది జనవరిలో సినిమాను విడుదల చేస్తే కచ్చితంగా ఫ్యాన్స్‌కి పండగే అనడంలో సందేహం లేదు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M), DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536